www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 192 | మంగళవారం 02-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

అవినీతే అభివృద్ధా..?

- ఏసీబీ దాడుల్లో సాధారణ అధికారుల వద్ద రూ.2500 కోట్లా..
- ప్రజల్ని ఎన్నాళ్లు మభ్యపెడతారు..
- ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ ఘాటైన లేఖ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
అవినీతే అభివృద్ధా.. అవినీతి నిరోధక శాఖ దాడుల్లో సాధారణ అధికారుల వద్ద 2,500 కోట్ల రూపాయలా.. ప్రజలను ఎంతకాలం మభ్య పెడతారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఘాటైన లేఖ రాశారు.

నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మీరు రాసిన లేఖ చదివాను. మీరు ప్రజలను మరో మారు మభ్యపెట్టడానికి ప్రయత్నించారు. పూర్తి అసత్యాలు, అర్థ సత్యాలతో లేఖ రాశారని ఆయన పేర్కొన్నారు.

గత 42 మాసాలుగా ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగాన్ని మిషన్ మోడ్‌లో పని చేయించామని చెప్పుకున్నారు. తనకు తెలిసినంత వరకు పరిపాలనా యంత్రాంగం ఇంతగా అవినీతి, లంచగొండితనంలో కూరుకుపోవడం ఎన్నడూ చూడలేదని, దాదాపు అన్ని డిపార్టుమెంట్లలోనూ లంచం లేకుండా ఏ ఒక్క పనీ జరగడం లేదని లేఖలో తెలిపారు.

2016 సంవత్సరం నవంబరు నెల నుండి 2017 నవంబరు ఆఖరు వరకు 12 మాసాల వ్యవధిలో ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో దాదాపు రూ.2,500 కోట్ల ఆస్తులు సీజ్ చేశారంటే పరిపాలనా యంత్రాంగంలో అవినీతి ఎంత విచ్చలవిడిగా జరుగుతున్నదో అందరికీ అర్థమైంది. ఒక టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆస్తులు రూ.500 కోట్లగాను, ఒక చీఫ్ ఇంజనీర్ ఆస్తులు రూ.800 కోట్లగాను గుర్తించారంటే సాధారణ ప్రజలు విస్తుపోతున్నారు. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారు. ఫిరాయింపులకు పెద్ద పీట వేయడం ద్వారా రాజకీయాల్లో నైతిక విలువలకు పాతరేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారని లోకం కోడై కూస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నదని చెప్పుకోవడం మీకే చెల్లిందని సీపీఐ నేత రామకృష్ణ ఘాటుగా పేర్కొన్నారు. గత మూడేళ్లుగా రాష్ట్రంలో దాదాపు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఎంఓయూలు కుదుర్చుకున్నామన్న ప్రకటనలు బూటకపు ప్రచారమని తేలిపోయింది. అనంతపురం జిల్లాలో నిర్మాణమవుతున్న కార్ల ఫ్యాక్టరీ మినహా ఎక్కడా వాటి జాడ కనబడలేదు. అలాగే మీరు చెబుతున్నట్లుగా అమరావతి రాజధాని నిర్మాణం పత్రికా ప్రకటనలకు, కలర్‌ఫుల్ డిజైన్లకే పరిమితమైంది తప్ప ఎలాంటి పురోగతి లేదని - మిగతా 2 లో



దళితుల గ్రామ బహిష్కరణ

కర్నూలు జిల్లా నక్కలదిన్నెలో అగ్రవర్ణాల దాష్టీకం
నేటికీ అంటరానితనం, వివక్ష
నిత్యావసర సరుకులు, తాగునీరు, విద్యుత్ సరఫరా బంద్

11లో

• మోడీ పాలన

పెదవి విరుపు

భారత్‌లో పెట్టుబడులకు అవినీతే అతిపెద్ద అవరోధం



భారత్‌లో పెట్టుబడులకు అవినీతే అతిపెద్ద అవరోధమని, విదేశీ మదుపరులకు ఇప్పటికీ అదే అతిపెద్ద సవాల్ అని అమెరికా రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ క్రోల్ వ్యాఖ్యానించింది. 2014లో కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు దేశంలో వ్యాపార నిర్వహణ తీరు చెప్పుకోదగ్గ స్థాయిలో మారుతుందని విదేశీ మదుపరులంతా ఆశించారని, అయితే అంచనాలకు తగ్గట్లుగా ఏమీ జరగలేదన్నదీ న్యూయార్క్ ఆధారిత రిస్క్ కన్సల్టెన్సీ. బ్యాంకింగ్ రంగాన్ని వేధిస్తున్న నిధుల కొరత, వివాదాస్పద పన్ను నిర్ణయాలు, అధిక నిరుద్యోగం వల్ల తలెత్తుతున్న సామాజిక ఆందోళనలు, రాష్ట్ర స్థాయి రాజకీయాలు తదితర అంశాలన్నీ విదేశీ పెట్టుబడులను ప్రభావితం చేస్తున్నట్లు సదరు సంస్థ పేర్కొన్నది.

న్యూఢిల్లీ :
భారత్‌కు.. ప్రపంచ బ్యాంకు సులభతర వాణిజ్య విధానం రేటింగుల్లో 30 స్థానాలు ఎగబాకి 100వ స్థానం దక్కింది, మూడీస్ సార్వభౌమ రేటింగ్‌లో ఒక మెట్టు పైకెక్కింది మోదీ పాలనలోనేనన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ వ్యాపారానికి భారత్‌ను అత్యంత అనుకూలంగా మారుస్తామని చెప్పిన ప్రస్తుత నరేంద్ర మోదీ సర్కారు.. ఆ స్థాయిలో పని చేయలేకపోయింది. పలు సంస్కరణలు తెచ్చినప్పటికీ.. వాటి ఫలాలు ఇంకా అందలేదు అని క్రోల్ మేనేజింగ్

- విదేశీ మదుపరుల్లో అనాసక్తి
- అమెరికా సంస్థల నివేదికలు
- నిధుల కొరత.. వివాదాస్పద పన్ను నిర్ణయాలు
- పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక ఆందోళనలు

డైరెక్టర్ తరుణ్ భాటియా పీటీఐతో అన్నారు.

పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలుతో కలిగిన ఇబ్బందులను పరిష్కరించడంతోపాటు దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంపైనే బీజేపీ ప్రభుత్వ భవితవ్యం ఆధారపడి ఉన్నదని చెప్పారు. అయితే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చితే భారత్ వృద్ధిరేటు ఆకర్షణీయంగా ఉండటం, దివాలా చట్టం, రెరా, జీఎస్టీ తదితర సంస్కరణలు తీసుకురావడం వల్లే విదేశీ మదుపరుల్లో కొందరైనా భారత్ వైపు చూడగలుగుతున్నారని భాటియా వ్యాఖ్యానించారు. కాగా, కొన్ని దేశాల్లో అమలవుతున్న అతిపెద్ద సంక్షేమ పథకాల ప్రయోజనాలు అనర్హులకే అధికంగా అందుతున్నాయి. పేదలకు చేరాల్సిన సొమ్మును అధికారులు మింగేయడమో, ఆలస్యంగా ఇవ్వడమో చేస్తున్నారు అని అవినీతిపై ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదిక సైతం అభిప్రాయపడటం గమనార్హం. ఇదిలావుంటే 2017 ఆరంభంలో విడుదలైన క్రోల్ ప్రపంచ మోసాల నివేదిక ప్రకారం అవినీతి, దిగజారుతున్న - మిగతా 2 లో

ఎస్‌బీఐ రుణాలపై వడ్డీ తగ్గింపు

ఎస్‌బీఐ నిర్ణయం

న్యూఢిల్లీ :
ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన సంవత్సర కానుకగా రుణ గ్రహీతలకు శుభవార్త అందించింది. రుణాలపై వడ్డీ రేటును 30 బేస్ పాయింట్లు తగ్గించింది. ఈ మేరకు తన వెబ్‌సైట్‌లో బ్యాంక్ పేర్కొంది. 2018 జనవరి 1 నుంచి ఈ రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. 8.95 శాతంగా ఉన్న వడ్డీరేటును 8.65 శాతానికి తగ్గించినట్లు ఎస్‌బీఐ పేర్కొంది. 2016 ఏప్రిల్‌కు ముందు బేస్ రేట్ ఆధారంగా రుణాలు తీసుకున్న వారికి ఈ తగ్గింపు వర్తిస్తుంది. బేస్ రేట్ ఆధారంగా గృహ, విద్యా రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కలుగుతుంది. చివరి సారిగా గతేడాది సెప్టెంబర్‌లో 9 శాతంగా ఉన్న వడ్డీ రేటును - మిగతా 2 లో

• శాస్త్ర విజ్ఞానంలో

ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం

శాస్త్రవేత్తలను కోరిన ప్రధాని మోడీ



కోల్‌కతా :
శాస్త్ర విజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు ప్రాంతీయ భాషలను వినియోగించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శాస్త్రవేత్తలను కోరారు. యువతలో సైన్స్‌పై ఆసక్తి పెంచడానికి ఇదొక 'పెద్ద మార్గం' అని అన్నారు. ఒక సంధాన కర్తకు భాష అవరోధం కాబోదని ఆయన తెలిపారు. కోల్‌కతాలో ప్రొఫెసర్ సత్యేంద్రనాథ్ 125వ జయంతి కార్యక్రమం పురస్కరించుకుని సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ప్రసంగించారు. ప్రాంతీయ భాషల్లో సైన్స్‌ను బోధించడంలో బోస్ ఒక యోధుడని అన్నారు. బెంగాలీ సైన్స్ పత్రికను ఆయన ప్రారంభించారని పేర్కొన్నారు. 'మన యువతకు విజ్ఞాన శాస్త్రంలో అవగాహన, ఆసక్తి కల్పించడానికి ప్రాంతీయ భాషల్లో సైన్స్‌ను బోధించడమే ఒక పెద్ద మార్గం' అని మోడీ అన్నారు. నేటి జీవితంలో సాధారణ ప్రజలకు సాయపడేందుకు శాస్త్రవేత్తలు తమ ప్రాథమిక విజ్ఞానాన్ని వినియోగించాలని కోరారు. శాస్త్ర విజ్ఞానంలో - మిగతా 2 లో

నేటి పుస్తకం.. రేపటి చరిత్ర

- భాష, సంస్కృతిని భవిష్యత్ తరాలకందించేది పుస్తకాలే
- పుస్తక మహోత్సవ ప్రారంభ సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- భాషా పరిరక్షణతోనే జాతికి జీవం : చంద్రబాబు
- విశాలాంధ్ర బుక్‌స్టాల్ సందర్శన

2లో





పొగమంచుతో ఉక్కిరి బిక్కిరి

ఢిల్లీలో 8 విమానాలు రద్దు
1300 ఆలస్యం
పార్కింగ్ లేక ఆకాశంలోనే చక్కర్లు

9లో

డ్రంక్‌డ్రైవ్‌లో ప్రదీప్



విశాలాంధ్ర బ్యూరో – హైదరాబాద్ :
కొత్త సంవత్సరం మొదటి రోజునే మందు బాబులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చుక్కలు చూపించారు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఆదివారం అర్థరాత్రి నుంచే స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో వేల కొద్ది కేసులు నమోదు చేసినట్లు తెలుస్తుంది. దాదాపు 1200 వాహనాలను సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో సోమవారం తెల్లవారుజామున పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో బుల్లితెర యాంకర్ ప్రదీప్ పట్టుబడ్డాడు. మోతాదుకు మించి ఆయన మద్యం సేవించి వాహనం నడిపినట్లు గుర్తించిన పోలీసులు - మిగతా 2 లో

ఇదీ లోకం!



జన్మభూమి కార్యక్రమాలు బాగా చేసి మంత్రిపదవి కొడతాడట!

పవిత్ర కర్తవ్యంగా భావిద్దాం

- 'జన్మభూమి - మాఊరు'ను విజయవంతం చేద్దాం
- సీఎం చంద్రబాబు స్వీయ గళంతో శ్రవణ సందేశాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 5వ విడత 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమంతో నేటి నుండి ప్రజల వద్దకు వెళుతోంది. పదిరోజుల పాటు కొనసాగే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాలనా యంత్రాంగమంతా అంతా ప్రజల ముంగిటకు తరలి వెళ్లనుంది. జనచేతనకు, సమస్యల తక్షణ పరిష్కారం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎం చంద్రబాబు స్వీయ గళంతో ధ్వనిముద్రితం చేసి విడుదల చేసిన శ్రవణ సందేశ పాఠం ఇలా ఉంది.

అందరికీ నమస్కారం
'జన్మభూమి–మా ఊరు'తో ఐదోసారి ప్రజల వద్దకు ప్రభుత్వం వస్తోంది. ఈ పది రోజులూ, పాలన మొత్తాన్ని మీ ముంగిటకు తీసుకువస్తున్నాం. ఈ అతిపెద్ద కార్యక్రమంలో - మిగతా 2 లో

'పాడి'కి స్త్రీ నిధి రుణాలు...!

- విశాఖ డెయిరీతో త్వరలో ఒప్పందం
- ఒక్కో పశువుకు రూ.50 వేలు
- డ్వాక్రా గ్రూపు సభ్యులకే ప్రాధాన్యం
- రెండో దశలో కృష్ణా పాలసమితితో కూడా



విశాలాంధ్రబ్యూరో – అమరావతి :
డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న వారికి ప్రతి నెలా నికరంగా రూ.10 వేలు ఆదాయం వచ్చేలా చేసేందుకు ప్రభుత్వం డెయిరీ రంగాన్ని ఎంపిక చేసింది. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఉన్నాయి. అనేక మంది కౌలు రైతులు, మహిళలు నేడు ఈ రంగంలో మంచి ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. దీంతో ఆ రంగంలో ఉన్న డ్వాక్రా గ్రూపు సభ్యులకు రుణాలు ఇవ్వాలని స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ నిర్ణయించింది. ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేసేందుకు కూడా ఈ రంగం అనుకూలంగా ఉండటం వల్లే డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న కుటుంబాలకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు ఇవ్వాలనే యోచనలో స్త్రీనిధి అధికారులు ఉన్నారు. ఇందుకోసం పాల ఉత్పత్తిదారుల పరపతి పరస్పర సహాయక సంఘాలతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలని నిర్ణయించింది. పాల ఉత్పత్తిని పెంచటంతోపాటు, మహిళలకు స్థిరంగా మంచి ఆదాయాన్ని ఆర్జించి పెట్టేందుకు పాడి పరిశ్రమ దోహదపడుతుంది. ఒకవైపున వ్యవసాయం చేసుకుంటూ, పశువులను మేపుకునే కుటుంబాలలో అనేక మంది మహిళలు డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా ఉన్నారు. స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్‌కు హామీగా ఉండి తమ సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి పాడి పశువులు కొనుగోలు చేసేందుకు రుణాలు ఇప్పించేందుకు శ్రీ విజయ విశాఖ పాల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (విశాఖ డెయిరీ) ముందుకొచ్చింది. పాడి పశువుల కొనుగోలుకు సంబంధించి విశాఖ డెయిరీ, స్త్రీనిధి సమాఖ్య త్వరలోనే ఎంఓయూ కుదుర్చుకోనున్నాయి. తొలి దశలో ఇచ్చే రుణాల వల్ల సత్ఫలితాలు వస్తే రెండో దశలో కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (విజయా డెయిరీ)తోనూ ఒప్పందం చేసుకోవాలని స్త్రీనిధి సమాఖ్య భావిస్తోంది. మూడో దశలో అన్ని జిల్లాల్లోని డెయిరీలతో ఒప్పందం చేసుకుని రైతులకు పాడి పశువుల కొనుగోలుకు - మిగతా 2 లో



యుద్ధాలు, అన్యాయాలతో ధ్వంసమైన 2017

పోప్ ఫ్రాన్సిస్ విచారం

వాటికన్‌సిటీ : యుద్ధాలు, అన్యాయాలు, సామాజిక, వాతావరణ పరమైన దిగజారుడు ఇంకా ఇతర మనిషి సృష్టించిన దుర్మార్గాలు 2017వ సంవత్సరాన్ని ధ్వంసం చేశాయని పోప్ ఫ్రాన్సిస్ విచారం వ్యక్తం చేశారు. సెయింట్ పీటర్స్ బసిలికాలో నూతన సంవత్సరం సందర్భంగా జరిగిన ప్రార్థనలో పాల్గొన్నవారి నుద్దేశించి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పై విధంగా అభిప్రాయపడ్డారు. 2017కు వీడ్కోలు పలుకుతూ యుద్ధాలు, అన్యాయాలతో 2017 నాశనమయ్యిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దేవుడు మనకు "సంపూర్ణమైన మంచి సంవత్సరాన్ని" ఇచ్చారు. మనుషులమైన మనం అనేక విధాలుగా దాన్ని ధ్వంసం చేశాము. మరణాలు, అబద్ధాలు, అన్యాయాలతో నాశనం చేశాము అని అన్నారు. యుద్ధాలు పదేపదే చోటు చేసుకోవడంవల్ల గౌరవం దక్కుతుందని భావించడం అన్యాయమైంది. జీవితము, వాస్తవము, సౌభ్రాతృత్వం పట్ల మహానేరాలకు పాల్పడుతున్నాము. ఇలాంటి వాటిని మానవుడు అనేక విధాలుగా నిర్వహిస్తున్నాడు. సామాజిక, వాతావరణపరమైన దిగజారుడు కనిపిస్తోంది అని పోప్ అన్నారు. దేవుడిముందు మన సోదరులకు చేసిన అన్యాయాన్ని అంగీకరించాలి. హానిజరగడానికి మనది బాధ్యత అని కూడా అంగీకరించాలి. నిరాశ అలుముకున్నప్పటికీ కృతజ్ఞత ఇంకా ఈ ప్రపంచంలో ఉంది. ప్రజలందరి సంక్షేమంకోసం నిశ్శబ్దంగా సహకరించినవారికి కృతజ్ఞతలు తెలియజేద్దాం. తల్లిదండ్రులు, విద్యావేత్తలు నైతిక విలువలతో కూడిన బాధ్యతతో పిల్లలను పెంచి పెద్దచేయాలి అని పోప్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పోప్ పిల్లలను దగ్గరకు తీసుకొని ముద్దాడారు. పోప్‌ను సందర్శించేందుకు వేలాదిమంది గంటలపాటు వేచివున్నారు.



కూలిన కోస్టారికా విమానం

12 మంది మృతి



పుంటఇస్లిట : కోస్టారికాకు చెందిన నేచర్ ఎయిర్ చార్టర్ విమానం కూలిపోయి అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయినట్టు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ఈ విమానం పుంటఇస్లిట నగరంనుంచి దేశ రాజధాని శాంజోస్‌కి బయలు దేరింది. అయితే పుంటఇస్లిట ప్రాంతంలోని కొండలలో కూలి పోయింది. విమానంలో 10 మంది అమెరికా పౌరులు, ఇద్దరు స్థానిక సిబ్బంది ఉన్నారు. కూలిపోయిన ప్రాంతం దట్టమైన అడవి. విమానంలో ఉన్నవారంతా చనిపోయారని అధికారవర్గాలు పేర్కొన్నాయి. ప్రజారక్షణ మంత్రిత్వశాఖ విమానం కూలిపోయి మంటలు చెలరేగుతున్న దృశ్యాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రయాణికుల జాబితాను మాత్రమే ఇంతవరకు తీసుకున్నామని విమానం కూలిన సంఘటనకు సంబంధించిన ధృవీకరణ చనిపోయినవారి గుర్తింపు వివరాలు ఇంకా అందవలసి ఉందని ఆదివారం రాత్రి అధికారులు పేర్కొన్నారు. ఈ సంఘటన షాక్‌కు గురిచేసిందని నమ్మలేకుండా ఉన్నామని అధికారవర్గాలు ఎన్‌బిసి వార్తాసంస్థకు తెలిపాయి. కోస్టారికా పౌర విమానయాన విభాగం డైరెక్టర్ ఎనియోకుబిల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం విమానం పుంటఇస్లిట నుంచి రాజధానికి బయలుదేరి మార్గం మధ్యలోనే కూలిపోయిందని తెలిపారు. కూలిపోవడానికి దారితీసిన పరిస్థితులను దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పైలెట్ జాన్‌మాన్యుయల్ రిటానా అనుభవం కలిగిన వ్యక్తి అని ఆయన తెలిపారు. ఈ విమానం శాన్‌జోస్‌నుండి ఆదివారం ఉదయమే పుంటఇస్లిటకు చేరిందని ఆయన వెల్లడించారు.

బలమైన ఐరోపాతోనే ఫ్రాన్స్ విజయం

నూతన సంవత్సరం సందేశంలో మాక్రాన్



మాడ్రిడ్ : బలమైన ఐరోపా నిర్మాణం ద్వారానే ఫ్రాన్స్ విజయం సాధించే అవకాశం ఉంటుందని ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అన్నారు. నూతన సంవత్సరం సందేశం ఇస్తూ జాతీయ వాదులకు, సందేహాస్పాదులకు తావు ఇవ్వవద్దని అసంతృప్తి ఉంటే వినేందుకు తాను సిద్ధంగానే ఉన్నానని మాక్రాన్ అన్నారు. ఐరోపా ఆర్థికంగా, సామాజికంగా వాతావరణం విషయంలోను, స్నేహపూర్వకంగా ఉంటుందని శాస్త్రీయమైన శక్తి ద్వారా చైనాను, అమెరికాను ఎదుర్కొనేందుకు సిద్ధమౌతుందని అన్నారు. ఐరోపాలో ఉండటం ఫ్రాన్స్‌కు మంచిదేనని తెలిపారు. బలమైన ఐరోపా లేకుండా ఫ్రాన్స్ విజయం సాధించబోదని అన్నారు. మధ్యేవాది, వాణిజ్య అనుకూలమైన మాక్రాన్ ప్రపంచ వేదికపైన తలెత్తుకుని నిలిచేవిధంగా దేశాన్ని నిర్మించాలని భావిస్తున్నారు. మరోవైపు ఫ్రాన్స్‌లో ఈ ఏడాది అనేక నూతన చట్టాలను తీసుకురావాలని అభిలషిస్తున్నారు. వివాదాస్పదమైన కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన తలపెట్టారు. అయితే ఆయన విధానాలపై ఇప్పటికే తీవ్రమైన విమర్శలు వచ్చాయి. మాక్రాన్ సొంత పార్టీలోనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయి. జాన్‌ఎఫ్ కెనడీ మాదిరిగానే మాక్రాన్ ప్రజలను ద్దేశించి ప్రతిరోజు దేశానికి ప్రయోజనకరమైన ప్రశ్నలు అడగండి. నేను సిద్ధంగా ఉన్నాను అని మాక్రాన్ చెప్పారు. ఇస్లామిక్ టెర్రరిజంపైన దేశంలోను, దేశం వెలుపల పోరాటానికి ప్రాధాన్య తను ఇస్తానని అన్నారు. సిరియా, ఇరాక్‌లలో టెర్రరిజంపై పోరాడేందుకు తమ దేశంనుంచి 4వేల మంది సైన్యం వెళ్లారని ఆయన చెప్పారు. ఇటీవల లెబనాన్ మరియు గల్ఫ్ సంక్షోభంలో మధ్యవర్తిగా వ్యవహరించేందుకు ఆయన ముందుకు వచ్చారు. అక్రమంగా ఫ్రాన్స్‌లోకి వచ్చే వలసవాదులను అనుమతించబోమని ఆయనచెప్పారు. 2018లో భారీగా సామాజిక ప్రాజెక్టులను చేపడతానని ఆయన వాగ్దానం చేశారు. అయితే ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

వెనిజులాలో పెరగనున్న వేతనాలు



కారకాస్ : వెనిజులాలో ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉన్నప్పటికీ కనీస వేతనాలు 40 శాతం పెంచనున్నట్టుగా దేశాధ్యక్షుడు నికొలస్ మదురొ సంకేతమిచ్చారు. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణం నమోదైంది. ఆహార వస్తువులు, మందులు కొరత ఏర్పడింది. బొలీవియ జాతీయ సైనిక దళాలు వేడుకల సందర్భంగా మదురొ మాట్లాడుతూ ఈ అంశాన్ని సూచనప్రాయంగా తెలియజేశారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో చమురు ఉత్పత్తిపై ఎక్కువగా ఆధారపడిన వెనిజులా ఆర్థిక పరిస్థితి తల్లకిందులైంది. దేశ కరెన్సీ బొలివర్ విలువ పడిపోయింది. అయినప్పటికీ త్వరలో వేతనాలను పెంచనున్నట్టు మదురొ ప్రకటించారు. వేతనాల పెరుగుదల మూలంగా కార్మికులకు భద్రత ఏర్పడుతుందని అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా మదురొపైన ఆంక్షలు విధించింది. ఆయన ఒక నియంత అని అమెరికా ఆరోపించింది. 2017లో దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శనలు జరిపి హింసకు పాల్పడ్డాయి. రాజ్యాంగ నిర్ణాయకసభ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. వేతనాలు పెరిగితే ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వస్తువుల ధరలు ఇప్పటికే పెరిగాయని వేతనాలు పెంచడం వల్ల అవి మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తియాన్మన్ స్క్వేర్‌లో పీఎల్‌ఏ పతాకావిష్కరణ



బీజింగ్ : బీజింగ్‌లోని తియాన్మన్ స్క్వేర్‌లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పతాకాన్ని ఆవిష్కరించారు. 2018 సంవత్సరం ప్రవేశి స్తున్న సందర్భంగా పతాకా విష్కరణను పురస్కరించు కొని సైనికులు వందనం సమర్పించిన సందర్భంగా తుపాకులు పేల్చారు. 8మంది సైనికులతో కూడిన బృందం పెద్దపెద్ద శబ్దాలువచ్చే సంగీత వాయిద్యాలను వినియోగించారు. 96 మంది సైనికులు తియాన్మన్ స్క్వేర్‌వైపు సైనిక కవాతును నిర్వహించారు. ఐదు నక్షత్రాలు కలిగిన ఎర్రటి భారీ పతాకాన్ని ఆవిష్కరించారు. సైనిక దుస్తులు ధరించిన పదాతి దళాలు నౌకా, వైమానిక దళాల యూనిఫారాలు ధరించి ముగ్గురు అధికారులు సైనిక ప్రదర్శనకు నాయకత్వం వహించారు. వణికిస్తున్న చలిలో 90వేల మంది ప్రజలు పతాకావిష్కరణను వీక్షించేందుకు అరుదెంచారు. సైన్యం, ప్రజలు పతాకానికి వందనం చేశారు. సైన్యం సంఘీతవాయిద్యాలతో జాతీయ గీతాన్ని ఆలపించింది.

ఇరాన్‌లో నిరసన : మరో ఇద్దరు మృతి



టెహరాన్ : ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం 5వ రోజుకూడా భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇజహ్ పట్టణంలో ఆదివారం రాత్రి దంపతులయిన ఇద్దరు కాల్పుల్లో చనిపోయినట్టుగా స్థానిక ఎంపి ఒకరు తెలియజేశారు. దీంతో నిరసన ప్రదర్శనలు ప్రారంభమైన తరువాత చనిపోయినవారి సంఖ్య 6కు పెరిగింది. ఆదివారం రాత్రి కూడా అనేక నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. టెహరాన్‌లో భారీ ప్రదర్శన జరిగింది. మొదటిసారిగా అధ్యక్షుడు రౌహాణి మాట్లాడుతూ ప్రదర్శనల సందర్భంగా హింసను సహించేదిలేదని అన్నారు. 2009లో జరిగిన నిరసన కార్యక్రమాలను క్రూరంగా అణచివేసిన తరువాత మళ్లీ పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేకత వ్యక్తం చేయడం ఇదే ప్రథమం. దేశ ఆర్థిక పరిస్థితిని గుర్తించినట్లుగా రౌహాణి తెలిపారు. పారదర్శకతలేని పాలన, అవినీతి ఉన్నప్పటికీ తన ప్రభుత్వాన్ని ఆయన సమర్థించుకున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు, నిరసన తెలిపేందుకు ప్రజలకు స్వేచ్ఛ ఉందని, అయితే హింసాయుత సంఘటనలను సహించబోనని అన్నారు. నిరసన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రదర్శకులను చెల్లాచెదరు చేసేందుకు పలు నగరాల్లో బాష్పవాయువు గోళాలను, నీటి క్యానన్లను పోలీసులు వినియోగిస్తున్నారు. తమ సైన్యం లేదా పోలీసులు ప్రదర్శకులపై కాల్పులు జరపలేదని సున్నీ ముస్లింల కారణంగానే వారు చనిపోయారని అధికారులు చెప్తున్నారు. ఇజహ్ నగరంలో ఆదివారం రాత్రి ఇద్దరు చనిపోగా అనేకమంది గాయపడినట్టు లేబర్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. రాజకీయపరమైన అశాంతిపైన ఉక్కుపాదం మోపడం జరుగుతుందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ దళాలు హెచ్చరించాయి.

అభివృద్ధా..? (మొదటిపేజీ తరువాయి)

లేఖలో వివరించారు. విభజన బిల్లులో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి నిధులివ్వకపోయినా మీరు మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. రైతుల నుండి ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిని ప్రైవేటు, కార్పొ రేట్లకు అప్పజెప్పటానికి మీరు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే పోలవరం నిర్మాణం విషయంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో భాగస్వాములైన తెలుగుదేశం- బీజేపీలు తలోమాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. ఏది ఏమైనా మీరు గతంలో పేర్కొన్నట్లుగా 2018 ఆఖరు నాటికి పోలవరం నిర్మాణం పూర్తిగాదని తేలిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి ప్రజలకు ఏం సమాధానం చెబుతారో మీకే తెలియాలి. వీటికి తోడు కేంద్రం ప్రకటించిన విద్యా, వైద్య సంస్థల నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రహరీగోడ నిర్మాణాలు మినహా పురోగతి ఎక్కడా కనబడడం లేదు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లు 2014లో పేర్కొన్న అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయక పోయినా ప్రధాని మోడీని అడిగే పరిస్థితి లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వకపోయినా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిందని స్వయంగా ప్రచారం చేశారు. ఇప్పుడు ప్యాకేజీ ఏమైందో ఎన్నడూ మాట్లాడరు. వాస్తవానికి రాష్ట్ర విభజన సందర్భంలో పార్లమెంటులో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించిన అన్ని అంశాలు అమలు పరచి ఉంటే ఇప్పుడీ దుర్గతి ఉండేది కాదని రామకృష్ణ పేర్కొన్నారు. విభజన బిల్లులోని అంశాలు అమలు చేయాల్సిన ప్రధాని మోడీ రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ, మీరెందుకు ఆ ప్రభుత్వంలో కొనసాగుతున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండు చేస్తున్నాను. ఇప్పటికైనా ప్రజలకు వాస్త వాలు వివరించి రాష్ట్రాభివృద్ధికి నడుం బిగించాలి. లేనిపక్షంలో 2018 సంవత్సరం కూడా గత ఏడాది మాదిరే వాగాడంబర దినాలుగా మిగిలిపోతాయని రామకృష్ణ ఆ లేఖలో తెలిపారు.

నేటి పుస్తకం.. రేపటి చరిత్ర

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

పుస్తకానికి నిత్యజీవితంలో చాలా ప్రాముఖ్యం ఉందని, నేడు రాసిన పుస్తకం భవిష్యత్‌లో చరిత్ర అవుతుందని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. జీవితంలో నిన్న అనే పేజీని తిరగరాయలేమని, భవిష్యత్ అనే పేజీని పూరించి, వర్తమానంతో దానిని నింపుతామన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు భవిష్యత్ తరాలకందించడంలో పుస్తకాలు ముఖ్య భూమికను పోషిస్తాయని చెప్పారు. సోమవారం స్థానిక స్వరాజ్య మైదానంలో 29వ పుస్తక మహోత్సవాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విజయవాడ పుస్తక మహోత్సవం లాంటి కార్యక్రమాలతో భవిష్యత్ తరాలకు మన భాష, సంస్కృతి, సాంప్రదాయాలను అందించడం వీలౌతుందన్నారు. పుస్తకా నికి, అక్షరానికి చాలా ప్రాముఖ్యం ఉందన్నారు. అక్షరం అంటే నాశనం లేనిదని, అదే అక్షరం భాషను వ్యక్తీకరించి సమాజాన్ని నిర్మిస్తుం దన్నారు. అక్షరం ఎన్నో మార్పులకు లోనవుతుందని, అక్షరం అంటే జ్ఞానమని, ఆ జ్ఞానం మన విజ్ఞానానికి ఉపయోగపడుతుం దన్నారు. గతంలో రాజుల కాలంలో కవులను పోషిస్తూ కళలు, సాహిత్యాన్ని ఆదరించేవారని దానివల్ల మన సంస్కృతి, సాంప్ర దాయాలతో పాటు మన భాష పరిరక్షణకు దోహదపడేదన్నారు. వర్తమానం పేజీలో రాసే అక్షరాలను చెరిపెయ్యలేమని, భావన, భాష రెండూ కలసి నడు స్తాయని, అందుకే ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను కాపాడుకోవా లన్నారు. పుస్తకాన్ని మించిన స్నేహి తుడు లేరని, మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చేదోడువాదోడుగా నిలుస్తుందన్నారు. ఒక మంచి పుస్తకంచదివితే విజ్ఞానంతో పాటు ఆనందంగా కూడా లభిస్తుందన్నారు. పుస్తక పఠనం చాలా మంచి అలవాటని తెలిపారు. సామాన్యులైన వేదవ్యాసుడు మహాభారతాన్ని, వాల్మీకి రామాయణాన్ని రచించారని అలాంటి గొప్పదనం మన భాషకు ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులు తెలుగు భాషకు ప్రాముఖ్యం కల్పిం చారన్నారు. గతంలో విజయవాడ నగరం కళలకు కానాచిగా పేరొం దిందని, తరువాత కాలంలో అది మసకబారినా, తిరిగి మళ్లీ పుంజుకునే అవకాశం వచ్చిందన్నారు. 1886 వ సంవత్సరంలో తొలి గ్రంథా లయం విశాఖపట్నంలో నెలకొల్పారని, పుస్తకాలు చదివేవారి సంఖ్య ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలోనే ఎక్కువగా ఉందని ఇటీవల ఒక సర్వేలో తెలిపారన్నారు. సినిమాల ప్రభావం సామాన్యు లపై ఎక్కువ ఉంటుందని, అయితే ప్రస్తుతం వాటిల్లో వినియోగిస్తున్న భాష హర్షణీయం కాదన్నారు. సమాజ హితం కోసం సినిమాలు నిర్మిం చేవారు భాషను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాతృభాషను కాపాడటంలో సినీ పరిశ్రమకు చెందిన వారు తగిన శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత వుందన్నారు. ప్రపంచంలో ఎదగాలంటే ఇంగ్లీష్, దేశంలో ఎదగాలంటే హిందీ నేర్చుకోవాలని, ఎంత స్థాయికి ఎదిగినా మాతృభాషను మరువవద్దని కోరారు.

తెలుగు భాషా పరిరక్షణ సంవత్సరంగా 2018- చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ భాష, చరిత్ర, సంస్కృతిని కాపాడుకోవడానికి పుస్తక మహొత్సవ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భాషా పరిరక్షణ ద్వారానే జాతి మనుగడ ఆధారపడి వుంటుందన్నారు. ఒకప్పుడు విజయవాడ సాహిత్యానికి, సంస్కృతికి నిలయంగా ఉండేదని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి ప్రసిద్ధి చెందిన కృష్ణాపత్రిక, విశాలాంధ్ర, ఆంధ్రపత్రిక, ప్రజాశక్తి లాంటి పత్రికలు వెలువడ్డాయని గుర్తుచేశారు. ప్రముఖ కవి విశ్వనాధ సత్యనా రాయణ ఈ ప్రాంతానికి చెందిన వారేనని, రాజకీయాలకు స్ఫూర్తిని ఇచ్చిన గడ్డ కూడా ఇదేనన్నారు. సినీ ప్రపంచంలో ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు ఇక్కడ నుంచే వచ్చారని గుర్తు చేశారు. తెలుగు భాషను పరిరక్షించడంలో ఎన్టీఆర్ విశేషమైన కృషి చేశారన్నారు. సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ శాఖలను కలిపి ఒక శాఖగా ఏర్పాటు చేస్తే బాగుంటుందనే సూచనలు ఇచ్చారని, దాన్ని పరిశీలించి నిర్ణయిసా మన్నారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఏపీకి పూర్వవైభవం తెచ్చేలా అమరావతి రాజధాని నిర్మాణాలను కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో పూర్తిచేస్తామని చెప్పారు. తెలుగు భాషను కాపాడుకోవడానికి 2018ని తెలుగు భాష పరిరక్షణ సంవత్సరంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ విప్ బుద్దా వెంకన్న, ఎంపీ కేశినేని నాని, జడ్పీచైర్‌పర్సన్ గద్దె అనురాధ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మేయర్ కోనేరు శ్రీధర్, కలెక్టర్ బి.లక్ష్మీ కాంతం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయభాస్కర్, విజయ వాడ పుస్తక మహోత్సవ అధ్యక్షులు వెంకటనారాయణ, గౌరవాధ్యక్షులు అశోక్, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో విష్ణు, పుస్తక మహొత్సవ పూర్వ అధ్యక్షులు బాబ్జి, ఎమ్మెస్కోకు చెందిన విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బుక్‌స్టాల్ సందర్శన

పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం చంద్రబాబులు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ బుక్‌స్టాల్‌ను సందర్శించారు. ఆ సమయంలో అక్కడేవున్న సీపీఐ జాతీయకార్యదర్శి డా.కె.నారాయణ, విశాలాంధ్ర విజ్ఞానసమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి, పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు, ఏజీఎం మనోహర్‌నాయుడు, బుక్‌హౌస్ మేనేజర్ నారాయణ ప్రభృతులు అంతర్జాతీయంగా వున్న ప్రముఖ రచనలన్నీ తమ వద్ద వున్నట్లు వివరించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విశాలాంధ్ర వంటి సంస్థలు ద్వారానే ఇటువంటి పుస్తక మహోత్సవాలు జరుగుతున్నాయని, ప్రముఖుల రచనలన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని కొనియాడారు. సీఎం చంద్రబాబు తనకు ముక్సీమ్ గోర్కీ రాసిన 'అమ్మ' పుస్తకం అంటే ఎంతో ఇష్టమని తెలుపగా, వెంటనే ఆ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి నారాయణ అందజేశారు.

పెదవి విరుపు (మొదటిపేజీ తరువాయి)

కార్పొరేట్ పరిపాలన, ఆస్తుల భద్రతకు ముప్పు వంటి కారణాలతో దాదాపు 20 శాతం మదుపరులు, సంస్థలు భారతీయ వ్యాపారం నుంచి వైదొలిగినట్లు తేలింది. అలాగే అంతర్జా తీయ పారదర్శక అధ్యయనం ప్రకారం ఆసియా పసిఫిక్ దేశాల్లో భారత్‌లోనే లంచాలు అధికంగా ఉన్నాయని, ఇక్కడున్న ప్రజల్లో మూడొంతులకు రెండొంతుల మంది కనీసం టీ కోసమైనా ముడు పులు చెల్లించుకోవాల్సి వస్తు న్నట్లు తెలిసింది. ఈ విషయంలో 69 శాతంతో భారత్ మొదటి స్థానంలో ఉండగా, 65 శాతంతో వియత్నాం రెండో స్థానంలో ఉంది.

ప్రోత్సాహం (మొదటిపేజీ తరువాయి)

పరిశోధన, ఆవిష్కరణల తుది ఫలితంగా పేద ప్రజల జీవితాలపై చూపే ప్రభావాన్ని అంచనా వేయడం నేటి ప్రపంచంలో ముఖ్యమైన అంశమ న్నారు. 'మీ ఆవిష్కరణల ద్వారా పేదల జీవితం సులభతరమైందా, అలాగే మధ్యతరగతి ప్రజల ఇబ్బందులు తగ్గాయా అని ప్రధాని ప్రశ్నించారు. దేశంలో ఎదురవుతున్న సామాజిక, ఆర్థిక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని శాస్త్రవేత్తలు తమ పరిశోధనలు చేయాలని కోరారు.

వడ్డీ తగ్గింపు (మొదటిపేజీ తరువాయి)

8.95 శాతానికి తగ్గించింది. 2016 ఏప్రిల్ తర్వాత రుణాలు తీసుకున్న వారికి నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్) వర్తిస్తుంది. అంటే అంతకుముందు బేస్ పాయింట్లు ఆధా రంగా రుణాలకు ఈ తగ్గింపు వర్తిస్తుంది.

స్త్రీ నిధి రుణాలు...!

(మొదటిపేజీ తరువాయి)

రుణాలు ఇవ్వటం ద్వారా నెలకు రూ.10 వేల స్థిర ఆదాయం వచ్చేలా చేయాలనే యోచనలో స్త్రీనిధి సమాఖ్య ఉంది. ఇందుకు ప్రభుత్వం నుంచి కూడా గ్రీన్‌సిగ్నల్ రావటంతో అధికారులు విశాఖ డెయిరీతో ఒప్పందం కుదుర్చుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సరికొత్త ఈ పథకం కింద ఒక్కో డ్వాక్రా గ్రూపులో ఇద్దరు సభ్యులకు రూ.50 వేలు చొప్పున రుణం ఇవ్వనున్నారు. గతంలో అన్ని సంఘాల్లోని సభ్యులకు రూ.10 వేలు చొప్పున రుణం ఇచ్చేవారు. దీనివల్ల ఆదాయం రాకపోగా రుణాన్ని ఇతర ఖర్చులకు వినియోగించేవారు. దీనివల్ల మహిళల ఆదాయాలు పెరిగే అవకాశం లేకపోవటంతో గ్రూపుకు ఇద్దరు సభ్యులకు రూ.50 వేలు చొప్పున రుణం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తొలుత ఐదు జిల్లాల్లో

విశాఖ డెయిరీ ప్రస్తుతం ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతోపాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 3,641 గ్రామాల నుంచి పాలను సేకరిస్తోంది. ఈ ఐదు జిల్లాల్లో విశాఖ డెయిరీకి అనుబంధంగా ఉన్న సొసైటీల్లో సుమారు మూడు లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఐదు జిల్లాల నుంచి ప్రతి రోజూ సుమారు ఆరు లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. ఇందులో ప్రతి రోజూ లక్ష లీటర్ల పాలను నిల్వ చేస్తున్నారు. పాల అమ్మకాలు, పాల పదార్థాల తయారీకి మిగిలిన పాలను ఉపయోగిస్తున్నారు. పెరుగుతున్న డిమాండుకు తగ్గట్టుగా రోజుకు కనీసం 10 లక్షల లీటర్ల పాలను సేకరించాలని విశాఖ డెయిరీ భావిస్తోంది. మరోవైపు డెయిరీ తన సేవల పరిధిని ప్రస్తుత ఐదు జిల్లాలతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, తెలంగాణా ప్రాంతాలకు కూడా విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. పాల ఉత్పత్తిని పెంచేందుకు వీలుగా సొసైటీలలో సభ్యులుగా ఉన్న వారికి పశువుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేసింది. అయినప్పటికీ పాలు చాలకపోవటంతో, సభ్యులకు రెండో పశువును రుణంగా ఇప్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఒక్కో పశువుకు గరిష్టంగా రూ.50 వేల వరకు రుణాన్ని మంజూరు చేసేందుకు స్త్రీనిధి సమాఖ్య అంగీకరించింది.

హామీగా విశాఖ డెయిరీ

స్త్రీనిధి సమాఖ్య నుంచి పాడి రైతులకు మంజూరు చేసే రుణాలకు విశాఖ డెయిరీనే హామీగా ఉండనుంది. అధిక పాల దిగుబడినిచ్చే పశువులను కొనుగోలు చేసేందుకు స్త్రీనిధి రుణం రూ.50 వేలతోపాటు విశాఖ డెయిరీ కూడా కొంత మొత్తాన్ని రుణంగా ఇవ్వనుంది. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి పశువులను కొనుగోలు చేస్తే వాటిని రాష్ట్రానికి తీసుకువచ్చి రైతులకు పంపిణీ చేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను కూడా భరించేందుకు విశాఖ డెయిరీ సంసిద్ధతను వ్యక్తం చేసింది. అలాగే పాడి పశువుల పోషణకు అవసరమై దాణాకు డెయిరీనే రుణ సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా ఉండి, పాల ఉత్పత్తిదారుల సంఘాల్లో సభ్యత్వంలేని వారికి కొత్తగా సభ్యత్వం కూడా ఇచ్చేందుకు డెయిరీ ముందుకొచ్చింది. పాల సొసైటీల్లో సభ్యత్వ ఉండి, డ్వాక్రా గ్రూపులలో లేకపోతే మాత్రం రుణానికి అనర్హులని స్త్రీనిధి సమాఖ్య అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సొసైటీల ద్వారానే రుణాల చెల్లింపు

పాడి పశువుల కొనుగోలు కోసం స్త్రీనిధి సమాఖ్య మంజూరు చేసే రుణాలను పాల సొసైటీల ద్వారానే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసే రైతులకు నెలలో మూడుసార్లు చెల్లింపులు జరుగుతాయి. మూడు విడతలలో రుణ వాయిదాతోపాటు దాణా రుణ వాయిదాను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని రైతులకు బట్వాడా చేసేలా ప్రణాళికను రూపొందించారు.

ఈ విధానం వల్ల ఇచ్చిన రుణాలు సకాలంలో వసూలుకావటమే కాకుండా, కొత్తగా మరికొందరికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని స్త్రీనిధి సమాఖ్య అధికారులు చెబుతున్నారు. విశాఖ డెయిరీ, స్త్రీనిధి సమాఖ్య మధ్య ఒప్పందం కుదరగానే ఈ నెల నుంచే పాడి పశువుల కొనుగోలుకు రుణాలు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పవిత్ర కర్తవ్యంగా భావిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యుల దగ్గర నుంచి ప్రభుత్వాధికారుల వరకు పాలనా వ్యవస్థలోని అందరూ మీ ఊరిలో మీకు అందుబాటులో వుంటారు. కుటుంబంలో ప్రతి ఒక్కరూ బావుంటేనే ఊరు సంతోషంగా ఉంటుందని నా నమ్మకం. రాష్ట్రంలో కనీసం 80 శాతం ప్రజల్లో సంతృప్తి కలగాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ఆర్థిక అసమానతలు తగ్గించే దిశగా ప్రతి కుటుంబం నెలకు కనీసం పది వేల రూపాయలు తగ్గకుండా ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. కుటుంబ వికాసం, సమాజ వికాసానికి నిరం తరం కృషి చేస్తున్నాం. 'ప్రజలే ముందు' అనేది ప్రభుత్వ విధానం. అవినీతి రూపుమాపడానికి, సత్వరం సమస్యలు పరి ష్కారం చెయ్యడానికి '1100' కాల్ సెంటర్ ఏర్పాటు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా 'రియల్ టైమ్ గవర్నెన్స్'తో పాలనలో పారదర్శకతను, వేగాన్ని పెంచాం. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 'ఫైబర్ గ్రిడ్' ప్రాజెక్టును ప్రారంభించుకున్నాం. ఇది ప్రభుత్వాన్ని మీకు మరింత దగ్గర చేస్తుంది. ప్రతి ఇంటినీ విజ్ఞాన ఖనిగా మారుస్తుంది.

'జన్మభూమి-మాఊరు'లో అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు అందిస్తాం. 'చంద్రన్న బీమా' కింద రక్షణ కల్పిస్తాం. రైతన్న రుణం తీర్చుకునేందుకు మూడోవిడత 'రుణ ఉపశమనం' కూడా చేస్తున్నాం. డ్వాక్రా సంఘ సభ్యులకు వడ్డీయే కాకుండా, పెట్టుబడి సహాయం కూడా అందిస్తున్నాం. 'జన్మభూమి-మాఊరు'లో వచ్చిన ఫిర్యాదుల్ని పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులకు లబ్ధి జరిగేలా చూడటం, లబ్ధిదారులకు సాయం చేయడం, ఫిర్యాదులు స్వీకరించడం, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం ప్రభుత్వం ముందున్న కర్తవ్యం. 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం లక్ష్యం అదే. సంక్షేమం-సంతృప్తి, ఆరోగ్యం-ఆనందం, స్వచ్ఛాంధ్రప్రదేశ్, విద్య-వికాసం, మౌలిక సదుపాయాలు, సహజవనరులు-అభివృద్ధి, వ్యవసా యం-అనుబంధరంగాల అభివృద్ధి, సుపరిపాలన-టెక్నాలజీ వినియోగం, విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్-పేదరికంపై గెలుపు ఇలా అన్నీ కలిపి మొత్తం 9 అంశాలు - ఒక్కోరోజు ఒక్కో అంశంపై దృష్టిసారిద్దాం. సమగ్ర చర్చ చేద్దాం. ప్రణాళికలు రూపొందిం చుకుందాం. చివరిరోజు 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన వారికి, విజేతలకు పురస్కారాలిచ్చి 'ఆనందలహరి'ని జరుపుకుందాం. 2017లోని మంచి చెడులను విశ్లేషించుకుని నూతన సంవత్సరం-2018లోకి అడుగుపెట్టాం. కొత్త ఏడాదిలో మన మనసును, మన పరిసరాలను, సమాజాన్ని మరింత స్వచ్ఛంగా వుంచు కుందాం. వినూత్నంగా ఆలోచించి సరికొత్త ఉత్సాహంతో ముందడుగు వేద్దాం. నవ్యాంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో ముందు నిలవాలనేదే మన ఆశయం. ఇందుకు మనందరం చేయిచేయి కలిపి సాగుదాం, కష్టపడదాం. మనందరి పవిత్ర కర్తవ్యంగా భావించి 'జన్మభూమి-మాఊరు'లో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని ఫలవంతం చేద్దాం. మీ అందరికీ నూతన సంవత్సర - సంక్రాంతి శుభాకాంక్షలు.

జైహింద్.. జై జన్మభూమి..
- మీ ముఖ్యమంత్రి
నారా చంద్రబాబునాయుడు

డ్రంక్‌డ్రైవ్‌లో ప్రదీప్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రదీ ప్‌కు బ్రీత్ అనలైజ్ టెస్ట్ చేయగా 170కి పైగా పాయింట్లు నమోదయినట్లు సమాచారం. సాధారణంగా 35 పాయింట్లు దాటితేనే వాహనదారుడికి శిక్ష, వాహ నం సీజ్ లాంటి చర్యలుం టాయి. మోతాదు కంటే చాలా ఎక్కువ మద్యం సేవించి, వాహనం నడిపిన ప్రదీప్‌కు సవరించిన నిబంధనలను అనుసరించి భారీ శిక్షలు పడే అవకాశం ఉంది. కాగా, హైద రాబాద్, సైబరాబాద్, రాచ కొండ పోలీసు కమిషన రేట్ల పరిధిలో మొత్తం 2,499 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదై నట్లు పోలీసులు తెలి పారు. హైదరాబాద్ కమిషన రేట్ పరి ధిలో 1,683 కేసులు, సైబరా బాద్ పరిధిలో 582, రాచ కొండ కమిషనరేట్ పరిధిలో 234 కేసులు నమోదయ్యాయి.

S & D

ఫైర్‌కు ఇక పోస్టల్ రెడ్ కలర్ డ్రెస్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : రాష్ట్ర విపత్తులు, స్పందన, అగ్నిమాపకశాఖ (ఫైర్ డిపార్ట్‌మెంట్) యూనిఫారం మారనుంది. పోలీసు, రవాణాశాఖలతోపాటు ఫైర్ శాఖలోనూ ప్రస్తుతం ఖాకీ డ్రెస్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే విదేశాలలో మాదిరిగా డ్రెస్‌ను మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ప్రత్యేకంగా డిజైన్ చేసి, కుట్టించిన పోస్టల్ రెడ్ కలర్ డ్రెస్‌ను ఫైర్ అధికారులు, సిబ్బందికి ఇవ్వనున్నారు. త్వరలోనే ఈ కొత్త డ్రెస్‌ను అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టల్ రెడ్ కలర్ డ్రెస్‌ను అగ్నిమాపకశాఖ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఫైర్‌మెన్, లీడింగ్ ఫైర్‌మెన్, డ్రైవర్‌కు ఇవ్వనున్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రెస్క్యూ ఆపరేషన్ చేసే సమయంలో అధికారులు, సిబ్బంది విధిగా పోస్టల్ ఈ డ్రెస్‌ను విధిగా ధరించాలని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది.విదేశాల్లో ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రత్యేకత ఉంది. దీంతో విదేశాల్లో మాదిరి పోస్టల్ రెడ్ కలర్ డ్రెస్‌నే వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

స్వీట్‌షాపులపై దాడులు : దామోదర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో స్వీట్ షాపులు, బేకరీలపై రెండురోజులపాటు దాడులు నిర్వహించి 101 కేసులు నమోదు చేశామని లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ ఈ.దామోదర్ సోమవారం ప్రకటించారు.11 జిల్లాల్లో 2018 నూతన సంవత్సర వేడుకలను డిసెంబర్ 30,31, 2017 తేదీలలో సహాయ నియంత్రికులు, లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యాన ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తూకం తక్కువ, అధిక ధరలతో వినియోగదారులకు విక్రయించే పలు మిఠాయి దుకాణాలు, బేకరీలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామని తెలిపారు.వినియోగదారుల సేవార్థం, ప్రజలలో చైతన్యం కలిగించేందుకుగాను దాడులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ విషయంలో ఫిర్యాదు చేయాల్సిన వినియోగదారులంతా ప్రజాపరిష్కార వేదిక టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేయాలని సూచించారు.తూకం తక్కువ, కొలతలు, ప్యాకేజీ వస్తువులపై నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే వినియోగదారులు స్పందించి ఫిర్యాదు చేయాలని కోరారు.కర్నూలు, కడప-23, పశ్చిమలో-7, తూర్పుల-ఆరు, అనంతపురం, చిత్తూరు-12, గుంటూరు-8, నెల్లూరు-5, విశాఖ-11, విజయనగరం-15, కృష్ణాజిల్లా-14 దుకాణాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.



పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో

నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కొత్త పోలీస్ బాస్ ఎం మాలకొండయ్య ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వేడుకలలో డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్య కేకు కట్ చేశారు. అనంతరం ఆయన పోలీసు క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో పోలీసుశాఖ ప్రజలకు మరింత చేరువ కావాలన సూచించారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయటంతోపాటు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని చెప్పారు. అధికారులు, సిబ్బంది సమష్టిగా పని చేస్తే రాష్ట్రంలో నేరాలను తగ్గించటం ఏమంత కష్టంకాదన్నారు. శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చి ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా చూడాలన్నారు. కత్త సంవత్సరంలో పోలీసుశాఖ నూతనత్వంతో, ఉత్తేజకరంగా పి చేయాలని మాలకొండయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల విభాగం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ, విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఎన్‌వీ సురేంద్రబాబు, సీఐడీ అదనపు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, పోలీసు సంక్షేమం అదనపు డీజీపీ అంజనా సిన్హా, ఏపీఎస్‌పీ బెటాలియన్స్ ఐజీ ఆర్‌కే మీనా, పర్సనల్ ఐజీ ఎన్ శ్రీధరరావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ పశు వైద్యశాలలకు రూ.97.01 కోట్ల నాబార్డు రుణం

- 227 పశువుల ఆసుపత్రుల నిర్మాణం
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో గ్రామీణ పశు వైద్యశాలలకు నాబార్డు రూ.97.01 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. 13 జిల్లాల్లోని పలు గ్రామీణ పశువుల ఆసుపత్రులు శిథిలావస్థకు చేరటం, అసలు పశువుల ఆసుపత్రి సౌకర్యం లేని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామీణ మౌలిక సదుపాయల అభివృద్ధి నిధి (ఆర్‌ఐడీఎఫ్) నుంచి నాబార్డు ఈ రుణాన్ని మంజూరు చేసింది. ఇందులో రూ.91.20 కోట్లు నాబార్డు మంజూరు చేయగా, మరో 5.99 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా భరించనుంది. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల జాయింట్ డైరెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. పశువుల ఆసుపత్రి భవనాల నిర్మాణానికి గత ఏడాది డిసెంబర్ 31వ తేదీలోగానే పరిపాలనాపరమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని వెటర్నరీ డిస్పెన్సరీ (వీడీ), వెటర్నరీ హస్పిటల్స్ (వీహెచ్), రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్స్ (ఆర్‌ఎల్‌యు)ను నిర్మించనున్నారు. నాబార్డు రుణంలో రూ.91.20 కోట్లను సివిల్ వర్క్సుకు, రాష్ట్ర వాటా నిధులు రూ.5.99 కోట్లను వైద్య పరికరాల కొనుగోలుకు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని సంవత్సరాల నుంచి పశువుల ఆసుపత్రి భవనాలు శిథిలావస్థకు చేరటం వల్ల శాశ్వత ప్రాతిపదికన వైద్యులు ఉండటంలేదు. నాబార్డు రుణంలో ఇక నుంచి గ్రామాల్లోనే వైద్యులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ట్రాఫిక్ దిగ్బంధనంలో ఢిల్లీ

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : కొత్త సంవత్సరం తొలి రోజు దేశరాజధాని ఢిల్లీలో ఒక వింత పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 12 గంటల పాటు అన్ని రోడ్లు ట్రాఫిక్‌జామ్‌తో నిండి పోయాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఢిల్లీలో నివశించే ప్రజలు ఒక్కసారిగా రోడ్లమీదకు రావటం, ఇండియాగేట్ పరిసర ప్రాంతాల్లో సంబరాలు చేసుకోవటం వంటి వాటితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒకవైపు పొగమంచు.. మరోవైపు ట్రాఫిక్ జామ్ ప్రయాణీకులను తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. దేశ రాజధానిలోని ముఖ్యంగా సెంట్రల్ ఢిల్లీలో ఎక్కువ మంది వివిఐపిలు నివాసం ఉంటారు. ఈ ప్రాంతాలన్నీ కూడా వాహనాల రద్దీతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కేంద్ర మంత్రులు, ఎంపీలు నివాసం ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ వల్ల వాళ్లు కూడా బయటకు రాలేనిపరిస్థితి ఏర్పడింది. ఉదయం నుంచి ట్రాఫిక్ జామ్ ఉన్నప్పటికీ మధ్యాహ్నం భోజనం సమయం తర్వాత భారీగా ట్రాఫిక్ జామ్ పెరిగిపోయింది. దీంతో కేంద్ర మంత్రులు కూడా ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఒక్కసారిగా వాహానాల్లో ప్రజలు బయటకు రావటం, ట్రాఫిక్ జామ్ ఎవ్వరూ ఊహించని విధంగా ఏర్పడటంతో పోలీసులు కూడా చేతులు ఎత్తివేశారు. ముఖ్యంగా చర్చిలు, దేవాలయాలు, సిక్కుల మందిరాలు కొత్త సంవత్సరం సందర్భంగా కిటకిటలాడాయి. పొగమంచు, తట్టుకోలేని చలిని సైతం లెక్క చేయకుండా ప్రజలు రోడ్లపైకి రావటంతో పోలీసులు కూడా నియంత్రణ చేయలేక తలలు పట్టుకున్నారు. దేశ రాజధానిలోని కీలకమైన సెంట్రల్ ఢిల్లీలో ఈ విధమైన పరిస్థితి ఏర్పడటంతో పోలీసుల అధికారులు అత్యవసరంగా సమావేశమై పరిస్థితిని చక్కబెట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

జన్మభూమి అర్జీలకు పరిష్కారమేదీ..?

పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు విడతలుగా నిర్వహించిన జన్మభూమి అర్జీల సమస్యలను పరిష్కరించలేదని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు సోమవారం పీసీసీ కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజా సమస్యల్ని పరిష్కరించకుండా 'జన్మభూమి-మా ఊరు' పండుగెలా అవుతుందని ప్రశ్నించారు.జనవరి 2 నుంచి 11వ తేదీ వరకూ 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు పిలుపుఇచ్చారని, ఇది ప్రజా సమస్యల్ని పరిష్కరించే దిశగా ఉండాలని సూచించారు. ఇటీవల తాను అనంతపురం జిల్లాలో మడకశిర, కళ్యాణదుర్గం, పెనుగొండ నియోజకవర్గాల పర్యటనలో ప్రజల నుంచి పెద్దఎత్తున సమస్యలు వచ్చాయని, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నానని తెలిపారు.

మడకశిర నియోజక వర్గంలో 61వేలు, కళ్యానదుర్గంలో 49వేలు, పెనుగొండలో 45వేల మంది ప్రజలు తమ సమస్యల్ని అర్జీల రూపంలో ఇచ్చారని తెలిపారు.దాదాపు అన్ని గ్రామాల్లోనూ పింఛన్ల నిలుపుదల, మరుగుదొడ్ల బిల్లులను చెల్లించ లేదని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాలలోనూ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలు, రైతు రుణమాఫీ చేయాలనే సమస్యలపై అర్జీలు అందజేస్తున్నారని వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేయాలని సూచించారు.లేకుంటే ప్రజల తరపున కాంగ్రెస్ పోరాడుతుందని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనంతపురంలోని జేఎన్‌టీయూ విశ్వ విద్యాలయానికి రేషనలైజ్‌లో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదించింది.ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది సోమవారం జీఓ విడుదల చేశారు.సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి అసోసియేటెడ్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-3, హ్యూమనిటీస్ విభాగం-3, ఇంగ్లీషు-3 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

సంపాదకీయం

యువతకు మోడీ ఎర

నేతల మాటలు, అందునా ప్రభుత్వాధినేతగా వారు చేసే ఉద్బోధలు ప్రజావిశ్వాసం పొందేవిగా, ప్రజాదరణ చూరగొనేవిగా వుండాలి. ఆదివారం కేరళలోని శివగిరి మఠం యాత్రకు ఉత్సవంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2017లో చివరి మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోడీ ప్రసంగిస్తూ, నూతన సంవత్సరంలో 19 సంవత్సరాలు పూర్తి చేసుకొంటున్న దేశ యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, వారి ఓట్లు నవభారతానికి పునాది కావాలని ఆకాక్షించారు. సహజంగా కేంద్ర ఎన్నికల సంఘం 18 యేండ్లు పూర్తి చేసుకున్నవారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ప్రతి ఏడాది ప్రకటన చేస్తూనే వుంటుంది. దానికొరకు ప్రధాని మన్‌కీ బాత్‌లో ప్రత్యేకించి విజ్ఞప్తి చేయవలసిన అవసరం లేదు. కొత్త సంవత్సరంలో ప్రగతిశీల భారతదేశం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. మోడీ చేసే ధర్మోపన్యాసాలకు, ఆచరణలో అనుసరించే విధానాలకు ఏ మాత్రం పొంతన లేకుండా వుంటున్నది. ఒక పక్కన దేశంలో ప్రగతిశీల భావాలున్న మేధావులను, రచయితలను, కవులు, కళాకారులను పాత్రికేయులను హిందూమతోన్మాదులు బరితెగించి భౌతికంగా నిర్మూలిస్తుంటే, గోసంరక్షణ బృందాల పేరుతో గోమూకలు ముస్లిం మైనారిటీలు, దళితులపై భౌతిక దాడులకు పాల్పడుతుంటే వాటిని అరికట్టడానికి కఠిన చట్టాలను రూపొందించి నిర్దిష్టమైన చర్యలు చేపట్టకుండా కేవలం ప్రకటన చేసి చేతులు దులుపుకున్న మోడీ నోట, ప్రగతిశీల భారతదేశం నిర్మాణం మాట వెలువడటం విచిత్రంగా అనిపించక తప్పదు. 2019లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నూతన ఓటర్ల నుండి లబ్ధి పొందడానికి యువతకు ఎరవేయడంగా భావించవచ్చు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం గురించి, కోట్లాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పన గురించి మాట్లాడకపోవటం దారుణం. ఆరెస్సెస్ కనుసన్నల్లో నడుస్తున్న మోడీ సర్కారు మతంపేరిట, దేవుడు పేరిట సమాజాన్ని విభజించి, హిందూ రాజ్యం ఏర్పాటే ధ్యేయమైన ఆరెస్సెస్ అజెండాను అమలు చేయడానికి ప్రయత్నిస్తూ, దేశంలోని యువతను మభ్యపెట్టడానికి పూను కొంటున్నదనడం అతిశయోక్తి కాదు. మునుపెన్నడూ లేనివిధంగా మొట్టమొదటిసారి దేశంలోని కీలక ఉపాధి కల్పన అంశాన్ని పరిష్కరించడానికి జాతీయ ఉపాధి విధానం రూపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలియడం మంచి విషయమే. ఆర్థిక, సామాజిక, కార్మిక విధాన జోక్యాల ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య ఉపాధుల కల్పనపై కేంద్రీకరణలో సమగ్ర కార్యాచరణ పథకం రూపొందించడానికి జాతీయ ఉపాధి విధానం వుద్దేశించబడింది. తుదిపత్రం రూపొందించడానికి అనేక మాసాల సమయం పట్టనున్నప్పటికీ రానున్న పార్లమెంట సమావేశాల్లో ఉపాధి విధానం ప్రకటించనున్నట్లు భావించబడుతున్నది. అయితే, ఈ కర్తవ్యం అంత తేలికైనదేమీ కాదు. ప్రస్తుత ఆర్థిక పర్యావరణం, ఉపాధి మార్కెట్ పరిస్థితి జటిలంగా వుంది.

మోడీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన మేక్-ఇన్-ఇండియా ఇప్పటికీ బాలారిష్టాలను అధిగమించలేదు. తక్కువ పరిజ్ఞాన ఉత్పత్తులు, విడిభాగాలు భారత మార్కెట్‌లోకి కుప్పలుతెప్పలుగా వచ్చిపడుతున్నాయి. ఉద్యోగార్థులు అండర్ ఎంప్లాయిమెంట్, పాక్షిక, కాంట్రాక్టు పనులు, తక్కువ వేతన శాపాన్ని ఎదుర్కొంటున్నారు. దాంతో వారికి భవిష్యత్తు అనిశ్చితంగా కనిపిస్తోంది. నిరుద్యోగిత పెరుగుదల సాధారణంగా యజమానులకు లబ్ధి చేకూర్చుతుంది. గిరాకీ-సరఫరా పరిస్థితిపై ఆధారిత ఉపాధి షరతులను యజమానులు ఖరారు చేస్తారు. కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న మోడీ సర్కారు కార్మిక చట్టాలను సవరించడానికీ పూనుకొంటూ ఉపాధి కల్పన విధానం గురించి కృషి చేయడం మోడీ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. ప్రధానంగా ప్రైవేటు రంగంలోని ఐటీ, టెలికాం, ఉక్కు, ఇంజనీరింగ్, మైనింగ్ రంగాల్లో ఇటీవల ఇంజినీర్లు, నైపుణ్య కార్మికులు భారీగా ఉద్యోగాలను కోల్పోయారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగితకు ఇది నూతన సవాలుగా మారుతోంది. మోడీ సర్కారు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు చర్యలతో అనేక చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడటంతో సిబ్బంది రోడ్లపాలయ్యారు. వారికి ఉపాధి భద్రత కరవైంది. మోడీ ప్రభుత్వం ఉపాధి భద్రత, ఆహార భద్రతకు తూట్లు పొడిచే చర్యలకు పాల్పడింది. "కులతత్వం, మతత్వం నుండి మీరు నిర్మించే నవభారతం విముక్తి పొందాలి" అని కూడా కొత్తగా నమోదు చేసుకొనేవారికి మోడీ మన్‌కీ బాత్‌లో విజ్ఞప్తి చేయడం చూస్తుంటే "దెయ్యాలే వేదాలు వల్లించినట్లు" ఉపమానం గుర్తుకురాక తప్పదు. దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రధానమైన వ్యవస్థల్లో కాషాయదళానికి చెందిన వారిని అధిపతులుగా నియమించడం ద్వారా దేశంలోని యువత బుర్రలను కలుషితం చేస్తూ నవభారత నిర్మాణానికి మీరే పునాది అని సూక్తులు వల్లించడం సమర్థనీయం కాదు. యువతలో, నూతన ఓటర్లలో ప్రగతిశీల భావాలను ప్రోదుచేసే విధానాలు అనుసరించి మోడీ సర్కారు దాని చిత్తశుద్ధిని నిరూపించుకోవలసిన అవసరం వుంది.

చురక

రజనీకాంత్ తమిళనాట
రాజకీయ సంరంభం
ప్రజాసేవ చేసేందుకు
పార్టీ ఇంకా ప్రారంభం

రజనీ అభిమాన గణం
రాజకీయ బహుళ జనం
స్వంత పార్టీ వీడి ఎవరు
చేరకుంటే ఏల పవరు

- వేల్పుల నారాయణ

మనుస్మృతీయం

తోకల రాజేశం

భూమి మీద తనతోపాటే జన్మించిన పక్కవాని మీద కులమనే ముద్ర వేసి - వాన్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా దోపిడీ చేసిన చరిత్ర ప్రపంచంలో ఒక్క భారతదేశంలో తప్ప మరెక్కడా లేదు. ప్రపంచ దేశాల్లో అక్కడక్కడా కనిపించిన బానిస వ్యవస్థ కంటే క్రూరాతి క్రూరమైనది కులవ్యవస్థ. దీని పూర్వరూపమే వర్ణ వ్యవస్థ. బానిస వ్యవస్థలోనైనా బానిసకు - అతడు మనిషి అనే గుర్తింపు వల్ల కొన్ని హక్కులు సంక్రమిస్తాయి గానీ వర్ణ వ్యవస్థలోని 80 శాతానికి పైగా వున్న ప్రజలైన శూద్రులు-అతి శూద్రులకు- అగ్రభాగాన కూర్చున్న వాళ్లకు వెట్టిచాకిరీ చేయడానికి మించి ఏ విధమైన హక్కులూ లేవు. చదువుకునే హక్కులేదు. కాబట్టి చైతన్యం లేదు. పొరపాటున ఎవరైనా అక్షరాలను వింటే చాలు - వాళ్ల చెవుల్లో సీసాలు కరిగించి పోయబడేవి. ఎక్కడైనా విన్న శ్లోకంలోని అక్షరాలను పలికితే వాళ్ల నాలుకలు కత్తులకు బలయ్యేవి. కుత్తుకలు తెగిపోయేవి. ఇంతటి దుర్మార్గానికి రాచబాటలు పరచింది మనుస్మృతి. మతం పేరు మీద చెలామణిలో వున్న అనేక గ్రంథాలు ఇవే అన్యాయాలను పరోక్షంగా సమర్థిస్తే - మనుస్మృతి ప్రత్యక్షంగా వాటికి చట్టబద్ధత కల్పించింది. తన నియమాలను బ్రాహ్మణుల ఆమోదంతో అమలు చేయాల్సిన బాధ్యత పాలకులదే (రాజులు...) అని చెప్పింది మనుస్మృతి. అలా జరగని పక్షంలో బ్రాహ్మణులు ఆ రాజును చంపి అయినా తన నియమాలను అమలు చేస్తారని కూడా సెలవిచ్చింది. బహుశా! కష్టాన్ని మాత్రమే నమ్ముకొని బతికే మనిషి హక్కులను ఇంతలా నిరాకరించిన చెత్త పుస్తకం ఎక్కడా పుట్టి వుండదు. అందుకే ఇది అంబేద్కర్ ఆగ్రహ జ్వాలల్లో మాడిమసైపోయింది.

మనుస్మృతి కేవలం బ్రాహ్మణులు కోసమే బ్రాహ్మణులే రాసుకున్న - కుట్ర సిద్ధాంతాల పుస్తకం. లేకపోతే బ్రాహ్మణులకు మాత్రమే సకల సౌకర్యాలు కల్పిస్తూ - ఉత్పత్తి తరగతుల ప్రజలను అణిచివుంచే రకరకాల దుష్టపన్నాగాలను పన్నటమెందుకు? బ్రాహ్మణుడు ధర్మాన్ని కాపాడుతాడు. శూద్రుడు ధర్మాన్ని చెరుస్తాడట. స్మృతుల్లో మొట్టమొదటిదని చెపుతున్న మనుస్మృతి - ఆ దేవుని ఆజ్ఞను పాటించలేదని ఒప్పుకోవాలా? లేకపోతే ఆ దేవుడే మనుషులందరూ సమానం కాదని - శూద్రులందరినీ అణగదొక్కాలని శాసనం చేశాడని ఒప్పుకోవాలా?

శూద్రులతోపాటు - స్త్రీలంటే కూడా మనువుకు చెప్పరాని మంట. ఆ మనువును కన్నది కూడా ఒక స్త్రీమూర్తే అన్న సంగతి వానికి తెలిసినట్టు లేదు. మనుషులు - మనుషులకే పుడతారన్న జ్ఞానం లేని వాడే ఒకరు తలనుంచి, మరొకరు మొల నుంచి పుడతారని చెప్తాడు. మనిషిని తరతరాలుగా అంత రించిపోకుండా పునరుత్పత్తి ప్రక్రియ ద్వారా కాపా డుకుంటూ వస్తున్న పవిత్ర స్త్రీమూర్తి గురించి -

పితా రక్షతి కౌమార్యే
భర్తా రక్షతి యౌవనే
రక్షంతి స్థావిరే పుత్రా
నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి (మనుస్మృతి - 9వ అధ్యాయం-3)

స్త్రీలు బాల్యంలో తండ్రిచేత, యవ్వనంలో భర్తచేత, ముసలితనంలో పుత్రునిచేత కాపాడదగిన వారు - ఇలా జీవితంలో ఏ దశలోనూ స్త్రీ స్వాతం త్ర్యానికి అర్హురాలు కాదన్నాడు మనువు. ఇతగాని శాసనం భారతదేశ స్త్రీల జీవితాలతో ఇప్పటికీ చెలగాటమాడుతూనే వుంది. తరతరాల వారస త్వంగా మనువాద భావజాలం అన్ని ఉత్పత్తి తరగతుల ప్రజల జీవితాలను సర్వనాశనం చేసింది.

బానిసత్వ వ్యవస్థను బానిస ప్రజలు ఏ విధంగా అసహ్యించుకుంటారో - మన దేశంలోని ప్రజలు అంతే సహజంగా మనుస్మృతిని అసహ్యించు కుంటారు. దాన్ని తిట్టనివాడు తప్పకుండా దాని ప్రజానీకం మీద రుద్దేవాడై ఉంటాడు. ఇలాంటివాళ్లు ఈ దేశ జనాభాలో 90 శాతంకు పైగా వున్న ఉత్పత్తి కులాలందరికీ ఉమ్మడి శత్రువులు. ఆర్.ఎస్.ఎస్. నాయకుడు (బీజేపీ, ఆర్.ఎస్.ఎస్. వాళ్లు ఆయన్ని గురూజీగా గౌరవిస్తారు) గోల్వాల్కార్ మనువును ప్రపంచంలోనే మొట్టమొదటి ధర్మశాస్త్రకారుడన్నాడు. వర్ణ విభజన ద్వారా శ్రమ విభజనను నిర్దేశించిన శాస్త్రకారుడు మనువు అనీ, ఏనాటి కాలానికైనా మనుధర్మశాస్త్రం ఆచరణీయ మైన గొప్ప గ్రంథం అని - మనువు మీద పొగడ్తల వర్షం కురిపించాడు. ఇప్పటికీ ఆర్.ఎస్.ఎస్. దాని అనుబంధ సంస్థల దృక్పథం ఇదే. వాళ్ల గురూజీ బాటలోనే ఉత్పత్తి కులాల ప్రజలను ద్వేషించటం - తేరగా తిని కూర్చునేవాళ్లను నెత్తిన పెట్టుకొని ఊరేగటం చేస్తున్నారు వీళ్లు. అందుకే మనుస్మృతిని దహనం చేస్తున్నవాళ్లు - వీళ్లకు దేశ ద్రోహులుగా కనిపిస్తున్నారు. ప్రజలకు హక్కులే వద్దన్నవాడు ధర్మశాస్త్రకారుడైతే - మనిషిగా తన హక్కుల కోసం పోరాడేవాడు దేశద్రోహికాక మరేమవుతాడు?

వ్యాస రచయిత సెల్ : 9676761415

వి-మెయిల్


లేకి బుద్ధి చూపిన పాకిస్థాన్

భారత మాజీ నౌకాదళ అధికారి కులభూషణ్ జాదవ్ ని అపహరించి,గూఢచర్యం కేసు బనాయించి, సైనిక కోర్టులో విచారించినట్టు నటించి,చివరకు మరణ శిక్ష ఖరారు చేస్తున్నట్టు ప్రకటించిన పాకిస్తాన్ ఆయన,వారి కుటుంబసభ్యులతో కలిసే సందరాన్నీ అతితెలివితో పాడు చేసింది. అంతర్జాతీయ సమాజం ఏర్పరచుకున్న, ఆయా సందరాల్లో పాటించాల్సిన కనీస మర్యాదల్ని తన లేకి ప్రవర్తనతో ఉపేక్షించింది.పాకిస్తాన్ కి ఒకటే ధ్యాస. భారత్ కూడా తన లాగే ఉగ్రవాదానికి వంత పాడే దేశమని అందర్నీ నమ్మించాలి. తాను సకల సాక్ష్యాలతో దొంగగా దొరికిన ప్రతీసారీ భారత్ పై బురద జల్లాలి.అందులో భాగమే జాదవ్ ని 'తమ దేశంలో తీవ్రవాదాన్ని ప్రోది చేస్తున్న భారత గూఢచారి' గా ముద్రవేయడం.ఆయనకు అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం ఇవ్వాల్సిన న్యాయసహాయం గానీ,కాన్సులర్ ఏక్సెస్ గానీ ఇవ్వకుండానే మరణ శిక్ష ఖరారు చేసింది.

భారత్ అంతర్జాతీయ న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదించ బట్టి,మరణ శిక్ష నిలుపుదల ఉత్తర్వులను సాధించ బట్టి,తన దుందుడుకు చర్యని వాయిదావేసింది.అయితే తన చిన్నబుద్ధిని దాచుకోలేకపోయింది. 22మాసాల తర్వాత తల్లినీ,భార్యనీ కలిసే అవకాశం ఇచ్చినప్పుడు వారిని అద్దాల గోడలకి అటూఇటూ నిలబెట్టడం శాడిజం.ఆ సందర్భంలో తల్లి వేసుకున్న గాజులూ,బొట్టు,తాళి వంటి వాటికి కూడా అభ్యంతరం చెప్పడం అవమానించడానికే.ఇలాంటి చర్యల వల్ల ఆ దేశం బాధించి శునకానందం పొందడం మినహా బావుకున్నదేమీ లేదు.అలా అని భారత్ ఈ ఉదంతాన్ని తేలిగ్గా తీసుకోడానికి లేదు.కక్షాపూరిత వైఖరికి జాదవ్ బలి కాకుండా భారత్ తన దౌత్య ప్రయత్నాల్ని కొనసాగించాలి. పాక్ పై అంతర్జాతీయ సమాజం ద్వారా ఒత్తిడి పెంచాలి.అంతర్జాతీయ న్యాయస్థానంలో సంబంధిత కేసు గెలిచేలా పూర్తి ప్రయత్నాలు చెయ్యాలి.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీఎంపీ, పార్వతీపురం, విజయనగరం.

అవిశ్రాంత యోధుడు బర్ధన్



డి.రాజా
సిపిఐ జాతీయ కార్యదర్శి

నా కూతురు అపరాజిత విచార వదనంతో నా చెంతకు వచ్చింది. 'లెఫ్ట్ తీవ్రంగా ఆత్మశోధన చేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. లెఫ్ట్ పెద్ద సంక్షోభంలో మునిగింది. అనేక సమస్యలపై వైఖరిని పునఃసమీక్షించుకోవలసి ఉంది. వ్యూహాలను తిరిగి రూపొందించు కోవాలి. కార్యాచరణ, పనిశైలి పూర్తిగా మారాలి. ప్రజల చెంతకువెళ్లి మారిన పరిస్థితుల్లో దాని ప్రాసంగికతను పునఃస్థాపించుకోవాలి.' 2014లో సాధారణ ఎన్నికల్లో పార్టీ పరాజయంపై ఆమె తీవ్రంగా వ్యాకులత చెంది అన్నమాటలివి. ఆమె వెలిబుచ్చిన భావాలను కామ్రేడ్ బర్ధన్‌తో పంచుకున్నాను. ఆయన ఒక క్షణం ఆలోచించుకోకుండా ఆమె చెప్పింది పూర్తిగా సత్యమని చెప్పారు. సీపీఐకి 16 సంవత్సరాలు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అర్ధేందు భూషణ్ బర్ధన్ స్పందన ఆ విధంగా ఉంది. పుదుచ్చేరిలో జరిగిన పార్టీ మహాసభలో ఈ సమస్యలపైనే ఆయన నాతో చర్చించారు. 2017 డిసెంబరు 26వ తేదీకి మన పార్టీకి 92 సంవత్సరాలు నిండాయి. వైచిత్యం ఆర్ ఎస్ఎస్‌కి 92 ఏళ్లు నిండాయి. భారతదేశ మిత వాద పక్షం ఆర్ఎస్ఎస్ భారత రాజకీయాల్లో కేంద్రస్థానంలోకి వచ్చింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ యంత్రాంగంపై ఆర్ఎస్ఎస్ పట్టుబిగించడమే కాకుండా రాజ్య వ్యవహారాలను కూడా ప్రభావితం చేస్తోంది. మితవాద పక్షం భారతదేశ జాతీయతను హిందూత్వ భావజాలానికి అనుగుణంగా పునర్ నిర్వచించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఆనాడు బర్ధన్ అన్నమాటలు ఇవి. ఈ పరిణామాలపట్ల బర్ధన్ కలతచెందారు. భారత కమ్యూనిస్టు ఉద్యమం, భారతదేశ వామపక్ష ఉద్యమం ప్రారంభం నుండి భారతదేశమనే భావాన్ని సెక్యులరిజం, సామాజికన్యాయం, సోష లిజం, ఆదర్శాలకు ప్రాతినిధ్యం వహించేటట్లుగా చిత్రిస్తూ వచ్చాయి. భావాల పోరాటం - రాజకీయ అధికార పోరాటం మరింత తీవ్రమయ్యాయి. దేశ రాజకీయ దిశానిర్దేశన చేసే ప్రక్రియలో వామపక్షాలు ఉన్నాయా? అన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులను సమీకరించే కేంద్రంగా లెఫ్ట్ మారుతుందా? ప్రజలను కార్యాచరణకు సమీకరించగల సామర్థ్యం వామపక్ష పార్టీలకు ఉన్నదా? ప్రస్తుత పరిస్థితి కొనసాగినట్లయితే, భారతదేశ వామపక్షాలు, కమ్యూనిస్టుల భవిష్యత్తు

ఏమిటి? అనేక సంవత్సరాల పాటుగా దేశంలో అత్యంత



నేడు బర్ధన్ ద్వితీయ వర్ధంతి

శక్తివంతమైన ట్రేడ్ యూనియన్లు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, సీపీఐకి నాయకత్వం వహించిన బర్ధన్‌ను ఈ ప్రశ్నలు వెంటాడాయి. బర్ధన్ కేవలం పార్టీ నాయకుడు మాత్రమే కాదు. అవిశ్రాంత విప్లవ యోధుడు. ఆయన తన చివరి రోజుల్లో ఒంటరిగా కూర్చుని సుదీర్ఘంగా ఆలోచిస్తూ తన అధ్యయనాలను కొనసాగించేవారు. భవిష్యత్ కార్యాచరణకు నిర్దిష్టమైన సైద్ధాంతిక పునాదులపై ఆయన దృష్టి కేంద్రీకరించారు. దానికనుగుణంగా పార్టీ కార్యక్రమాన్ని రూపొందించడంలో ఆయన నిమగ్నమయ్యారు.

మూడు దశాబ్దాలపాటు బర్ధన్‌తో నేను సన్నిహితంగా పనిచేశాను. 1985లో యువజనోద్యమానికి నేతృత్వం వహించేం దుకు పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిరావాల్సిందిగా ఆయన నన్ను కోరారు. నేనప్పుడు తమిళనాడులో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని, సీపీఐ తమిళనాడు రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యున్ని అదే సంవత్సరం సెప్టెంబరులో ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ జాతీయ సమితి ఆహ్వానితులుగా నేనెన్నికయ్యాను. జాతీయ రాజకీయ రంగంలో నా ప్రయాణానికి ఇది ఆరంభం. సీపీఐ కేంద్ర కార్యాలయంలో నేను పనిచేయడం ప్రారంభించినప్పుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆ తరువాత

కామ్రేడ్స్ ఇంద్రజిత్‌గుప్తా, బర్ధన్‌లతో పనిచేసే అవకాశం నాకు లభించింది. దేశ చరిత్రలో అది గందరగోళ కాలం. ఈ కాలంలో రాజకీయ శక్తుల పొందిక మారింది. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం సమూనాకు వామపక్షాలు కీలకపాత్ర పోషించాయి.

1995లో కామ్రేడ్ ఇంద్రజిత్‌గుప్తా కేంద్ర మంత్రి అయినప్పుడు బర్ధన్ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. దేశంలో రాజకీయ పరిణామాల దిశలో, ప్రభుత్వాల ఏర్పాటులో, రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతుల ఎన్నికలో, కార్యక్రమాలు, విధానాలను రూపొందించడంలో ప్రభావం చూపిన సంక్లిష్ట సమయాల్లో కీలక సమావేశాలకు హాజరవుతూ బర్ధన్‌తో నేను సన్నిహితంగా పనిచేశాను. బర్ధన్ నిజాయితీ, ముక్కుసూటి ధోరణి, సమస్యలపై ఆయన స్పష్టత, వాస్తవాలపై ఆయన పట్టు, ఇతరుల అభిప్రాయాలను ఆలకించేందుకు ఆయన అంగీకారం ఆయనకెంతో గౌరవాన్ని, ప్రశంసలను సంతరింప చేశాయి. రాజకీయంగా, ఆయనతో పరస్పరం చర్చించడానికి, పద నిర్దేశానికి ఆయన వైపు చూడడానికి కోబాడ్ గాంధీ, ప్రొఫెసర్ సాయిబాబావంటి క్రియాశీల కార్యకర్తలను సైతం ఆయన ఆకర్షించారు. సామాజిక, సాంస్కృతిక క్రియాశీల కార్యకర్తలు, మేధావులు ఆయనను నిరంతరం కలుస్తుండేవారు. ఆయనకు వయసు మీరడంతో నడిచేటపడు సహాయంగా నాచేయి పట్టుకునేవారు. మూడు దశాబ్దాల సన్నిహిత అన్యోన్యత అనంతరం మా సంబంధ బాంధవ్య స్వభావం ఎట్టిది అని నేను ఆశ్చర్యపోయాను. అది నాయకుడు మరియు కార్యకర్త సంబంధమా? పార్టీ ప్రధాన కార్యదర్శి ఒక కార్యదర్శిని ఆకట్టుకోవడమా? లేక ఒక సీనియర్ సహచరుడు తన జూనియర్‌తో పనిచేయటమా? ఇద్దరు కామ్రేడ్లు? అది ఒక తండ్రికి, తనయుడికి మధ్య సంబంధమా? బర్ధన్ ఇప్పటికీ నా చెయ్యిపట్టుకున్నట్లే నేను అనుభూతి చెందుతున్నాను. మనసులు సన్నిహితమైనట్లు నేను భావిస్తున్నాను. అది ఎన్నటికీ శాశ్వతంగా ఉంటుంది.

'కర్మణేవాధికారస్తే'...!

బి.బాబు బహదూర్

ఏడూళ్ల సూరిగాడు



ఊరు ఊరంతా సందడే సందడి. ఆడోళ్లు సంక్రాంతి నెలపట్టేశారు. పొద్దు కూయక ముందే ఇళ్ల ముంగిళ్లల్లో ఒకటే హడావిడి. పెద్ద పెద్ద ముగ్గులు. రంగవల్లులు అద్దుతూ ఇల్లాళ్లు పోటీ పడుతున్నారు. నిజంగా సంక్రాంతి ముగ్గుల గోలలో అతివల సృజనాత్మకత వెల్లివిరుస్తోంది. చక్కటి కళ ఉట్టిపడుతోంది. ఇవ్వాళ న్యూఇయర్ డే... అంతే కోకల్లో కొమ్మలు రెచ్చిపోయారు. ఆ ముగ్గుల్ని తొక్కటం ఇష్టం లేక ఏడూళ్ల సూరిగాడు రోడ్డు మార్జిన్‌లో నడుస్తున్నాడు. సుబ్బయ్య శెట్టి అప్పుడే హోటల్ తెరిచాడు. సూరిగాడిని చూడగానే గ్లాసులో కాస్త పాలు పోసి, సంచి నుంచి డికాషన్ దించాడు. వేడి వేడి టీ సూరిగాడికి అందించాడు. సూరిగాడు టీ తాగుతున్నాడు. ఇంతలో భూషణం వచ్చాడు. అతడికీ సుబ్బయ్య టీ ఇచ్చాడు.

"బాబాయ్ బాగున్నావా"? సూరిగాడిని భూషణం పలకరించాడు.

"అంతా బాగే... ఏంటీ విశేషాలు" సూరిగాడు అడిగాడు.

" ప్చ్ ఏం లేదు బాబాయ్... జీవితం చప్పగా ఉంది... ఇదిగో ఈ టీలా" నిరుత్సాహంగా భూషణం తల వేలాడేశాడు.

"పంచదార వేశాగా" సుబ్బయ్య శెట్టి కలగజేసుకున్నాడు.

"అంటే తియ్యగా లేదని కాదు" సుబ్బయ్య వైపు భూషణం చూశాడు.

"మరేంటో"? సుబ్బయ్య గుంజుకున్నాడు.

"అయ్యా నీ టీ బాగానే ఉంది. ఏదో మాట వరసకి జీవితంతో పోల్చా" భూషణం దండం పెట్టాడు.

"ఏమైందిరా? బాగానే వ్యవసాయం చేస్తున్నావ్. పిల్లల్ని పెద్ద చదువులు చదివించావ్. ఆడపిల్లలకి పెళ్లి చేశావ్.. దాదాపు ముప్పై ఎకరాలు కూడబెట్టావ్. కనీసం యాభై కోట్ల ఆస్తి ఉంది. ఇంకేం కావాలి"? సూరిగాడు అడిగాడు.

"ఏం వ్యవసాయం.. ఎంత చెట్టుకి అంత గాలన్నట్టు.. పేరుకే పెద్ద రైతుని. పంట చేతికి రాగానే ధర పడిపోతోంది. కనీసం పెట్టుబడులు రావటం లేదు. అయినా అలసిపోయా బాబాయ్", భూషణం నవ్వాడు.

"పోనీ రెస్టు తీసుకో. కృష్ణారామా అంటుంటే కాలం గడిచిపోద్ది" సూరిగాడు సలహా ఇచ్చాడు.

"పని చేయక పోతే ఎట్టా. పొట్ట నిండుద్దా. నోటికి ఐదేళ్లు అందాలంటే ఏదోక పని చేయాల్సిందే. వ్యవసాయం కాకపోతే సులువుగా చేసే పని ఎంచుకోవాలి" భూషణం అన్నాడు.

"ఓరి నీ పిసినారితనం జావ.. ఇంతకీ ఏ పని ఎంచుకుంటావ్" సూరిగాడు అడిగాడు. "అదే ఆలోచిస్తున్నా... రాత్రి రాఘవేంద్ర స్వామి కల్లోకి వచ్చాడు" భూషణం అనగానే తీక్షణంగా చూసి "కొంపతీసి గుడి కట్టి అర్చకత్వం చేస్తావా" సూరిగాడు అడిగాడు.

"అబ్బే అదేం లేదు" భూషణం సిగరెట్టు వెలిగించి సూరిగాడికి మరోటి ఇచ్చాడు. సూరిగాడు కూడా వెలిగించి ఓ దమ్ములాగాడు.

"జీవితంలో మార్పు అనివార్యం. ఇప్పటి వరకూ సొంతానికి కష్టపడ్డావ్. ఇక సమాజం కోసం తపించు అని రాఘవేంద్ర స్వామి సెలవిచ్చాడు" భూషణం కళ్లు పెద్దవి చేశాడు.

"అంటే దాన ధర్మాలు, సంతర్పణలు చేస్తావా? పిల్లికి బిచ్చం పెట్టని నీకు ఇవ్వన్నీ కుదురుతాయా"? సూరిగాడు అడిగాడు.

"ఉహూ...రాజకీయాల్లో చేరుతా" భూషణం అనగానే సూరిగాడు ఉలిక్కిపడ్డాడు. "ఏ పార్టీలో చేరుతావ్. కాంగ్రెస్‌లోనా... తెలుగు దేశంలోనా... వైసీపీలోనా... బీజేపీలోనా... జనసేన లోనా"...? వ్యంగ్యంగా సూరిగాడు అడిగాడు.

"ఆ పార్టీల్లో ఏముంది బూడిద. కోట్లు ఇస్తేనే టిక్కెట్లు ఇవ్వరు. ధన రాజకీయాలంటే నాకు వళ్లు మంట", భూషణం చెప్పాడు.

"ఐతే, సీపీఐ, సీపీఎం... ఏదోక పార్టీలో చేరు. ఇవి పూర్తి పేదల పార్టీలు. సమ సమాజ స్థాపనే ఈ పార్టీల లక్ష్యం". సూరిగాడు మరో సలహా ఇచ్చాడు.

మరదే... పేదోళ్లకి, పెద్దోళ్లకి తేడా లేదన్నందుకే ఈ పార్టీలకి మాలాంటోళ్లంతా దూరమయ్యారు. అయినా ఒకటే క్రమశిక్షణ. డబ్బులు దండుకోనీయరు. వాళ్లు తినరు. ఇంకొకళ్లని తిననీయరు. గడ్డివాముకాడ కాపలా కాసే కుక్కలనుకో", భూషణం అనగానే సూరిగాడి కళ్లు ఎరుపెక్కాయి.

"నీలాంటి స్వార్థ పరులకు ఈ పార్టీల్లో చోటు దొరకదులే" కోపంగా అన్నాడు సూరిగాడు.

అంత కోపం వద్దు బాబాయ్... రాజకీయాలంటే ఇప్పుడు వ్యాపారమే. ఇప్పటికే ఈ పార్టీలంటే జనంలో ఏవగింపు వచ్చింది. కొత్తపార్టీలకే అవకాశం పెరిగింది. తమిళనాడులో రజనీకాంత్ కూడా రాజకీయ తెరమీదకు వచ్చేశాడు. ఇక సూపర్‌గా నటించేస్తాడు. జనం వెర్రివెర్రిగా ఎగబడతారు. ఆ రాష్ట్రంలో సినిమా వాళ్లంటే పడి చస్తారు. కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత... వీళ్లంతా సినిమావాళ్లే కదా. రజనీ పార్టీకి జనం ఓట్లు వేస్తారు. అందుకే తమిళనాడు వెళ్లిపోతా, ఇద్దరు అబ్బాయిలూ మద్రాసులోనే ఉన్నారు. వాళ్ల దగ్గర ఉన్నట్టు ఉంటుంది. టిక్కెట్టు వస్తే ఎమ్మెల్యేగిరి వస్తుంది." భూషణం అసలు విషయం చెప్పేశాడు.

"చాలా ఆశ పడుతున్నావ్ అబ్బాయ్... విజయ్‌కాంత్, శరత్‌కుమార్ పార్టీలు పెట్టారు. జనం తిప్పికొట్టారు. ఇక కమల్‌హసన్ కూడా లైన్‌లో ఉన్నాడు. రజనీ కాంత్‌కు ఇప్పటి వరకూ సామాజిక బాధ్యత పట్టలేదు. తుపానులు వచ్చినా... కరవు వచ్చినా ఏనాడు స్పందించలేదు. కనీసం లక్ష విరాళం ఇవ్వని పిసినారి. చూస్తుండు... కూడబెట్టిన కోట్లన్నీ కరగదీయడం ఖాయం. ఒక వేళ విరాళాలు దండుకుని దాచుకుంటే... జనమే ఉమ్మేస్తారు. ఎందుకంటే తమిళనాడులో బహుమతి లేనిదే ఓటు పడదు. ఎందు కొచ్చిన ఆయాసం.. ఇక్కడే ఉండి జనసేనలో చేరు". సూరిగాడు అన్నాడు.

"ఓరి నాయనో... ఇదో ప్యాకేజీ పార్టీ అని జనం గొణుగు తున్నారు తెలుసా. ప్రతి పక్ష పార్టీలు ప్రభుత్వంపై దండెత్తినప్పుడల్లా జనంలోకి సేనాపతి వచ్చి హడావిడి చేస్తాడు. బీజేపీని, టీడీపీని ప్రశ్నిస్తాడు. అంతే స్పందించి నట్టు ప్రభుత్వాలు నటిస్తాయి. మళ్లీ ఆయన కెమెరా ముందుకు వెళ్లిపోతాడు. గుర్తుకొచ్చినప్పుడల్లా ట్విట్టర్‌లో మెరుస్తాడు. ఆ పార్టీకి అంత సీన్ లేదు బాబాయ్" భూషణం ఎగతాళి చేశాడు.

"సరే ఏం చేయాలనుకున్నా... చీకటిలో బాణం విసరొద్దు. ప్రణాళిక ప్రకారం పని చేసుకో. స్వార్థం విడిచి పెట్టు. నీ పనితీరే నీకు మంచి ఫలితాన్నిస్తుంది", సూరిగాడు లేచి కండువా భుజాన వేసుకున్నాడు.

విశాలాంధ్ర
బతుకు
The Life

మంగళవారం
02 జనవరి 2018

S & D

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు,
వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్
చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

మృదంగ విజయం

విజయనగరం మన సాంస్కృతిక రాజధాని. సంగీత, సాహిత్యాలకు పెట్టింది పేరు. అంతేనా, సంగీత వాయిద్య పరికరాలకూ ఈ జిల్లా పేరెన్నికగన్నదే. వీణ అనగానే మనకు బొబ్బిలి గుర్తుకొస్తుంది. వీణల తయారీలో బొబ్బిలికి ఉన్నంత పేరు ఇంతాఅంతా కాదు. ఇది ప్రపంచ ప్రఖ్యాతి చెందినది. ఈ జిల్లా గురించి మనకందరికీ తెలియని విషయం ఇంకొకటుంది. అదే మృదంగాల తయారీ. ఒక్క వీణే కాదు మృదంగాల తయారీకి విజయనగరం జిల్లా ప్రసిద్ధి చెందింది. వీటి రూపకల్పనలో ప్రత్యేకించి విజయనగరం పట్టణానికి మంచి పేరుంది. ఇక్కడ తయారైన మృదంగం ఖండాతరాలలో తన నాదాన్ని వినిపిస్తోంది.

సంగీత కచేరీలో మృదంగానిదీ ముఖ్యపాత్రే. కర్ణాటక సంగీతంలో అత్యంత ప్రాముఖ్యమైనది మృదంగమే. మంచి మృదంగనాదం చెవులకు హాయినిస్తుంది. మనస్సును సేదతీరుస్తుంది. మెదడుకు ఉత్తేజాన్ని ఇస్తుంది. ఇదంతా జరగాలంటే కేవలం వాయించడంలోనే కాదు దీని తయారీలోనూ నేర్పరితనం చూపించాలి. అలాంటి కళాకారులు విజయనగరంలో ఉన్నారు. కళాకారులు ఎక్కడైనా ఉండవచ్చు కానీ మృదంగాల తయారీకి చిరునామా మాత్రం విజయనగరమే.

70 ఏళ్ళ నుంచీ ఇదే వృత్తి

మృదంగం తయారీనే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న కుటుంబాలు విజయనగరంలో ఉన్నాయి. నిమ్మల, ఉరివి కుటుంబీకులు 70 ఏళ్ళుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఈ కుటుంబాలు ఒక మృదంగమే కాదు తబలా, డోలక్, కాంగో, డప్పులను కూడా తయారు చేస్తున్నారు. ఇన్ని తయారు చేస్తున్నా వాటి మీద వచ్చే ఆదాయం అంతంతమాత్రమే. అయినా వీటి తయారీని వదిలిపెట్టకుండా కళలకు తమ వంతు చేయూతనిస్తున్నారు ఈ వాయిద్య పరికరాల తయారీ కళాకారులు. భుక్తికి లోటు లేకుండా గడిచిపోతే చాలని, ఇంతకుమించి తామేమీ కోరుకోవడం లేదనీ చెబుతున్నారు వారు.

తయారీకి నెలరోజులు

మృదంగం కావాలంటే ముందుగా ఆర్డరివ్వాల్సిందే. తయారు చేసి ఉంచడానికి చాలా ఖర్చు అవుతుంది, ఎంతో శ్రమపడాలి. ఇంతా చేస్తే ఎవరైనా కొంటారో లేదో తెలియని పరిస్థితి. అందుకే ముందుగా ఆర్డర్ ఇవ్వాలి అంటున్నారు. మృదంగం పూర్తిస్థాయిలో తయారవడానికి నెలరోజులు పడుతుంది. దీనికోసం చాలా కష్టపడాలి. ఒక్కో మృదంగం ధర రూ. 10 వేల వరకూ ఉంటుంది.

చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ....

ఒక్క విజయనగరం వాసులే కాదు చుట్టుపక్కల ప్రాంతాలు, నగరాలు విశాఖపట్టణం, శ్రీకాకుళం, రాజమండ్రితో పాటు పక్కరాష్ట్రం ఒడిషా నుంచి సంగీత కళాకారులు వచ్చి ఇక్కడ మృదంగాలను తయారు చేయించుకుంటారు. ఇక్కడ తయారైన మృదంగాలు రాష్ట్రం, దేశానికే పరిమితం కాలేదు, ఖండాతరాలకూ వెళుతున్నాయి. అక్కడా తమ నాదాన్ని వినిపిస్తున్నాయి, వీటి తయారీలో విజయనగరం ఖ్యాతిని చాటుతున్నాయి అని చెబుతున్నారు ఇక్కడ తయారీదారులు.

రాష్ట్రప్రభుత్వ బహుమతి

మృదంగాల తయారీలో నిపుణుడైన ఉరివి శివలింగం ఇందుకు 1984-85లో రాష్ట్రప్రభుత్వ బహుమతిని అందుకున్నారు. ప్రభుత్వం నుంచి రుణ సహాయం అందితే తమ జీవితాలు మరింత మెరుగుపడతాయని, మృదంగాల తయారీని మరింత పెంచగలుగుతామని చెబుతున్నారు.



మృదంగం తయారు చేస్తున్న దృశ్యం





తయారు చేసిన మృదంగాలు

తయారీ ఇలా...

మృదంగం తయారీలో సిద్ధహస్తుడైన ఉరివి శివలింగం వాటి తయారీ గురించి వివరించారు. మృదంగం తయారీకి సంగీత పరిజ్ఞానం అవసరమే. దీని తయారుచేయడానికి పనస, ఏగిశ కలపను ఉపయోగిస్తారు. మృదంగం డొల్లను ఈ చెట్ల మానుతో రూపొందిస్తారు. పైన అమర్చే పొర కోసం ఆవు, గేదె, మేక చర్మాలను వినియోగిస్తారు. ఈ చర్మలను కబేళాల నుంచి తీసుకొచ్చి నాలుగు వారాలపాటు ఎండబెడతారు. ఈ చర్మాలన్నీ కూడా ఆడ జంతువుల చర్మాలే అయి ఉండాలి. మృదంగానికి చుట్టూ గేదె చర్మాన్ని చుడతారు. ఎడమవైపున రెప్పకు గేదె చర్మం, కుడివైపున ఉన్న రెప్పకు ఆవు చర్మాన్ని, లోపలి పొరకు మేక చర్మాన్ని ఉపయోగిస్తారు. ఈ విద్య అంతా తాను తన మామగారైన నిమ్మల సోమలింగం దగ్గర నేర్చుకున్నానని వివరించారు. ఈ మృదంగాల తయారీలో తనకు తన కుమారుడు ఉరివి చంద్రశేఖర్‌తో పాటు బంధువు నిమ్మల శ్రీధర్ కూడా సహాయపడుతున్నారని ఉరివి శివలింగం తెలియజేశారు.

ఎందరో....

విజయనగరం పేరు చెబితేనే కళలు గుర్తుకొస్తాయి. నాటి నుంచి నేటి వరకూ అదే పేరును కొనసాగిస్తోంది ఈ నగరం. ఎందరో సాహిత్య, సంగీత కళాకారులకు వేదికగా నిలిచిన విజయనగరం ఈ రూపేణా ఇంకెంతోమందికి జీవనోపాధిని కలిగిస్తోంది. సాహిత్య రంగంలోనేకాదు సంగీత రంగంలో కూడా ఎందరో ఉద్దండులను జాతికి అందించింది. అందులో ఘంటసాల, సుశీల, ద్వారం వెంకటస్వామి నాయుడు, నేదునూరి కృష్ణమూర్తి లాంటి వారందరూ ఉన్నారు.

– ఎం.సోమశేఖరాచార్యులు, విజయనగరం

నవ్వును అడ్డుపెట్టుకుంటున్నారా!?



నవ్వు నాలుగిందాల మేలంటారు. నవ్వుతూ జీవిస్తే ఎంతో హాయిగా ఉంటుంది. నవ్వుతూ ఉన్నవారిని అందరూ ఆదరిస్తారు. అక్కున చేర్చుకుంటారు. వారితో గడపాలని, వారితో స్నేహం చేయాలని చాలామంది తహతహలాడుతుం టారు. నవ్వుకు ఉన్న శక్తి అసాధారణమైంది. అందంగా నవ్వడం ద్వారా ఎవరినైనా ఇట్టే ఆకట్టుకోవచ్చు. మనిషి స్వరూపస్వభావాలను బట్టి ఈ సహజమైన, అందమైన నవ్వు అబ్బుతుంది. ఇది ఒకప్పటిమాట.. ఇప్పుడు సాధనతో ఎంతోమంది అలవర్చుకుంటున్నారు. స్వచ్ఛంగా, మనసారా నవ్వడం మంచిదే. కానీ నవ్వును ఆయుధంగా వాడి ఎదుటివారిని వంచించడం తప్పు. మరి అలా నవ్వును ఆయుధంగా వాడుకుంటున్నవారిలో మీరూ ఉన్నారా? చెక్ చేసుకోండి.

1. మీరు చక్కగా నవ్వుతారని, ఆ నవ్వుతో ఎవ్వరినైనా సరే పడగొట్టగలనని మీకు ధీమా..

ఎ. అవును బి. కాదు

2. ఎవరినైనా పరుషమైన మాటలు అనాలి అనుకున్నప్పుడు నవ్వుతూ అనేస్తే ఇక వారు తిరిగి మిమ్మల్ని ఏమీ అనలేరని భావిస్తారు

ఎ. అవును బి. కాదు

3. మీకు తెలిసిన ఒక వ్యక్తి జీవితంలో ఎన్నో రకాలుగా విజయం సాధించడానికి సదరు వ్యక్తి అందరికీ ఎప్పుడూ నవ్వు ముఖంతో కనపడడమే కారణమని మీ అభిప్రాయం

ఎ. అవును బి. కాదు

4. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అప్పటికప్పుడు ముఖాన అందమైన నవ్వును పులుముకోగల సత్తా మీ స్వంతం

ఎ. అవును బి. కాదు

5. నవ్వు ముఖంతో ఇతరుల్ని బుట్టలో పడేసి పనులు చక్కబెట్టుకునే మీ తత్వం వల్ల తేనెపూసిన కత్తి అనే చెడ్డ పేరు సంపాదించినా.. దానిని మీరు పట్టించుకోరు

ఎ. అవును బి. కాదు

6. మన అవసరం తీర్చుకోవడానికి మాత్రమే నవ్వాలి తప్ప ఎక్కడ పడితే అక్కడ అనవసరంగా నవ్వకూడదని భావిస్తారు.

ఎ. అవును బి. కాదు

7. క్షమించరాని తప్పులు చేసినా..అందుకు తగిన శిక్ష పడకూడదంటే నవ్వుతూ ఆకట్టుకోవడమే తగిన మార్గమని నమ్ముతారు

ఎ. అవును బి. కాదు

8. నవ్వు అనేది మనలోని ఆనందాన్ని, స్వచ్ఛతను వెల్లడించేది అనే భావనను మీరు నమ్మరు. నవ్వు అనేది ఎదుటివారిపై పైచేయి సాధించడానికి ఉపయోగపడేదని మీ అభిప్రాయం.

ఎ. అవును బి. కాదు

9. నవ్వుతూ బతకాలి అనే దాని కన్నా నవ్వుతూ సాధించాలనేది మీ ఉద్దేశం

ఎ. అవును బి. కాదు

10. నవ్వుతూ ఉండే అమ్మాయిలు అందర్నీ బుట్టలో వేసుకోగలుగుతారని మీ విశ్వాసం

ఎ. అవును బి. కాదు

పైన పది ప్రశ్నలలో 'ఎ' ఆరు అంతకన్నా ఎక్కువగా వస్తే.. మీరు మీకున్న నవ్వు అనే శక్తిని దుర్వినియోగం చేస్తున్నట్లే. మీలో స్వార్థం శ్రుతిమించినట్లే.. స్వచ్ఛత లోపించినట్లే.. కపటత్వం, మోసకారితనం మీలో అధికంగా ఉన్నట్లే.. ఇటువంటి మాయోపాయం ఎక్కువ కాలం చెల్లదని తెలుసుకోవాలి. మనకు లభించిన అద్భుత వరం నవ్వు. దాన్ని హాయిగా జీవించడానికి, ఇతరులను సంతోషపెట్టడానికి ఉపయోగించాలే తప్ప స్వార్థం కోసంద దుర్వినియోగం చేయకూడదు.



నూతనం!

న్యూ ఇయర్ వేడుకలకు మీరంతా ఏం చేశారు? కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచుకున్నారా! ఎవరైనా చేసేది అంతేగా అంటారా! అదేంకాదు... సంప్రదాయం, విన్యూత్నం రెండూ కలగలసిన ఈ దృశ్యాన్ని చూడండి. ఏంటో అర్థమైందా! ఈ పిల్లలు తల్లిదండ్రులను పూజిస్తున్నారు. వారు నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను ఇలా చేసుకున్నారు. ఇది ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగింది.




ఆరోగ్యాన్నీ మార్చండి!

'న్యూ ఇయర్, న్యూ మీ' అనేది ఆంగ్లంలో పేరొందిన సామెత. దీనిని చాలామంది వాడుతుంటారు. కొత్త సంవత్సరం వచ్చినప్పుడల్లా కొత్త పద్ధతులు పాటించాలని చాలామంది కోరుకుంటుంటారు. అందుకోసం తమ జీవన విధానంలో మార్పులు చేద్దామని అనుకుంటారు. ఆరోగ్యంగా ఉండేందుకు లేదా నాణ్యమైన జీవన విధానం కోసం మనం ఎప్పుడూ ఆరాటపడుతుంటారు. మంచి నాణ్యతగల జీవన విధానాన్ని సాధించాలంటే దానంతట అదే రాదు. ఇందుకోసం మనం కొన్ని ప్రయత్నాలను తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. అందువల్ల మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ జీవనంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.









ఉదాహరణకు మనం తినే ఆహారంలో కొవ్వు, నూనె శాతం ఎక్కువగా ఉంటుంది. ఇందువల్ల మనం అధిక బరువు, జీర్ణ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటుంటాం. మన ఒత్తిడి స్థాయిలను, కోపాన్ని తగ్గించుకోకపోతే అనవసర ఆందోళన లేదా డిప్రెషన్ వంటి మానసిక అనారోగ్యాలకు దారితీస్తుంది. అందువల్ల అతడు/ఆమె ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ ప్రాతిపదికన కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఆరోగ్యవంతంగా లేకపోతే జీవితంలో ఇతర మంచి విషయాలను పూర్తిస్థాయిలో అనుభవించలేము.

ఒక వ్యక్తి తన వ్యాపారంలో పూర్తిస్థాయిలో నిమగ్నమై విజయవంతం కావడంతోపాటు ధనం కూడా బాగా సంపాదించాడనుకుందాం. అయితే అతడు సందర్భంలో తన ఆరోగ్యం గురించి నిర్లక్ష్యం వహించాడు. దీంతో కొంత కాలానికి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వ్యాపారానికి సంబంధించి తాను పడిన కష్టానికి తగిన ఫలితాన్ని అనుభవించాడా ? కచ్చితంగా లేదనే చెప్పాలి. జీవితంలో సాధించిన విజయం కానీ, ధనం కానీ మంచి ఆరోగ్యానికి సాటికావు అన్నది దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండటానికి మనవంతు ప్రయత్నం చేస్తే మన లక్ష్యాలను దృఢ సంకల్పంతో సాధించగలుగుతాం. ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి కొన్ని సూచనలు..

- **చక్కెర వినియోగాన్ని తగ్గించాలి :** రోజువారీ మనం చక్కెరను వివిధ రూపాల్లో ఎక్కువగా తీసుకుంటుంటాం. ఇది ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అందువల్ల చక్కెర వినియోగం తగ్గిస్తే మన ఆరోగ్యం కాపాడుకోవడానికి కొంత వీలు కలుగుతుంది.
- **పజిల్స్ సాధన చేయడం :** చాలామంది పజిల్స్‌ను పరిష్కరించడానికి ఆసక్తి చూపరు. వాస్తవానికి ఈ పనిని చేస్తే ఆలోచన స్థాయి పెరిగి, మెదడు చురుకవుతుంది.
- **హెల్త్ డైరీ నిర్వహణ :** చాలామంది తమ రోజువారీ తీరికలేని జీవితంలో శరీరంలో వ్యాధులకు సంబంధించి కనిపించే సూచనలను విస్మరిస్తుంటారు. అలా కాకుండా ఆరోగ్యంలో మార్పులకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు డైరీలో రాసుకోవాలి. అనారోగ్యానికి గురైే వైద్యుడిని సంప్రదించినపుడు ఈ అంశాలను తెలియజేస్తే వ్యాధి నిర్ధారణకు అవి ఎంతగానో ఉపయోగపడతాయి.
- **వ్యసనాలను వదిలేయడం :** ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాల సేవనం వంటి వ్యసనాలను విడిచిపెట్టాలని అనుకోవడం లేదా ఎవరికైనా సలహాలివ్వడం చాలా తేలిక. ఈ వ్యసనాలతో తీవ్ర అనారోగ్యానికి గురవుతామని వేరే చెప్పనవసరం లేదు. వీటిని వదిలేయాలని నిర్ణయం తీసుకుని, చిత్తశుద్ధితో పాటిస్తేనే ఆ ఊబి నుంచి బయటపడతాం.
- **ఒత్తిడిని అదుపు చేయడం :** ప్రస్తుత కాలంలో మానవజాతి ఎదుర్కొంటున్న ఒత్తిడి శారీరకంగా, మానసికంగా తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తోంది. చిన్న తలనొప్పి మొదలుకుని, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఒత్తిడి కారణమవుతోంది. రోజూ ఆసనాలు వేయడం, సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.
- **వ్యాయామం :** శరీర సౌష్టవాన్ని కాపాడుకోవడానికి, అనేక వ్యాధులు రాకుండా చూసుకోవడానికి రోజువారీ వ్యాయామం తప్పనిసరి. వ్యాయామం కారణంగా మెదడులో 'సంతోషకరమైన హార్మోన్లు' ఉత్పత్తి అయి, మనలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- **వ్యాపకాల నుంచి విరామం :** ఒత్తిడితో కూడిన, రోజువారీ కార్యకలాపాల నుంచి కొంత విరామం తీసుకోవాలి. అందువల్ల మెదడులోని కణాలకు ఒత్తిడి తగ్గి, వ్యాధి నిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే వీలు కలుగుతుంది.
- **ఇంటి భోజనం :** మీరు ఉద్యోగులు, లేదా విద్యార్థులై రోజులో ఎక్కువ సమయం బయటనే గడపాల్సి వస్తే ఆరోగ్యకరమైన ఆహారాన్ని మీరే తయారుచేసుకుని, మీవెంట తీసుకెళ్లండి. అందువల్ల బయటి ఆహారం తినకుండా మీ ఆరోగ్యాన్ని మీరు కాపాడుకునే వీలు కలుగుతుంది.
- **దంతాల పరిరక్షణ :** మీ నోరు శుభ్రంగా ఉండాలంటే రోజూ రెండుసార్లు బ్రష్ చేస్తే సరిపోదు. తరచూ ఫ్లాస్సింగ్ చేయడం, చక్కెరతో కూడిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం, తరచూ దంతాల శుభ్రత కోసం వైద్యుడి వద్దకు వెళ్లడం తప్పనిసరి. నోరు, దంతాలకు సంబంధించిన అనారోగ్యం గుండె సంబంధ వ్యాధులకు కారణమవుతుంది.
- **స్మార్ట్‌ఫోన్ వాడకం తగ్గించండి :** స్మార్ట్‌ఫోన్లు, ఇతర గాడ్జెట్ల సహాయం లేకుండా ప్రస్తుత కాలంలో మన రోజువారీ కార్యకలాపాలు కొనసాగించడం చాలా కష్టం. అయితే మనలో చాలామంది వాటిని అధికంగా వినియోగిస్తుం టారు. చాలా మంది వాటిని ఎక్కువగా వాడుతుంటారు. స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని తగ్గిస్తే మన ఆరోగ్యాన్ని కాపాడుకున్నట్టే.

అతడు-ఆమె

31



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఆ బొంబాయి అహమ్మదాబాదు సేట్లు - గిరాకీ రోజుల్లో ఖద్దరనే పేరుతో మిల్లుగుడ్డ తయారుచేసి అమ్మేశారు! ప్రజలూ కొనేశారు! ఇంతకీ - గిరాకీకొద్దీ సరఫరా, సరఫరా కొద్దీ గిరాకీ - ఈ సూత్రాన్ని బ్రహ్మ దేవుడేనా తప్పించగలడా? హిందూదేశం అంటే ప్రపంచం అంతటిలోనూ నగుబాట్లు అగచాట్లు అయి పోతూంటే, దాంతో వూరుకున్నాడా - అహింస అంటాడు. సత్యం అంటాడు. రాజకీయంలో ఇలా ఒకదాంతో ఒకటి ముడిపెడితే అసలికే సున్నా, బిసెంటే బాగా జవాబు చెప్పిందతనికి ఎంత థియాసఫిస్టైనా, పాశ్చాత్యరక్తమేగా?

మిల్లులో ఉన్నంత సేపూ శాంతం ఏమిటో పిచ్చి పిచ్చిగా మాట్లాడింది.ఆ హడావిడికి ఖంగారెత్తింది అనుకుంటాను.

(నిన్నటి సంచిక తరువాయి)

మిల్లు యజమానులు ఎంతో తెలివితేటలతో దేశ సేవ చెయ్యటానికని, చెప్పి, డబ్బు ఖర్చుపెట్టి మిల్లులు పెట్టడ మేమిటి - వాళ్ళు ఉత్త దోపిడీదార్లు, అమాయకపు ప్రజల్ని పీడించి రక్తమాంసాలని పీల్చి పిప్పిచేస్తున్నారని వాళ్ళని నానాతిట్లు తిట్టడం ఏమిటి? ఈ ధోరణేమిటి శాంతం అంటే - "ఆడంస్మిత్తు, మార్షలు, బ్రెంటానో, స్టూవర్ట్‌మిల్లు అందరూ దొంగలూ, అబద్ధీకులూ, నాకిప్పుడు బోధపడిం దంది." ఇంకేమిటి చెప్పడం! 'వెర్రి కుదిరింది రోకలి తలకి చుట్టరా' అన్నాడట అలావుంది. వాళ్ళింత లాభం చేసు కుం టున్నారు, ప్రజలకింత జీవనోపాధి కల్పిస్తున్నారన్న కృతజ్ఞత పోయింది - మీదు మిక్కిలి లాభాలుకూడా పావలా కూలి దానికి పంచి పెట్టమంటే ఇంకేం చెప్పడం! ఇలాగే వాదిం చింది శాంతం అక్కడున్నంత సేపూను. ఎంత అర్థశాస్త్రపు ఆచార్యత్వం చేసినా, చవకబారు సోషలిస్టు పుస్తకాలు ఇంగ్లండునుంచి దిగుమతి అవుతున్నాయి అవి చదువుతే ఉన్నమతి కూడా పోతుంది. నేనింగ్లండు వెళ్ళొచ్చాను. అక్కడి సంగతులు పరిస్థితులు నాకు తెలుసు. నాకీపిచ్చి అబ్బమంటే అబ్బదే!

సరిగ్గా మేం అక్కడున్నప్పుడే చిన్న ప్రమాదం ఒకటి జరిగింది? కాస్త రక్తం చూసేసరికి శాంతా నికి మతి భ్రమించింది. ఆమాత్రం కాలు నలగ కుండా చెయ్యి నలగకుండా భుక్తి జరగమంటే జరుగుతుందా? ప్రపంచకంలో ఉండే మహా జాతుల్లో హిందూదేశం అగ్రస్థానం ఆక్రమించా లంటే, ఎంతమంది అన్నార్తులవ్వాలి, ఎంత మంది వికలాంగులవ్వాలి, ఎన్ని మృతకళేబరాలు కుళ్ళాలి? అసలు ఆడవాళ్లని ఎవడు పని చెయ్య మన్నాడు? చీరకొంగు చక్రంలో తగులుకొని ఆ చెయ్యిని లాగే సుంటుంది. నాలుగు డబ్బులు సంపాదించే టప్పటికి ఎక్కడలేని నిస్సాకారం నిర్లక్ష్యం, అశ్రద్ధ, పద్ధతులు ధిక్కరించడం - కాకపోతే ప్రమాదం జరగదు. ఇలాంటి ప్రమాదాలు జరగడం, మిల్లు ఆగి పోవడం, ఉత్పత్తి తగ్గిపోవడం, దేశానికే అరిష్టం.... ఈమధ్య శాంతం గాంధీపుస్తకాలు కొన్ని, రష్యా పుస్తకాలు కొన్ని తెప్పించింది. రష్యా పిచ్చి పట్టుకున్నా ప్రమాదమే. గాంధీపిచ్చి పట్టుకున్నా ప్రమాదమే. అయితేనేం, రష్యా తత్వానికి విరుగుడు గాంధీతత్వం - గాంధీతత్వానికి విరుగుడు రష్యాతత్వం ఆ పాముతోక ఈ పాము, ఈ పాముతోక ఆ పాము మింగుతే మనకేం ఫర్వా వుండకూడదు!

రాత్రి సినీమాకెళ్ళేం. శాంతం అద్భుతంగా వుండెను. నిజంగా శాంతం గొప్ప స్పోర్టు!

39 ఆమె

నేను అనుకున్నట్టే అయిందది. శాస్త్రి బుద్ధిమంతుడు. ప్రేమాస్పదుడు తెలివైనవాడు. మంచివాడు కాని ఇటువంటి మంచితనమే కొంపతీస్తుంది. ఈ మంచితనం చేతగాని తనం క్రిందకి దిగుతుంది. ప్రపంచంలో ఎంత అధర్మం అన్యాయం జరుగుతున్నా - ఉన్నదున్నట్టేకాని కదపకూడ దనే వ్యక్తులు - 'మన కెందుకులే!' - అని అమలులో ఉన్న పద్ధతుల్నే సమర్థిస్తారు. తన ముక్కు దాటి చూడమంటే, శాస్త్రి కళ్ళు మూసుకుంటాడు. భవిష్యత్తుంటే, భయం, పురోగమనం అంటే పిరికితనం. ఇలాంటి వాళ్ళుంటే అభివృద్ధి సున్న... రాత్రి సినిమా అంతా అసలే అమెరికన్ దొమ్ములాట - గుద్దులాట - కొట్టు కోనూ - పొడుచుకోనూ - పేల్చుకోనూ - రైల్లో నుంచి నదిలోకి ఉరకడం - నదిలోంచి వంతెనమీదకి - వంతెన మీదనుంచి రైలు మీదకి దుమకడం - ఇది కథ! శాస్త్రి అదే శ్రద్ధగా చూడడం - ఆతృతతో కుర్చీలోనుంచి లేచిపోతూం డడం - ఊపిరి బిగపెట్టుక్కూచోడం - చప్పట్లు కొట్టడం - చివరికి ఈల వెయ్యడం ఒక్కటే తరువాయి!



ఐస్ కాఫీ చాలా బాగుంది. కాఫీ ఆఖరిగుక్క తాగుతూ శాస్త్రి "శాంతం!ప్రభువు దర్శనానికి వెళుదామా?" అన్నాడు.

"సరే" అని నోటి చివరవరకూ వచ్చింది. కాని యధార్థంగా ప్రవర్తించాలి అని చెప్పి, "నాకు పిలుపు రాలేదోయ్, క్షమించు" అన్నాను. శాస్త్రి వక్కడే వెళ్ళాడు.

వివేకానంద పుస్తకాలు - అభేదా నంద పుస్తకాలు - రాజయోగసారం - ప్రబుద్ధభారతం చదివేను. వేదాంతచింత అనేది నాలో రవంతేనా లేకపోబట్టే కాబోలు నాకేం బుర్రకెక్కలేదు. నేను ఇంటర్ చదువు తున్నప్పుడు 'గీతాంజలి' చదివేను. కాని నా కేం అర్థం కాలేదు. ఆనర్సు ప్యాసయ్యాక కాని రవీంద్రుడి కవిత్వం నాకు బోధపడ లేదు. అలాగే కొంత డక్కాముక్కీలు తింటేనే కాని వేదాంత గోష్ఠి మీద అభిరుచి కలగ దనుకుంటాను. మనోవేదన అనుభవం అయి ఆపిలుపు వినబడేదాకా నేను దూరంగా వుండడమే సబబు. ఆ అనుభవం కలుగకుండానే కలిగినట్టు నట్టించడం నాచేత కాదు. భక్తులందరికీ ఆ పిలుపు అందిందా అంటే - అందే వెళుతున్నారని అనుకోవాలి.

....ఉమామహేశ్వరం మామ జ్ఞాపకం వస్తున్నాడు. ఆ రోజుల్లో కరణీకానికి రాజీనామా యిచ్చేసి అత్తయ్యనీ నన్నూ అహమ్మదాబాదు కాంగ్రెసుకు తీసుకెళ్ళాడు. సబర్మతీ ఆశ్రమంలో రెండు పూటలున్నాం. ఇంటికి రాగానే మామ తోటలో ఆశ్రమం పెట్టాడు. "మామ సుఖం మరిగినవాడు - చండశాసనుడు - కోపిష్టి. ఇతను ఆశ్రమం పెట్టడమే మిటి? అని అనుకునేవాళ్ళం. అత్తయ్యది సత్యకాలం. నన్ను పిలిచి: "ఇదేమిటమ్మా! మీ మామయ్య మల్లెపువ్వులాంటి మల్లె[illegible]ధోవతి, [illegible]వప్పు[illegible]ంటి చంగ[illegible] పంచ [illegible]నేసి [illegible]రంగు [illegible] - బోడిగ[illegible] [illegible]మెడలో అలారం గడియారమున్నా? నాకా భగవద్గీత శ్లోకాలేవో చెబుదూ - కంఠతాపడతాను. లేకపోతే వారు మండి పోతారు" అనేది. భోజన ప్రియుడు - అతనికాచేబియ్యం - గుగ్గిళ్ళు - చప్పిడి - యేం పడతాయి? దేహంలోను, హృదయంలోను దహించుకుపోయేది ఆయనకి. మనిషి పూచిక పుల్లలాగై పోయాడు. అత్తయ్యకీ సన్యాసాశ్రమం బోధపడక మామయ్యకి తనమీద ఏం ఆగ్రహం వచ్చిందో అని బెంగపెట్టుకుని ముక్కోటి దేవతలకీ మొక్కేసుకుంది. ఆశ్రమ వాసులందరూ వీళ్ళలాంటి గృహస్థులే. మూడు నాళ్ళ ముచ్చటయాక - ఆశ్రమంలోనున్న 'ఆత్మపరీక్ష' పుస్తకం అంతా చాడీలు కొండేలు చిలిపి కయ్యాలతో నిండి పోయి - రోజుకో సంపుటి తయారు! చివరికి సమిష్టి కుటుంబం అంతా గడపకో కంసాలి పొయ్యి కిందకి దిగింది. మామ ఏభై ఎకరాల పొలం ఐదు ఎకరాలకి దిగజారింది. ఆశ్రమం మూసేసే అగత్యం లేకుండానే యెవరి మటుకు వాళ్ళే లేచి వెళ్ళిపోయారు. మొన్న ఉమామహేశ్వరం మామ, పుల్లమ్మత్త తిరుపతి యాత్ర చేసుకుని చెన్నపట్నం వచ్చారు. మామ మళ్ళీ కరణీకం సంపాదించుకుని ఏభై యకరాలూ నిలబెట్టుకున్నాడు. మనిషికి వొళ్ళొచ్చింది. అత్తయ్య వంటినిండా జవాహరీయే! అడ్డాల్లో నెలపిల్ల, చంకని యెడపిల్ల - చెతిని చంటిపిల్ల - యీ కొంగు పట్టుకొని పెద్దాడు, ఆ కొంగుపట్టుకొని చిన్నాడు! నా చెవిలో చెప్పింది: "శాంతమ్మా! ఆశ్రమం మానేశాక మీ మామయ్యకి యెంత శాంతం, వోపిక వచ్చిం దనుకున్నావు!" "ఆహమ్మదాబాదు ప్రయాణం జ్ఞాపకం వుందా మామయ్యా?" అని అడిగా. "లేకేమి, అప్పుడేగా పులిని చూచి నక్క వాతెట్టుకున్నదీగా" అన్నాడు నవ్వుతూ ..... మొన్న శాస్త్రి: "ఆస్తి పంపకం అప్పిలొకటి కోమట్లది మీ మామ పంపించాడు, మంచి తెలివైన బుర్ర సుమా!" అన్నాడు. .....సాయంకాలం వచ్చాడు శాస్త్రి. అతని ముఖం ఒక కొత్తకళతో ప్రకాశిస్తూంది.


40 అతడు

మనస్సు నిర్మలంగా - ప్రశాంతంగా - ఆనందంగా వుంది, దేశ దేశాంతరాలనుంచి భక్తులు భుక్తులభగవన్నా మస్మరణ, పండితుల భాగవత పారాయణ, చీని చీనాం బరాల తళుకు, గులాబీపువ్వుల పరిమళం, మంగళ హారతుల జ్యోతి, దేదీప్యమానమైన కాంతి, దివ్యతేజస్సు, నిశ్చలమైన శాంతి.

- ఇంకా వుంది.

భారత్‌లో అధికార హోదాల ప్రాధాన్యతా క్రమం





1. రాష్ట్రపతి (మొదటి రాష్ట్రపతి - బాబూ రాజేంద్రప్రసాద్, ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్)
2. ఉపరాష్ట్రపతి (మొదటి ఉపరాష్ట్రపతి - డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ప్రస్తుత ఉపరాష్ట్రపతి- ఎం.వెంకయ్య నాయుడు)
3. ప్రధానమంత్రి (మొదటి ప్రధానమంత్రి - జవహర్‌లాల్ నెహ్రూ, ప్రస్తుత ప్రధాని - నరేంద్రమోడీ)
4. తమ అధికార పరిధిలో ఉన్న రాష్ట్రాల గవర్నర్లు
5. ఎ. మాజీ రాష్ట్రపతులు (ఉదాహరణ : ప్రణబ్ ముఖర్జీ, ప్రతిభా పాటిల్, అబ్దుల్ కలాం)
6. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (మొదటి భారత ప్రధాన న్యాయమూర్తి - హీరాలాల్ జె.కానియా, ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి - దీపక్ మిశ్రా); లోక్‌సభ స్పీకర్ (మొదటి లోక్‌సభ స్పీకర్ - జి.వి.మౌలంకర్)
7. కేబినెట్ మంత్రులు; తమ అధికార పరిధిలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ; ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు (మొదటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు- గుల్జారీలాల్ నందా, ప్రస్తుత ప్రణాళికా సంఘాన్ని నీతి ఆయోగ్‌గా మార్చడం జరిగింది. వీరితోపాటు మాజీ ప్రధాన మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులు.
7 ఎ. భారతరత్న అవార్డు గ్రహీతలు (మొదటి భారతరత్న గ్రహీతలు 1954- సి.రాజగోపాలాచారి, ఎస్.రాధాకృష్ణన్, సి.వి.రామన్‌లు, చివరి గ్రహీత (2008) పండిట్ భీమ్‌సేన్ జ్యోతి.
8. వివిధ దేశాలలోని రాయబారులు; కామన్వెల్త్ దేశాల హైకమిషనర్లు; బయటి రాష్ట్రాలలో ఉండే ముఖ్యమంత్రులు, బయటి రాష్ట్రాల గవర్నర్లు.
9. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు
9 ఎ. ప్రధాన ఎన్నికల కమిషనర్ (మొదటి ప్రధాన ఎన్నికల కమిషనర్ - సుకుమార్ సేన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ) (మొదటి కాగ్ వి.నరహరిరావు, యూనియన్ పబ్లిక్ కమిషన్ చైర్మన్ (మొదటి చైర్మన్ (హెచ్.కె.కృపలానీ).
10. రాజ్యసభ ఉపాధ్యక్షుడు (రాజ్యసభ మొదటి ఉపాధ్యక్షుడు ఎస్.వి.కృష్ణమూర్తిరావు, రాష్ట్రాల ఉపముఖ్యమంత్రులు ; లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ (లోక్‌సభ మొదటి డిప్యూటీ స్పీకర్- అనంశయనం అయ్యంగార్, ప్రణాళికా సంఘం సభ్యులు; కేంద్ర సహాయ మంత్రులు; (రక్షణశాఖకు సంబంధించిన ఇతర మంత్రులు)
11. భారత అటార్నీ జనరల్ (మొదటి అటార్నీ జనరల్ ఎం.సి.సెత్వలాడ్, క్యాబినెట్ కార్యదర్శి (మొదటి క్యాబినెట్ కార్యదర్శి ఎన్.ఆర్.పిళ్లై, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు.
12. జనరల్ లేదా తత్సమాన హోదా కలిగిన సైనికాధిపతులు
13. ఇతర దేశాలకు చెందిన దౌత్యవేత్తలు. విదేశాలకు చెందిన మంత్రులు.
14. రాష్ట్రాల చట్టసభల స్పీకర్లు, చైర్మన్లు, ఆయా రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (ఆంధ్రప్రదేశ్ మొదటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు)
15. రాష్ట్రాల కేబినెట్‌లలోని మంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాలు ముఖ్యమంత్రులు, కేంద్ర ఉపమంత్రులు.
16. లెఫ్టినెంట్ జనరల్ లేదా తత్సమాన హోదా కలిగిన అధికారులు.
17. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్, మైనారిటీ కమిషన్ చైర్మన్, (మొదటి మైనారిటీ కమిషన్ చైర్మన్ జస్టిస్ మహ్మద్ సర్దార్ అలీఖాన్, ఎస్.సి. కమిషన్ చైర్మన్ (ఎస్.సి. కమిషన్ మొదటి చైర్మన్ ఎస్.హెచ్. రామ్‌ధాన్, (ఎస్.టి. కమిషన్ మొదటి చైర్మన్ కున్వర్‌సింగ్, తమ అధికార పరిధుల అవతల ఉన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, తమ అధికార పరిధిలోనే ఉన్న హైకోర్టు జూనియర్ న్యాయమూర్తులు.
18. తమ రాష్ట్రాల అధికార పరిధి అవల ఉన్న రాష్ట్ర కేబినెట్ మంత్రులు, తమ రాష్ట్రాల అధికార పరిధి అవల ఉన్న రాష్ట్రాల చట్టసభల స్పీకర్లు, చైర్మన్లు, ఎంఆర్‌టీపీ కమిషన్ చైర్మన్, రాష్ట్రాల చట్టసభల డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ చైర్మన్లు, తమ అధికార పరిధిలోనే ఉన్న రాష్ట్రాల మంత్రులు, తమ అధికార పరిధిలోనే ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులు, శాసనసభ స్పీకర్లు, ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ చైర్మన్.
19. తమ అధికార పరిధిలోనే ఉన్న కేంద్రపాలిత ప్రాంతపు చీఫ్ కమిషనర్లు ; (మంత్రిమండలి లేనిచోట) తమ అధికార పరిధిలోనే ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులు, తమ అధికార పరిధిలోనే ఉన్న రాష్ట్రాల సహాయ మంత్రులు, తమ అధికార పరిధిలోనే ఉన్న కేంద్రపాలిత ప్రాంతపు శాసనసభల డిప్యూటీ స్పీకర్లు.
20. తమ రాష్ట్రాల అధికార పరిధి అవల ఉన్న రాష్ట్రాల చట్టసభల డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ చైర్మన్లు, తమ రాష్ట్రాల అధికార పరిధి అవల ఉన్న రాష్ట్రాల మంత్రులు, తమ న్యాయపరిధి అవల ఉన్న హైకోర్టు న్యాయమూర్తులు.
21. పార్లమెంట్ సభ్యులు.
22. తమ రాష్ట్రాల అధికార పరిధి అవల ఉన్న రాష్ట్రాల ఉపమంత్రులు.
23. ఆర్మీ కమాండర్స్/ వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లేదా తత్సమానమైనవారు. తమ అధికార పరిధిలోగల రాష్ట్రప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, ఎస్.సి., ఎస్.టి. కమిషనర్, అల్పసంఖ్యాక భాషావర్గం కమిషనర్; మైనారిటీ కమిషన్ సభ్యులు, ఎస్.సి., ఎస్.టి. కమిషన్ సభ్యులు; ఎక్స్ అఫిషియో చైర్మన్లు, మైనారిటీ కమిషన్ కార్యదర్శి, రాజ్యసభ/లోక్‌సభ కార్యదర్శి, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఉపాధ్యక్షుడు.
24. లెఫ్టినెంట్- జనరల్ లేదా వైస్ - అడ్మిరల్ సమానమైన హోదా.
25. భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శులు, అదనపు సొలిసిటర్ జనరల్, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధి అవల ఉన్న ముఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి, డిప్యూటీ కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్, కేంద్రపాలిత ప్రాంతాల లెజిస్లేటివ్ డిప్యూటీ స్పీకర్లు, సీబీఐ డైరెక్టర్, బీఎస్‌ఎఫ్ జనరల్ డైరెక్టర్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ సభ్యులు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు.
26. భారత ప్రభుత్వ ఉమ్మడి కార్యదర్శులు; తత్సమాన హోదా కలిగిన అధికారులు; హోదాల వారీగా మేజర్- జనరల్.

విశాలాంధ్ర ప్రజ్ఞ

ఎన్నికల కమిషన్‌పై సమాచారం

భారత దేశంలో ఎన్నికలకు సంబంధించిన అంశాలను రాజ్యాంగంలోని ౧౫ వ విభాగంలో నిబంధన 324 నుండి 329 (బి) లలో పొందుపరిచారు.

324వ నిబంధన: భారతదేశంలో ఎన్నికలు నిర్వహించ డానికి, పర్యవేక్షించడానికి, ఓటర్ల జాబితాను రూపొందించ డానికి, పార్లమెంటు, శాసనసభల ఎన్నికలు నిర్వహించ డానికి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత.

324(1) : రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర విధానసభ, విధానపరిషత్తులకు సంబంధించిన ఎన్ని కలు నిర్వహించడం, పర్యవేక్షించడం, ఎన్నికలకు సంబం ధించిన ఆదేశాలు జారీచేసే అధికారాలను ఎన్నికల సంఘానికి ఇవ్వడం జరిగింది.

324(2) : ఎన్నికల సంఘంలో ఒక ప్రధాన ఎన్నికల కమి షనర్‌తోపాటు ఇతర సభ్యులు కూడా ఉంటారు. అయితే ఇతర సభ్యుల సంఖ్యను కాలానుగుణంగా అవసరాన్ని బట్టి నియమించే అధికారం రాష్ట్రపతికి ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్‌లను రాష్ట్రపతి నియమిస్తారు.

324(3): ఇతర కమిషనర్లు నియమించబడిన సందర్భంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవ హరిస్తారు.


324(4) : అవసరమైనప్పుడు ఎలక్షన్ కమిషన్ సలహాపై ప్రాంతీయకమిషనర్లను కూడా రాష్ట్రపతి నియమించవచ్చు.

324(5): ఎలక్షన్ కమిషన్ సభ్యులు, ప్రాంతీయ కమిషనర్ల అధికార, పదవీ కాలాన్ని రాష్ట్రపతి నిర్ణయిస్తారు.

325వ నిబంధన : సాధారణ ఎన్నికలకు సంబంధించి జాతి, మత, కుల, లింగ వివక్ష ఆధారంగా ఎవరినీ ఎన్నికల జాబితా నుంచి తొలగించరాదు.

326వ నిబంధన : లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఓటు హక్కును వయస్సు ఆధారంగా నిర్ణయించడం జరుగు తుంది. ప్రతి వ్యక్తి 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయ స్సు ఉన్నవారు ఓటుహక్కును కలిగి ఉంటారు.

327వ నిబంధన : రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర శాసనసభల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై పార్లమెంట్ చట్టం చేయడానికి అవకాశం కలిగి ఉంది.



328వ నిబంధన : పార్లమెంట్ చట్టం లేనపుడు రాష్ట్ర ఎన్ని కలకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర శాసనసభ చేస్తుంది.

329వ నిబంధన : నియోజకవర్గాల పునర్విభజనకు గానీ, రాష్ట్రాల శాసనసభల సీట్లకు సంబంధించి 327, 328 అధికరణలను కోర్టులో ప్రశ్నించడానికి వీలులేదు.

329 (ఎ) నిబంధన : పార్లమెంటు, ప్రధానమంత్రులు, స్పీకర్ ఎన్నికలకు సంబంధించిన అంశాలను 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించడం జరిగింది.

329 (బి) నిబంధన : రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించే అధికారం హైకోర్టుకు ఉంది. ఈ విషయంలో ప్రధానమంత్రికిగానీ, స్పీకర్‌కు గానీ అధికారం లేదు.

329 (బి) నిబంధన : భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికలలో ఎటువంటి వివాదం తలెత్తినా వాటిని ప్రత్యేక ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించుకోవచ్చు.

రాజ్యాంగ సవరణలు

1. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 2001 సంవత్సరం వరకు పార్లమెంట్ వివిధ విధానసభ సభ్యుల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగానే నిర్ణయించాలని పొందుపరిచారు.
2. 1989లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటరు వయస్సును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు.
3. 2003లో 87వ రాజ్యాంగ సవరణ ప్రకారం నియోజ కవర్గాల పునర్విభజన 1991 జనాభా లెక్కలకు బదులు 2001 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ పునర్విభజన 2021 వరకు పరిగణలోకి ఉంటాయి.

వివిధ చట్టాలు :

i. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950- ఈ చట్టం ద్వారా ఓటర్ల అర్హత, ఓటర్ల జాబితా తయారీ, నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల కేటాయింపు మొదలగునవి.

ii. ప్రజాప్రాతినిధ్య (ఓటర్ల జాబితా తయారీ) నియమాల చట్టం, 1950

iii. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951- ఈ చట్టం ద్వారా ఎన్నికల నిర్వహణ సిబ్బంది ఎంపిక, ఎన్నికల వివాదాలు, రాజకీయ పార్టీలకు గుర్తింపు మొదలైన అంశాలకు సంబంధించిన నియమాలను రూపొందించారు.

iv. ప్రజాప్రాతినిధ్య (ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ఫిర్యాదు) నియమాల చట్టం, 1951.

v. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల చట్టం, 1952.

౫౧. కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల నియమావళి చట్టం, 1963.

vii. ప్రజాప్రాతినిధ్య (ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ఫిర్యాదు) నియమాల సవరణ చట్టం, 1988- దీని ప్రకారం బూత్‌ల ఆక్రమణ, పెద్దఎత్తున రిగ్గింగ్ వంటి సంఘటనలు జరిగినప్పుడు ఆ నియోజకవర్గంలో ఎన్నికను వాయిదా వేసేందుకుగానీ, లేదా రద్దు చేసేందుకుగానీ ఎన్నికల కమిషన్‌కు అధికారాన్ని కల్పించింది.

viii. ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంత చట్టం 1991

౫౫. ప్రజాప్రాతినిధ్య (సవరణ) చట్టం, 2003 ప్రకారం రాజ్యసభ సభ్యుల ఎన్నికలో బహిరంగ ఎన్నికల విధానం (ఓపెన్ బ్యాలెట్ ఓటింగ్ సిస్టమ్)ను ప్రవేశపెట్టారు.

x. ఎన్నికల (సవరణ) చట్టం, 2003 ప్రకారం ఏ పార్టీపై రూ.20,000 కంటే అధికంగా విరాళాలు అందిస్తే ఆ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియపరచాలి.

ఎన్నికల కమిషన్ అధికారాలు :

1. ఎన్నికల తేదీలను, నియమావళి, పోలింగ్ బూత్‌లను ఫలితాలను ప్రకటించడం.
2. టి.ఎన్.శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నపుడు ప్రవేశపెట్టిన కొన్ని నియమాలు.. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల తేదీలను ప్రకటించిన నాటినుంచి ఎన్నికల నియమావళి (ఎలక్షన్ కోడ్) అమలులోకి వస్తుంది. ఆ రోజు నుండి ఎన్నికల ఫలితాలు వెలువడేవరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ అధికార బృందం మొత్తాన్ని తన ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుంది. చీఫ్ సెక్రటరీల నుంచి వీఆర్వో వరకు ఎవరిపైనైనా చర్య తీసుకునే అధికారం కలిగి ఉంది.
3. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నంతకాలం నియమాలను అధికార పార్టీగానీ, ప్రతిపక్ష పార్టీలుగానీ ఉల్లంఘిస్తే వాటిపై చర్య తీసుకునే అధికారం తనకు ఉంది.
4. రాజకీయ పార్టీలకు ఆయా నియమాల ప్రకారం జాతీయ, ప్రాంతీయ పార్టీలుగా గుర్తింపునివ్వడమే కాకుండా వాటికి చిహ్నాలు కేటాయించడం కూడా ఎలక్షన్ కమిషన్ బాధ్యత.
5. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నేరచరిత్రను కలిగి ఉంటే ఆ కేసుల పూర్వాపరాలను పరిశీలించి వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించే అధికారం తనకుంది.

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం

హైదరాబాద్‌లోని 'ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం' వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు.. ▸ పి.జి. డిప్లొమా ఇన్ జర్నలిజం. ▸ డిప్లొమా ఇన్ జర్నలిజం. ▸ డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం. ▸ సర్టిఫికేట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. సర్టిఫికేట్ కోర్స్ ఆఫ్ జర్నలిజంనకు పదో తరగతి ఉత్తీర్ణత.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది: జనవరి 12, 2018

పూర్తి వివరాలకు ఫోన్ నెం: 9848512767, 7286013388లలో సంప్రదించవచ్చు.

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎఫ్ఈటీ-2018

న్యూఢిల్లీలోని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బీఈ).. ఫెలోషిప్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎఫ్ఈటీ)-2018కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. దీని ద్వారా రెండేళ్ల పోస్ట్ డాక్టోరియల్ ఎఫ్ఎన్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు పొందొచ్చు.

స్పెషలైజేషన్లు: క్రిటికల్ కేర్ మెడిసిన్, రీప్రొడక్టివ్ మెడిసిన్, మినిమల్ యాక్సెస్ సర్జరీ, విట్రో-రెటినల్ సర్జరీ, ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీ, పీడియాట్రిక్స్ నెఫ్రాలజీ, స్పిన్ సర్జరీ, హ్యాండ్ అండ్ మైక్రో సర్జరీ, ట్రామా కేర్, పీడియాట్రిక్ హెమటో ఆంకాలజీ, లేబొరేటరీ మెడిసిన్, ఇన్‌ఫెక్షన్ డిసీజెస్, హై రిస్క్ ప్రెగ్నెన్సీ అండ్ పెరినటాలజీ, స్పోర్ట్స్ మెడిసిన్, పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ.

అర్హతలు : ఎంబీబీఎస్‌తోపాటు సంబంధిత స్పెషలైజేషన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/ప్రొవిజినల్ పాస్ సర్టిఫికెట్ (ఎండీ/ఎంఎస్/డీఎం/డీఎన్‌బీ)ని 2017, డిసెంబర్ 31 లోగా అందుకోబోయే వారు అర్హులు.

దరఖాస్తు రుసుం: రూ.4,500. **దరఖాస్తు విధానం :** ఆఫ్‌లైన్.

దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ : జనవరి 11, 2018.

వెబ్‌సైట్: www.natboard.edu.in

అంబేడ్కర్ యూనివర్సిటీ ఢిల్లీలో ఎంబీఏ కోర్సు

అంబేడ్కర్ యూనివర్సిటీ ఢిల్లీ (ఏయూడీ)కి చెందిన స్కూల్ ఆఫ్ బిజినెస్, పబ్లిక్ పాలసీ అండ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎస్‌బీపీపీఎస్ఈ).. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు : ఎంబీఏ ప్రోగామ్ **వ్యవధి :** రెండేళ్లు **సీట్లు :** 42.

అర్హతలు : కనీసం 50 శాతం మార్కులు/ తత్సమాన గ్రేడ్ (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు 45 శాతం మార్కులు/ తత్సమాన గ్రేడ్)తో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. చివరి సంవత్సరం విద్యార్థులూ అర్హులే.

ఎంపిక : రాతపరీక్ష, ఇంటర్వ్యూ

దరఖాస్తు రుసుం : రూ.1,050; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.525.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్లకు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి నిర్దేశిత చిరునామాకు గడువులోగా పంపాలి.

ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ : ఫిబ్రవరి 10, 2018.

వెబ్‌సైట్: www.aud.ac.in

నల్సార్ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీఎంఎస్) విభాగం..
ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు : ఎంబీఏ ప్రోగ్రామ్.

స్పెషలైజేషన్లు : కోర్ట్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ గవర్నెన్స్, ఇన్నోవేషన్ అండ్ సస్టైనబిలిటీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, బిజినెస్ రెగ్యులేషన్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్.

మొత్తం సీట్లు : 60.

అర్హతలు : కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీతోపాటు క్యాట్-2017/ ఎక్స్‌ఏటీ-2018/ జీమ్యాట్- (2015 తర్వాత)/జీఆర్ఈ-(2016 తర్వాత)/ సీ-మ్యాట్-2017 క్వాలిఫై స్కోర్‌కార్డ్/ నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్-ఎంఈటీ) స్కోర్ కార్డ్.

ఎన్-ఎంఈటీ పరీక్ష విధానం : పరీక్ష సిలబస్ క్యాట్ సిలబస్ తరహాలో ఉంటుంది. పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎ లో వెర్బల్ ఎబిలిటీ నుంచి 25, లాజికల్ రీజనింగ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-బిలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 25, డేటా ఇంటర్‌ప్రెటేషన్ నుంచి 25 ప్రశ్నలు వస్తాయి.

ఎంపిక: స్కోర్స్ (క్యాట్/జీమ్యాట్/ఎక్స్‌ఏటీ/ జీఆర్ఈ/సీ-మ్యాట్/ఎన్-ఎంఈటీ), అకడమిక్ రికార్డులు, ప్రొఫెషనల్ అచీవ్ మెంట్స్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం: రూ.1,100బీ ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.800.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: జనవరి 31, 2018.

వెబ్‌సైట్: www.cms.nalsar.ac.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
-244.08 ▼	-95.15 ▼	150 ▲	600 ▲		
33,812.75	10,435.55	28,250	39,400	63.68	66.87
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)		బ్రెంట్ ధర (డాలర్లలో..)

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
బీహెచ్ఇఎల్	95.00	2.59
విప్రో	317.75	1.39
కోల్ఇండియా	266.45	1.31
సన్ఫార్మా	585.00	0.49
యాక్సిస్ బ్యాంక్	569.60	0.44

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టీసీఎస్	2,654.65	-1.69
హెచ్యుఎల్	1,347.25	-1.52
ఇండస్ఇండ్ బ్యాంక్	1,626.25	-1.45
హెచ్డీఎఫ్సీ	1,712.00	-1.35
టాటా మోటార్స్	436.45	-1.35

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.87	63.68
యూరో	76.58	76.42
పౌండ్	86.32	85.90
ఆస్ట్రేలియా డాలర్	49.93	49.66
సింగపూర్ డాలర్	47.81	47.62

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,200	30,160
చెన్నై	28,100	30,053
బెంగళూరు	27,500	29,411
ముంబై	28,850	30,855
విజయవాడ	28,250	30,040



నిలకడగా బంగారం, పెరిగిన వెండి

న్యూఢిల్లీ: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం వెండి ధర రూ.120లుపెరిగి కేజీ రూ.40,100కు చేరుకుంది. బంగారం ధరలు మాత్రం నిలకడగానే 10గ్రాములు రూ.30,400 కు చేరాయి. 99.9 శాతం మరియు 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.30.400 మరియు కూ.30,250కు చేరింది. ఆభరణాల వర్తకుల నుండి డిమాండ్ లేకపోవడం కూడా బంగారానికి డిమాండ్ తగ్గినట్లయింది. అంతర్జాతీయంగా మార్కెట్లకు సెలవుదినం కావడంతో సెంటిమెంట్పై ప్రభావం చూపింది. శనివారం విలువైన లోహాల ధరలు రూ.175లు పెరిగాయి. వెండి ధర మాత్రం పెరిగింది.



కొత్త సంవత్సరంలో...

మెరిసిన రూపాయి

న్యూఢిల్లీ: డాలర్తో పోల్చి చూసుకుంటే రూపాయి మారకపు విలువ నూతన సంవత్సరంలో మొదటిరోజు ఐదు నెలల గరిష్టానికి పెరిగింది. ఈక్విటీ మార్కెట్ నష్టాల్లో నమోదైనప్పటికీ శుక్రవారం 63.87వద్ద ముగిసిన రూపాయి సోమవారం 0.35శాతం పెరిగి నూతన సంవత్సరంలో 63.66 వద్ద ట్రేడయింది. 10ఏళ్ల బాండ్ గత సెషన్లో 7,326 శాతం వద్ద ముగిసిన యీల్డ్ 7.352శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లన్నీ దాదాపు నూతన సంవత్సరం సందర్భంగా క్లోజయ్యాయి. 2017లో రూపాయి 6.35శాతం వృద్ధి నమోదు చేసింది. డాలర కూడా ఇతర అంతర్జాతీయ కరెన్సీలతో చూసుకుంటే లాభాలనే గడించింని. సెన్సెక్స్ 28శాతం పెరిగింది. విదేశీ మదుపరులు 7.73 విలియన్ దాలర్ల కొనుగోళ్లు చేశారు. 2018లో రూపాయి విలువ మరింత పెరుగుందని విశ్లేషకుల అంచనా.. దేశీయ ఈక్విటీ నుండి దేశీయ కరెన్సీకి మద్దతు లభించింది.

1600 కార్లు దగ్ధం

లివర్పూల్: బ్రిటన్లోని లివర్పూల్లో ఘోరం జరిగింది. కార్ పార్కింగ్ లాట్లో పార్క్ చేసిన సుమారు 1600 వాహనాలు దగ్ధం అయ్యాయి. ఎకో ఎరినాకు సమీపంలో ఉన్న కార్ పార్క్ బిల్డింగ్లో ఈ ప్రమాదం జరిగింది. ఎకో ఎరినా సమీపంలోనే అంతర్జాతీయ హార్స్ షోను నిర్వహిస్తున్నారు. ఆ షోకు హాజరైనవారే ఆ పార్కింగ్ లాట్లో తమ కార్లను పార్క్ చేశారు. మంటలు దట్టంగా వ్యాపించడంతో అక్కడ నుంచి వెంటనే గుర్రాలను బయటకు పంపించారు. ఆ తర్వాత హార్స్ షోలను కూడా రద్దు చేశారు. ఒక కారులో పుట్టిన మంటల వల్లే మిగతా కార్లు అన్నీ కాలిపోయినట్లు ఓ అధికారి తెలిపారు. కారు ఓనర్లు అందరూ తమ ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించాలని కూడా పోలీసులు వెల్లడించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

టికెట్ లేని ప్రయాణం

రైల్వేకు బోలేడు నష్టాలు



ఢిల్లీ: జాతీయ రవాణా వ్యవస్థ అయిన రైల్వేల్లో నిత్యం లక్షల మంది ప్రయాణిస్తుంటారు. అయితే వీరిలో కొందరు టికెట్ లేకుండానే ప్రయాణాలు చేస్తుంటారు. అలా దొరికిన వారికి రైల్వే అధికారులు జరిమానా విధిస్తారు. కొందరైతే అధికారుల కళ్లు గప్పి దర్జాగా ప్రయాణిస్తుంటారు. ఇలాంటి వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. వీరి వల్లే రైల్వేశాఖకు నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. రైల్వే కన్వెన్షన్ కమిటీ ఇటీవల దేశవ్యాప్తంగా రైల్వే జోన్లలో తనిఖీలు చేపట్టి నివేదిక తయారుచేసింది. ఈ నివేదికను రైల్వే శాఖ పార్లమెంట్కు సమర్పించింది. దీని ప్రకారం.. 2016-17 మధ్య రెండు కోట్ల మందికి పైగా టికెట్ లేకుండా రైల్లో ప్రయాణించిన వారిని అధికారులు గుర్తించారు. వారి నుంచి రూ. 935.64కోట్లు జరిమానా వసూలు చేశారు. ఇందులో సెంట్రల్ రైల్వే జోన్లో ఎక్కువగా రూ. 125.13కోట్ల రికవరీ జరిగింది. ఇక ఉత్తర రైల్వే జోన్లో రూ. 116.52 కోట్లు, పశ్చిమ రైల్వేలో రూ.84.09కోట్లు, తూర్పు-మధ్య రైల్వేలో రూ. 75.52కోట్లు, ఈశాన్య రైల్వే జోన్లో రూ. 60.80కోట్లు టికెట్ లేకుండా ప్రయాణించిన వారి నుంచి రికవరీ చేశారు. ఇక మిగతా జోన్లలో రూ.50కోట్ల కంటే తక్కువ మొత్తం రికవరీ అయ్యింది. ఉత్తర రైల్వేలో ఎక్కువగా 26.40లక్షల మంది టికెట్ లేకుండా పట్టుబడ్డారు. ఆ తర్వాత దక్షిణ మధ్య రైల్వేలో 25.86లక్షల మంది, సెంట్రల్ రైల్వేలో 24.24లక్షల మంది, పశ్చిమ రైల్వేలో 20.24లక్షల మందిని టికెట్ లేకుండా గుర్తించినట్లు నివేదికలో పేర్కొన్నారు. సాధారణంగా ఎవరైనా టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణిస్తే టికెట్ ధరతో పాటు రూ.250 కలిపి జరిమానాగా విధిస్తారు. ఫ్లాట్ఫాం టికెట్ లేకపోయినా ఆ ధరతో పాటు రూ.250 తీసుకుంటారు. అయితే ఇందులోనూ అవినీతి జరుగుతోందని పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. టికెట్ లేకుండా ప్రయాణించేవారిని గుర్తించేందుకు రైల్వేశాఖ వెంటనే అధునాతన చర్యలు చేపట్టాలని సూచించింది.

తగ్గిన విదేశీ బ్యాంకుల ఏటీఎంలు



ఢిల్లీ: మూడళ్ల కాలంలో దేశంలో విదేశీ బ్యాంకుల ఏటీఎంలు 18 శాతం తగ్గాయి. ఒక బ్యాంకు మూత పడటం, కొన్ని బ్యాంకులు ఏటీఎంలను మూసివేయడమే ఇందుకు కారణం. భారత్లో దాదాపు 45 బ్యాంకులు సేవలు అందిస్తున్నాయి. అందులో స్టాండర్డ్ చాటర్డ్, సిటీ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ అమెరికా, బార్క్లేస్, హెచ్ఎస్బీసీ, ది రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్, డ్యూస్టెక్, జేపీ మోర్గాన్ చేజ్, డీబీఎస్ బ్యాంక్, క్రెడిట్ సూస్ ఏజీ, బీఎన్పీ పారిబస్, దోహా బ్యాంక్, కతార్ బ్యాంకులు ముఖ్యమైనవి. 'భారతీయ రిజర్వు బ్యాంకు సమాచారం ప్రకారం 2014 సెప్టెంబర్ నుంచి 2017 సెప్టెంబర్లో విదేశీ బ్యాంకుల ఏటీఎంలు 18 శాతం తగ్గాయి. ఆర్బీఎస్ బ్యాంకు పూర్తిగా కార్యకాలాపాలు నిలిపివేయడం, ఫస్ట్రాండ్ బ్యాంకు, హెచ్ఎస్బీసీ, స్టాండర్డ్ చాటర్డ్ బ్యాంకులు 30 నుంచి 20 శాతం ఏటీఎంలను మూసివేయడమే కారణం' అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. సిటీ బ్యాంకు ఏటీఎంల సంఖ్య 577 నుంచి 549 (5%)కి, డీబీఎస్ బ్యాంకు 31 నుంచి 30 (3%)కి డ్యూస్టెక్ 39 నుంచి 32 (18%)కి, ఫస్ట్రాండ్ బ్యాంకు 12 నుంచి 0కు తగ్గించాయి. హెచ్ఎస్బీసీ 30 శాతం అంటే 143 శాఖలను 100కు కుదించింది.

డిసెంబరులో రాణించిన మారుతి సుజుకీ



ఢిల్లీ: దేశీయ అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకీ ఇండియా డిసెంబరు నెలలో రాణించింది. గత నెలలో సంస్థ అమ్మకాల్లో 10.3 శాతం వృద్ధి సాధించి 1,30,066 యూనిట్లను విక్రయించింది. 2016 డిసెంబరులో మారుతి అమ్మకాలు 1,17,908 యూనిట్లుగా ఉన్నాయి. కంపెనీ దేశీయ అమ్మకాల్లో 12శాతం వృద్ధి నమోదు చేసి 1,19,286 యూనిట్లను విక్రయించినట్లు మారుతి సుజుకీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆల్టో, వేగాన్ఆర్ లాంటి మినీ సెగ్మెంట్ కార్ల విక్రయాలు 2శాతం పెరిగి 31,146 యూనిట్లుగా ఉన్నాయి. ఇక కాంపాక్ట్ సెగ్మెంట్లోని స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలెనో కార్లు వినియోగదారులను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. గత నెలలో ఇలాంటి కార్లు 53,336 యూనిట్లు విక్రయమయ్యాయి. మధ్య శ్రేణి వాహనమైన మారుతి సియాజ్ అమ్మకాలు డిసెంబరులో 35.8శాతం పెరిగి 2,382 యూనిట్లు విక్రయమయ్యాయి. ఇక ఎగుమతులు మాత్రం 2016తో పోలిస్తే కాస్త తగ్గాయి. 2016 డిసెంబరులో 11,494 యూనిట్లను ఎగుమతి చేయగా.. 2017 డిసెంబరులో ఆ సంఖ్య 6.2శాతం తగ్గి 10,780 యూనిట్లుగా ఉంది.

మొదటిరోజే నిరాశలో మార్కెట్లు

న్యూఢిల్లీ: గత ఏడాది అంతంలో రికార్డుల్లో నమోదైన మార్కెట్లు నూతన సంవత్సరం తొలిరోజు సోమవారం ట్రేడింగ్లో నిరాశలో ముగిశాయి. గత నెలరోజుల్లో బిఎస్ఇ ఇండెక్స్ ఇంతగా దిగజారడం ఇదే అత్యంత పెద్దదిగా నమోదైంది. ఏడాది ప్రారంభంకావడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరి స్తున్నారు. బెంచ్ మార్కు బిఎస్ఇ సెన్సెక్స్ 244పాయింట్లతో 34వేల మార్కుకు దిగువన నమోదైంది. ముఖ్యంగా ఆటో, ఐటి, బ్యాంకింగ్ స్టాక్స్ షేర్లు బలహీనపడటంతో మార్కెట్ సెంటిమెంట్ను మరింత బలహీనపరచింది.

50 షేర్ల నిఫ్టీ 10,500 మార్కు దిగువన 95.15 పాయింట్లతో 0.90 శాతంతో 10,433.55 వద్ద ముగిసింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో, ఆటో ఇండెక్స్ 0.78శాతం, బ్యాంకింగ్ 0.75 శాతం టెక్ 0.65 శాతం ఐటి 0.55శాతం నష్టాల్లో ముగిసింది. మరో వైపు పవర్



244పాయింట్ల నష్టంలో సెన్సెక్స్

ఇండెక్స్ 0.79శాతం పెరిగింది. క్యాపిటల్ గూడ్స్ 0.4శాతం, రియాల్టీ 0.36 శాతం కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.18శాతం పెరి గింది. సోమవారం అంతర్జాతీయ మార్కెట్ మూసివేయడంతో ప్రపంచ ఈక్విటీ ఇండెక్స్ 0.12శాతం దిగజారింది. డౌజోన్స్ ఇండస్ట్రి యల్ యావరేజ్ 118.29పాయింట్లు తగ్గింది. ఎస్ అండ్పి 500 13.93 పాయింట్లు నష్టపో యింది. నాస్డాక్ కాంపోజిట్ 46.77పాయింట్లు తగ్గింది.

విజేతలకు అవార్డుల ప్రదానం



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: సమ్మర్ ఇంటర్న్షిప్ ప్రాజెక్టు పోటీ విజేతలకు ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్స్ ఆఫ్ ఇండియా (ఐఎంసిఐ) హైదరాబాద్ చాప్టర్ అవార్డులను ప్రదానం చేసింది. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల రూపకల్పనలో ఐఎంసిఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పోటీలో ప్రముఖ బిజినెస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజ్ఞాన్ జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్, సింబోసిస్ ఇన్స్టిట్యూట్ఆఫ్ మేనేజ్ మెంట్, ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్, నర్సి మోంజె ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్కు చెందిన విద్యార్థులు పాల్గొనగా అందులోనుంచి ఆరుగురు ఫైనలిస్టులను ఎంపిక చేసి తుది పోటీని నిర్వహించారు. అందులో ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. విజ్ఞాన్ జ్యోతి నుండి కె.సౌజన్య, ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పథకాన్ని పొందగా, నర్సిమొంజే సంస్థ నుండి ప్రతీష్ యాదవ్కు రజత, తబ్రిజ్ మొహతాకు కాంస్య పథకాలు లభించాయి. నేషనల్ ఇన్స్టి ట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నెన్స్ ఉపాధ్యాక్షులు సంజయ్ బాప్టే, ఐఎంసిఐ చైర్మన్ విజయ్ సారథిలు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

నేటి నుంచి బిఎస్ఎన్ఎల్ మెగా మేళా



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ ఎల్) మంగళవారం నుండి ఈ నెల 6వ తేదీ వరకు తెలంగాణ సర్కిల్లో మెగా మేళాను నిర్వహిస్తోంది. ఈ మెగా మేళాలో వినియోగదారులు ఉచిత 3జి స్మార్ట్ సిమ్లను కష్టమర్ సర్వీస్ సెంటర్/ ఫ్రాంఛైజీ/ రిటైల్ ఔట్ లెట్, రోడ్ షోలలో పొందవచ్చును. వినియోగదారులు కొత్త కనెక్షన్తో 351 ఎంబి ఉచిత డాటా పొందవచ్చును. వినియోగదారులు ల్యాండ్ లైన్, బ్రాడ్ బ్యాండ్, ఎఫ్టిటిమెఛ్ కనెక్షన్లను బిఎస్ఎన్ఎల్ సిబ్బంది నిర్వహించే మేళాలో పొందవచ్చునని, వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవల్సిందిగా తెలంగాణ టెలికాం సర్కిల్, చీఫ్ జనరల్ మేనేజర్ వి.సుందర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 1503 లేదా 18001801503ని సంప్రదించండి.

దినసరి వేతన జీవులకు కష్టకాలం



ఢిల్లీ: నోట్ల రద్దు తర్వాత దినసరి వేతన జీవులే (క్యాజువల్ వర్కర్స్) అత్యంత ప్రభావితం అయ్యారు! 2017లో తొలి మూడు నెలల్లో ఎంపిక చేసిన 8 రంగాల్లో దాదాపు 53 వేల మంది దినసరి వేతన జీవులు ఉపాధి కోల్పోయారని లేబర్ బ్యూరో తాజా అధ్యయనం పేర్కొంది. ఐతే అదే మూడు నెలల్లో ఐటీ, తయారీ వంటి రంగాల్లో ఉద్యోగ పరిస్థితులు మెరుగయ్యాయి. మొత్తం 1.85 లక్షల ఉద్యోగాల పెరుగుదల కనిపించింది. '1.97 లక్షల క్రమబద్ధీకరించిన, 26 వేల ఒప్పంద ఉద్యోగాల్లో సాను కూల మార్పు కనిపించింది. దినసరి వేతన జీవులు 53 వేల మంది తగ్గారు' అని కార్మిక మంత్రిత్వ శాఖలోని లేబర్ బ్యూరో విభాగం తాజా త్రైమాసిక సర్వే తెలిపింది. స్వయం ఉపాధి పొందిన వారు 15 వేల మంది పెరి గారు. తయారీ, నిర్మాణం, వాణిజ్యం, రవాణా, విద్య, వైద్యం, ఆతిథ్యం, ఐటీ/బీపీవో రంగాల్లో లేబర్ బ్యూరో అధ్యయనం చేపట్టింది. మొత్తం 1.85 లక్షల ఉద్యోగాల్లో పురుషులు 1.26 లక్షలు, మహిళలు 59 వేలు దక్కించుకున్నారు.

రంగాల వారీ వివరాలు

తయారీ రంగం: ఉద్యోగాలు 92,000 పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 66,000, ఒప్పంద ఉద్యోగులు 48,000 పెరగ్గా దినసరి వేతన జీవులు 22,000 మంది తగ్గారు.

వైద్య రంగం: ఉద్యోగాలు 28,000 పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 19,000, ఒప్పంద ఉద్యోగులు 16,000 పెరగ్గా దినసరి వేతన జీవులు 7,000 మంది తగ్గారు.

నిర్మాణ రంగం: ఉద్యోగాలు 2,000 పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 19,000, ఒప్పంద ఉద్యోగులు 8,000 పెరగ్గా దినసరి వేతన జీవులు 9,000 మంది తగ్గారు.

వాణిజ్య రంగం: ఉద్యోగాలు 28,000 పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 21,000, ఒప్పంద ఉద్యోగులు 10,000 పెరగ్గా దినసరి వేతన జీవులు 3,000 మంది తగ్గారు.

రవాణా రంగం: ఉద్యోగాలు 3,000 పెరిగాయి. క్రమ బద్ధ ఉద్యోగులు 9,000, ఒప్పంద ఉద్యోగులు 1,000 పెరగ్గా దినసరి వేతన జీవులు 5,000 మంది తగ్గారు.

ఐటీ/బీపీవో రంగం: ఉద్యోగాలు 13,000 పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 12,000, ఒప్పంద ఉద్యోగులు 1,000 పెరగ్గా దినసరి వేతన జీవుల్లో మార్పులేదు.

విద్యా రంగం: ఉద్యోగాలు 1,000 పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 46,000 పెరగ్గా , ఒప్పంద ఉద్యోగులు 37,000, దినసరి వేతన జీవులు 8,000 మంది తగ్గారు.

విజ్ఞానం




భూకంపాలు పెరగనున్నాయి

హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు

ఈ ఏడాది భూకంపాలు సంభవించే అవకాశాలు మరింత పెరుగ వచ్చునని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. తాజా అధ్యయనం ప్రకారం గ్రహాల గమన వేగంలో కొద్దిపాటి తేడాలుండటంతో ఈ వైపరీత్యాలకు కారణమని తెలుస్తోంది. గత శతాబ్ద కాలంగా భూకంపాలు 25 నుండి 30శాతం పెరిగాయి భూకంప తీవ్రత రిచ్టర్ స్కేలు మీద 7.0 అంతకన్నా ఎక్కువైతే ప్రాణ, ఆస్తినష్టంతో పాటు ప్రకృతి సంపద విపరీతంగా నష్టం వాటిల్లుతుంది. భూమిలో కంపనాలు ఎక్కువైనకొలదీ భూ భ్రమణ వేగం పెరుగుతుంది. ఈ కారణంగా రోజు పొడవులో కూడా పలు మార్పులు సంతరించుకుంటాయని కొలరాడో యూనివర్సిటీ వెల్లడించింది. భూ భ్రమణ వేగం తక్కువైతే ఈక్వటోరియల్ డయామీటర్ తగ్గుతుంది. వీరి అధ్యయన ప్రకారం సుమారు ఐదేళ్లకు ప్లానెట్ల భ్రమణవేగం తగ్గుతోంది. భూకంపాలు జరిగేది ఈ పరిణామం వద్దనే అని వీరు గుర్తించారు. శక్తివంతమైన భూకంపాల సంఖ్య సరాసరిన ఏడాదికి 15గా గుర్తించారు. ఈ ఏడాది వీటి సంఖ్య 20కి పెరగవచ్చునని అంచనా..

డయాబెటిస్ వ్యాధి గ్రస్థులకు

ఇన్సులిన్కు బదులు ప్యాచ్



ఇకపై డయాబెటిస్ రోగులు ఇంజెక్షన్లకు గుడ్బై చెప్పవచ్చు. శరీరానికి అతుక్కునే ప్రత్యేకమైన ప్యాచ్ వేయడం ద్వారా శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. దీని వలన ఏమీ నొప్పికూడా ఉండదు. వారానికోసారి ఈ ప్యాచ్ను శరీరానికి అతికించడం ద్వారా శరీరానికి కావలసిన ఇన్సులిన్ను ఉత్పత్తిచేస్తుంది. ఈ ప్యాచ్ బ్రౌన్ ఆల్గే నుండి వయా మైక్రోనీడిల్స్ ద్వారా సహజసిద్ధంగా తీయబడుతుంది. జీవన విధానంలో మార్పులు తేవడం ద్వారా 40శాతం కేన్సర్ మరణాలను నివారించవచ్చు. ప్రపంచం మొత్తం మీద సుమారు 371 మిలియన్ల మంది డయాబెటిస్తో బాధపడుతున్నారు.



జిఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ను తీసుకురావాలి : ఏఐటీయుసీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రోజుకో ధర పెట్టి అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజలలో భాగమైన ఆటో డ్రైవర్ల నడ్డివిరుస్తున్నారని, వెంటనే పెట్రోల్, డీజిల్ లను జీఎస్టీ పరిధిలోకి తేవాలని కేంద్ర ప్రభుత్వ పై రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి చేయాలనీ తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్, ట్రాలీ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) హైదరాబాద్ నగర శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఏ.బిక్షపతి యాదవ్, ఆర్.మల్లేష్ డిమాండ్ చేసారు. సోమవారం నగరంలోని షేక్పెట్ నాలా వద్ద పెట్రోల్, డీజిల్లను జీఎస్టీ పరిధిలోకి తీసుకరావాలని డిమాండ్ చేస్తూ లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏ.బిక్షపతి యాదవ్, ఆర్.మల్లేష్లు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గినా మన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా వివిధ రకాల పన్నులు 57 శాతం వేసి ఇటు ప్రజలను అటు రవాణా రంగం పై ఆధార పడి బతుకుతున్న డ్రైవర్ల కడుపు కొడుతున్నారని వారు ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ లను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే ఒకే రకమైన పన్నుతో వాటి ధరలు సగానికి సగం తగ్గి సామాన్య ప్రజలకు రవాణారంగంలో ఉన్న డ్రైవర్లకు లాభం చేకూరుతుందని, అలాగే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంటుందని వారు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేసారు.

తిరుగులేని బాహుబలి-2

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: భారత చలనచిత్రాల్లో 2017లో అత్యధికులు వీక్షించిన చిత్రంగా బాహుబలి-2 నిలిచిందని బుక్ మై షో విల్లడించింది. బాహుబలి తొలి టికెట్ ఒడిశాలోని ఓ చిన్న నగరమైన బంకికి చెందిన వ్యక్తి నెల రోజుల ముందుగానే కొనుగోలు చేశారని బుక్ మై షో డైరెక్టర్ పరీక్షిత్ ధార్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ చిత్రానికి సంబదించిన 1.6 కోట్ల టికెట్లను తాము విక్రయించామని, అవిశ్రాంతంగా 175 రోజుల పాటు చిత్రం ప్రదర్శితమైందన్నారు. సినిమాలు చూడటంలో ముంబై, బెంగళూరు నగరాలలో పోలిస్తే హైదెరాబాదీలు ముందున్నారన్నారు. ఇక టాప్ 10 మూవీస్లో బాహుబలి 2 తరువాత గోల్మాల్, జాలీ ఎల్ఎల్బి-2 నిలిచాయన్నారు.

హోవర్ అఫ్ కోడ్ వేడుక చేసుకున్న మైక్రోసాఫ్ట్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: యువత కంప్యూటర్ సైన్స్ తీసుకోని భవిష్యత్తుకు సిద్ధం అయ్యేలా ప్రోత్సహిచటంపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టినట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రకటించింది. ఇందుకు నాన్ గెజిటెడ్ సంస్థలు, లాభాపేక్షలేని కంపెనీల భాగస్వామ్యంతో డిసెంబర్ 15 నుంచి హోవర్ అఫ్ కోడ్ కార్యక్రమాలు నిర్వహించామని, దీనిలో 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 10 వేలకు పైగా యువత పాల్గొన్నారని సంస్థ ఆసియా విభాగం అసిస్టెంట్ జనరల్ కౌన్సిల్ కేశవ్ ఎస్ తెలిపారు. ప్రతి ఒక్కరు సాంకేతికత ఫలాల ప్రయోజనాలు అందుకోవాలని తమ సంస్థ కోరుకొంటుందని తిలిపారు. కంప్యూటింగ్ ఉద్యోగాలు, కంప్యూటర్ సైన్స్ విద్యతో పాటు ఏ రంగానికి చెందిన వారైనా నైపుణ్యముంటే వివిధ రంగాల్లో వృద్ధిని సాధించవచ్చన్నారు.

అద్దకం




వస్త్రాల తయారీ ప్రారంభమయినప్పటి నుండి వాటిని విభిన్నరకాలైన పద్ధతుల్లో రూపొందించడం, రకరకాల దుస్తులుగా తయారుచేసి ధరించడం వంటివి చేసేవారు. అయితే వీటిలో నూతనత్వం కోసం పలు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆ క్రమంలో రూపొందించబడినదే అద్దకం. వస్త్రాలతయారీకి ఉపయోగించే నూలు, ఉన్ని, తదితర వస్త్ర సంబంధమైన దారపు వుండలకు, అలాగే వస్త్రాలకు రంగులకు అద్దడాన్ని ఆంగ్లంలో డైయింగ్ అని పిలుస్తారు. కొన్ని వందల సంవత్సరాలకు పూర్వమే అద్దకం విధానం ప్రారంభమయింది. దారపు వుండలు లేదా వస్త్రాలకు కావలసిన రంగులను అద్దడానికి పూర్వకాలంలో జంతువులు లేదా మొక్కల నుండి తీసేవారు. ఈ రంగులలో వస్త్రాలను ముంచడంకాని కావలసిన ఆకారాలను తయారుచేసి దానిపై ఈ రంగులతో ముద్రించడం కాని చేయడం ద్వారా దుస్తులు లేదా వస్త్రాలను అందంగా తీర్చిదిద్దేవారు.

150 సంవత్సరాలకు పూర్వం నుండి కృత్రిమ పద్ధతిలో తయారైన రంగులను మొదట అంచులకు, క్రమంగా పూర్తి వస్త్రాలకు వాడటం ప్రారంభించారు. ఇలా వస్త్రానికి రంగులు అద్దిన తర్వాత మామూలు దుస్తులు లాగానే ఉతికి, శుభ్రంచేసి ధరించవచ్చు. కొన్ని చోట్ల వివిధరకాల్లో తయారైన అచ్చులను రంగుల్లో ముంచి వస్త్రాలపై అద్దడం ద్వారా వాటిని మరింత అందంగా తీసుకువచ్చేవారు. ఈ పద్ధతిని పూర్తి వస్త్రానికి కాని లేదా తయారైన దుస్తులకు గాని ఉపయోగించేవారు. తొలుత రంగులు అద్దడం, అచ్చులు వేయడాన్ని కాటన్ వస్త్రాలు, దుస్తులపైనే ఉపయోగించేవారు. తర్వాత మిగిలిన వాటికి ఉపయోగించడం ప్రారంభమయింది. మొహంజోదారోలో కూరగాయల నుండి తీసిన రంగులను వస్త్రాలకు అద్దేందుకు ఉపయోగించినట్లు ఆర్కియాలజిస్టులకు లభించిన ఆధారాలను బట్టి తెలుస్తున్నది. ఆ తర్వాత కాలంలో భారత్‌లో కాటన్ వస్త్రాలకు రంగులను అద్దడంలో ఉపయోగించినట్లు పరిశోధనల వల్ల వెల్లడయింది. అలెగ్జాండర్ చక్రవర్తి తన సైనికుల దుస్తులకోసమని భారత్ నుండి ఈ విధానాన్ని తీసుకువెళ్ళినట్లు తెలుస్తున్నది.

అద్దకం విధానంలో ఎక్కువగా కాటన్ దారపు వుండలకు రంగులు అద్దడం చేస్తారు. వాటికి రంగులు అద్దిన తర్వాత అవసరానికి అను గుణంగా దుస్తులను తయారు చేస్తారు. మరొక దానిలో తయారైన తెల్లని దుస్తులకు వివిధ రంగులను అద్దడం చేస్తారు. లేదా రంగు వెలిసిన దుస్తులకు అవే రంగులను అద్దడం చేస్తారు. ఈ క్రమంలో బొమ్మలు, పూలలతలు తదితర పలురకాలుగా రూపొందించిన ముద్రలను కావలసిన రంగుల్లో ముంచి దుస్తులపై అద్దడం ద్వారా వాటిని అందంగా తీర్చిదిద్దుతారు. ఇంచు మించుగా ఇలాగే ఉన్ని, సిల్క్, పాలియస్టర్ దుస్తులకు కూడా వివిధ రంగులను అద్దే అద్దకం విధానాన్ని అవలంభిస్తారు. పూర్వకాలంలో మొక్కలు, జంతువులు, కూరగాయలు వంటి ప్రకృతి నుండి పలు విధానాల్లో తీసిన రంగులను అద్దడం చేయగా, క్రమక్రమంగా విజ్ఞానం పెరిగిన దృష్ట్యా రసాయన పద్ధతిలో రంగులను తయారుచేసి వాటిని ఈ వస్త్రాలు, దుస్తుల కోసం ఉప యోగించడం ప్రారంభించారు. నేడు ఎక్కువగా రసాయన పద్ధతిలో కనుగొన్న అద్దకం విధానాన్నే ఉపయోగిస్తున్నారు.

సాధారణంగా కనిపించే ఈ అద్దకం విధానం కూడా కొన్ని వందల సంవత్సరాలకు పూర్వమే రూపొందించబడిందంటే ఎవ్వరికైనా ఆశ్చర్యం కలగకమానదు.

రిమోట్ సెన్సింగ్ అంటే....



మనం టీవీ చూసేటప్పుడు దూరంగా కూర్చుని పాకెట్ "కాలిక్యులేటర్ లాంటి" సాధనంతో టెలివిజన్‌ను ఆన్ చేయటం, శబ్దాన్ని పెంచటం, తగ్గించటం, ఛానల్ మార్చుకోవటం, తిరిగి ఆపుచేయటంలాంటి పనులు చేస్తూ ఉంటాము. దీనినే "రిమోట్ కంట్రోల్" లేదా "సుదూర నియంత్రణ" విధానం అని పిలుస్తారు. ఇలాంటిదే "రిమోట్ సెన్సింగ్ విధానం" కూడా. దూరం నుండి కెమేరా కన్ను చూచి చక్కగా ఫొటోలు తీస్తుంది. అందువల్ల దీనిని రిమోట్ సెన్సింగ్ విధానం అంటున్నారు. ఎంతో దూరంలో ఉన్న వస్తువులు, ప్రదేశాలు, వాటిని గురించిన సమాచారం సేకరిస్తుంది. కాబట్టి మనం "సుదూర గ్రాహకం" అనుకోవచ్చు. రిమోట్ సెన్సింగ్ అనే పదం 1960 లోనే పుట్టింది. అమెరికాలోని 'మిచిగన్ ' విశ్వవిద్యాలయంలోని 'విల్లోరన్' పరిశోధనాలయంలో ఈ పదం పుట్టింది. అప్పటి నుంచి శాస్త్రప్రపంచంలో ఈ పదం ప్రచారంలోకి వచ్చింది. దూరంనుండి దృశ్యాలను ఫొటోలను తీసే పద్ధతి మన దేశంలోనూ, ఇతర దేశాలలోనూ 1920 నుండీ ప్రచారంలో వున్నది. అప్పుడు దానిని "ఏరియల్ ఫొటోగ్రఫీ" అని అనేవారు. భూమిని సర్వేచేయటం కోసం విమానాలనుండి ఫొటోలు తీసేవారు. అదే "ఏరియల్ ఫొటోగ్రఫీ". ఇది ఒక విధంగా ఆనాటి "రిమోట్ సెన్సింగ్". అంతరిక్షంలోకి పంపించిన ఉపగ్రహాలు భూకక్ష్యలో తిరుగుతాయి. అలా తిరుగుతూ తమనలో వున్న కెమేరాల ద్వారా భూమిని వివిధ కోణాల్లో ఫొటోలు తీస్తాయి. అట్లా తీసి భూమిపై నున్న కేంద్రాలకు ప్రసారం చేస్తాయి. రిమోట్ సెన్సింగ్‌లో సమాచారాన్ని రెండు పద్ధతుల్లో సేకరిస్తారు. సౌరశక్తిని ఇంధనంగా ఉపయోగించుకొని ఫొటోలు తీయటం ఒక పద్ధతి. దీనిని "పాసివ్‌సిస్టం" అంటారు. కృత్రిమ పద్ధతుల ద్వారా సాధించిన ఇంధనాలను ఉపయోగించి రాత్రింబవళ్లు ఫొటోలు తీయటం ఇంకో పద్ధతి. ఇలాంటి పద్ధతికి "యాక్టివ్ సిస్టమ్" అనిపేరు. రిమోట్ సెన్సింగ్ ద్వారా సేకరించిన సమాచారం వ్యవసాయ రంగానికి ఎక్కువ ఉపయోగపడుతున్నది.. పైనుండి పంటలు ఎటువంటి స్థితిలో వున్నాయో ఫొటోలు తీయవచ్చు. ఉపరితలంలోనూ, భూగర్భంలోనూ వున్న జలసంపదను అంచనా వేయవచ్చు. ఇలా ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించవచ్చు.

స్వీట్‌నర్ ఆరోగ్యానికి హానికరం!



సుగర్ ఫ్రీ అని చెప్పి చూయింగ్ గమ్‌లు, కొన్ని రకాల టూత్ పేస్టులు, ఇంకా వేల రకాల ఇతర ఉత్పత్తులలో ఉపయోగించే స్వీట్‌నర్ ఆరోగ్యానికి తీవ్రమైన హానికరమైనదని ఒక అధ్యయనంలో తేలినట్టు బెర్లిన్ యూనివర్శిటీకి చెందిన ఇద్దరు గాస్ట్రోఎంటరాలజీ నిపుణులు పేర్కొన్నారు. కొన్ని టూత్‌పేస్టు లలో సార్బిటాల్-దీనిని ఇ420 అని కూడా అంటారు- ఉంటుం దని, ఇది తీవ్రంగా బరువు కోల్పోవడం, కడుపునొప్పి, డయారియా వంటి సైడ్ ఎఫెక్టులకు కారణమవుతుందని వారు పేర్కొన్నారు. తమ శరీర బరువులో ఐదో వంతు కోల్పోయిన రోగుల గురించి బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ఒక నివేదికలో ప్రచురించారు. సార్బిటాల్‌ను అధికంగా తీసుకొనడంవల్ల ఈ ప్రభావం కనపడిందని వారు తెలిపారు. డయాబెటిక్ (మధుమేహ వ్యాధి గ్రస్తులు)లకు ఉద్దేశించి సుగర్ ఫ్రీ స్వీట్లలో సార్బిటాల్ వాడడం ప్రారంభించిన దగ్గర్నుంచి బ్రిటన్‌లో రింగ్లీ అనే కంపెనీ అమ్మకాలు మూడొంతులు పెరిగాయి. అయితే భారత దేశంలో సార్బిటాల్‌తో కూడిన బ్రాండ్‌లేవీ లేవు. అయితే, హల్వా, మైసూర్‌పాక్, బూంది లడ్డూ, జిలేబి, ఖోయా బర్ఫీ, పేడా, గులాబ్‌జామ్, రసగుల్లా, ఇంకా అలాంటి పాల ఉత్పత్తులలో సార్బిటాల్ వాడకానికి ఫుడ్ అడల్ట్రేషన్ యాక్ట్ అనుమతించింది. ఇంకా చూయింగ్ గమ్, బబుల్ గమ్, చాకొలెట్‌లు, వగైరా పంచదారతో చేసే వాటిలో కూడా దీనిని వినియోగించడానికి ఆ చట్టం అనుమతించింది.

ప్రభాస్ న్యూలుక్ !



'బాహుబలి' సినిమాతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన టాలీవుడ్ కథానాయకుడు ప్రభాస్. ప్రపంచ వ్యాప్తంగా రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టిన తొలి భారతీయ చిత్రంగా 'బాహుబలి' నిలవడం విశేషం. ప్రస్తుతం 'డార్లింగ్'.. 'సాహెూ' సినిమాలో నటిస్తున్నారు. కాగా ప్రభాస్ న్యూయర్ సందర్భంగా అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేశారు. ఫేస్‌బుక్ వేదికగా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ ఓ ఫొటోను పోస్ట్ చేశారు. ప్రముఖ మ్యాగజైన్ జీక్యూ ఇండియా కవర్‌పేజీపై ప్రభాస్ ఉన్న ఫొటో అది. ప్రభాస్ గతంతో పోలిస్తే చాలా కొత్తగా ఈ కవర్‌పేజీపై కనిపించారు. బ్లాకలర్ సూట్‌లో హ్యాండ్సమ్‌గా ఉన్నారు. 'సంచనల విజయం సాధించిన 'బాహుబలి' సూపర్‌స్టార్ ప్రభాస్‌కు సిగ్గు ఎక్కువ. 2018లో మా తొలి ప్రచురణ ద్వారా ఆయన గురించి తెలుపబోతున్నాం. ఆయన ఏం చెప్పారో తప్పక తెలుసుకోండి' అని జీక్యూ ఇండియా ట్వీట్ చేసింది. ప్రభాస్‌కు మంచి క్రేజ్ ఏర్పడిన నేపథ్యంలో ఆయన కథనాన్ని జీక్యూ ప్రచురించింది. సుజీత్ 'సాహెూ' సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. యాక్షన్‌కు ప్రాధాన్యం ఇస్తూ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అక్టోబరు 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.

ఫస్ట్‌లుక్‌లతో న్యూఇయర్ సంబరాలు..!

కొత్త ఆలోచనలు, కొత్త ప్రణాళికలతో కొత్త ఏడాదికి స్వాగతం పలకాలని అనుకుంటారు. ఇక సినీ సెలబ్రిటీలకు సినిమాలే ప్రపంచం కాబట్టి తమ సినిమాలకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌లు, టీజర్‌లను అభిమానులతో పంచు కుంటూ ఈ న్యూఇయర్‌ను మరింత ప్రత్యేకం చేస్తుంటారు. 2018కి స్వాగతం పలుకుతూ సినీ తారలు పంచుకున్న కొన్ని ఫస్ట్‌లుక్‌లు ..!





'భాగమతి' : టాలీవుడ్ 'స్వీటీ' అనుష్క టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'భాగమతి'. అశోక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తు న్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్, టీజర్‌కు విశేష స్పందన లభించింది. తాజాగా న్యూఇయర్‌ను పురస్కరించుకుని సినిమాకు సంబంధించిన మరో ప్రత్యేక పోస్టర్‌ను చిత్రబృందం సోషల్‌మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది. పోస్టర్‌లో అనుష్క ఓపక్కకు చూస్తున్నట్లు కన్పించారు.

'గాయత్రి' : ప్రముఖ నటుడు మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఈ సినిమాలో మోహన్‌బాబుకు సంబంధించిన ఫస్ట్‌లుక్ ఇటీవల విడుదలైంది. 'ఆ రోజుల్లో రాముడు చేసింది తప్పే అయితే నేను చేసింది కూడా తప్పే' అనే క్యాప్షన్‌తో ఆ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ఇప్పుడు సినిమాలోని మంచు విష్ణు శ్రియలకు సంబంధించిన ఫస్ట్‌లుక్ విడుదలైంది. లుక్‌లో గర్భిణీ అయిన శ్రియకు.. విష్ణు జడ వేయడం చూడముచ్చటగా ఉంది. పోస్టర్‌పై 'ఇకపై ఇద్దరిదీ ఒకటే ప్రాణం' అనే క్యాప్షన్ ఆకట్టుకుంటోంది.

'తొలిప్రేమ' : వరుణ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా నటిస్తున్న చిత్రం 'తొలిప్రేమ'. ఈ సినిమాలో వరుణ్, రాశీ జంటగా ఉన్న తొలి లుక్‌ను న్యూఇయర్ సందర్భంగా చిత్ర బృందం ఈరోజు విడుదల చేసింది. వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తు న్నారు. లుక్‌లో వరుణ్, రాశి ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసు కోవడం నెటిజన్లను ఆకట్టుకుం టోంది. ఫిబ్రవరి 9న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



అతిలోకసుందరికి టాలీవుడ్ అంటే చిన్నచూపా!



అతిలోక సుందరి శ్రీదేవి ఒకప్పుడు తమిళంతో పాటు తెలుగులో కూడా ఓ వెలుగు వెలిగింది. ఆమె టాప్‌స్టార్ కావడంలో టాలీవుడ్‌ది కూడా కీలక పాత్ర. ఆమెను మన దర్శకనిర్మాతలు, నాటి టాప్‌స్టార్స్ అందరూ ఎంతో ప్రోత్సహించారు. ఇక దేశవిదేశాలలో ఈమెకి ఉన్న అభిమానులు మరో నటికి లేరని చెప్పవచ్చు. తెలుగులో కూడా వర్మ, నాగార్జున, చిరంజీవి వంటి వారికి ఆమె ఎంతో సన్నిహితురాలు. కానీ ఆమె బాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత కేవలం నాటి సూపర్‌స్టార్ క ృష?, నాగార్జున, చిరంజీవి, వెంకటేష్ వంటి వారితోనే నటించింది. ఇక ఈమె పెద్ద కుమార్తె జాన్వికపూర్‌ని తెలుగులో నాగార్జున చిన్నకుమారుడు అఖిల్ మొదటి చిత్రంలోకి తీసుకోవాలని అనుకుంటున్నారని వార్తలు వచ్చాయి.

మరో వైపు అశ్వనీదత్‌తోపాటు చిరంజీవి కూడా 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సీక్వెల్‌ని గానీ, రీమేక్‌ని గానీ రామ్‌చరణ్ -జాన్వికపూర్‌లతో చేయాలని భావించారు. కానీ శ్రీదేవి మాత్రం మొదట కోలీవుడ్ ద్వారా తన కుమార్తెను పరిచయం చేయాలని భావించి ఆ తర్వాత బాలీవుడ్‌కే ఫిక్స్ అయింది. ఇక ప్రస్తుతం జాన్వి మరాఠీ 'సైరత్'కి బాలీవుడ్ రీమేక్‌గా రూపొందుతున్న 'ధడక్' చిత్రంతో నటిస్తోంది. శ్రీదేవి కూడా బాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత కూడా ఎక్కువగా కోలీవుడ్‌పై ఇంట్రస్ట్ చూపించిందే గానీ టాలీవుడ్‌ని పట్టించుకోలేదు. చివరకు 'బాహుబలి'కి కూడా నో చెప్పి బాలీవుడ్‌లో 'ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్' చిత్రాలతో పాటు విజయ్ నటించిన కోలీవుడ్ మూవీ 'పులి'లో నటించింది. ఇక విషయానికి వస్తే తాజాగా జాన్వికపూర్‌ని వెయిట్ తగ్గాలని కరణ్‌జోహర్‌తో పాటు 'ధడక్' దర్శకుడు కోరడంతో ఆమె ఆ పనిలో ఉంది. తాజాగా ఆమె టైట్ బనియన్, రోజ్ కలర్ లెగ్గిన్స్‌తో ప్రముఖ జిమ్ నుంచి బయటికి వచ్చి కారులో ఎక్కుతూ ఓ ఫొటోగ్రాఫర్‌కి స్మైల్ ఇచ్చిన పిక్ ఇప్పుడు వైరల్ అవుతోంది. జాన్వికపూర్‌ని తన రెండో చిత్రంగా కోలీవుడ్‌లోనే నటింపజేసి సౌత్ ఇండస్ట్రీకి పరిచయం చేయాలని శ్రీదేవి సన్నద్ధమవుతోందని తెలుస్తోంది. సో.. శ్రీదేవికి మాత్రం టాలీవుడ్ అంటే చిన్నచూపేనని అర్థమవుతోంది.



గోవాలో రాహుల్ నూతన సంవత్సర వేడుకలు

పనాజి : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నూతన సంవత్సర వేడుకలను తన తల్లి సోనియా గాంధీ, పార్టీ ఇతర సీనియర్ నాయకులతో కలిసి గోవాలో నిర్వహించుకున్నారు. సోనియా ఇప్పటికే గోవాలో ఉన్నారు. పార్టీ అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన రాహుల్ నూతన సంవత్సర వేడుకలు తల్లితో కలిసి జరుపుకునేందుకు ఇక్కడకు వచ్చారు. గత నెలలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్న సోనియా గోవాలో సెలవులను గడుపుతున్నారు. "దక్షిణ గోవాలోని మోబోర్‌లోని ఫైవ్‌స్టార్ హోటల్‌లో శనివారం సోనియాతో రాహుల్ కలిశారు. వారిరువురూ హోటల్‌లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు" అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒకరు పీటీఐకి తెలిపారు. "ఇది ప్రైవేట్ కార్యక్రమం. అందువల్ల పార్టీ శ్రేణులు లేదా ఇతర ప్రముఖులను ఆ కార్యక్రమానికి అనుమతించలేదు" అని ఆయన తెలిపారు. సోనియా గాంధీ డిసెంబరు 27వ తేదీ నుంచి ఇక్కడ విశ్రాంతి పొందుతున్నారు.



మహిళా హక్కుల కోసం పోరు : ఇష్రాత్

హౌరా : మహిళల హక్కుల కోసం భవిష్యత్‌లో పోరాడనున్నట్లు ట్రిపుల్ తలాక్‌పై పిటిషన్ దాఖలు చేసిన ఇష్రాత్ జాన్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో ఆమె ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ, "నేను ట్రిపుల్ తలాక్ బాధితురాలిని. దిగువ కోర్టు నుంచి ఎగువ కోర్టు వరకు ప్రతి దానిని నేను ఆశ్రయించాను. చివరికి, నాకు న్యాయం లభించింది. అందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. (ప్రధాన మంత్రి నరేంద్ర) మోదీజీ ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టారు. మహిళల హక్కుల కోసం భవిష్యత్‌లో నేను పోరాడతాను" అని చెప్పారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడిన సందర్భంగా తాను ఎన్నడూ కూడా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మద్దతు పొందలేదని కూడా ఆమె చెప్పారు. "మమతాజీ మహిళ, నాకు మద్దతు ఇవ్వాలి. కానీ నేను ఎన్నడూ ఆమె నుంచి ఎటువంటి మద్దతు పొందలేదు" అని చెప్పారు.

జాతీయ పౌరుల జాబితా సిద్ధం

గువహతి : అసోంలో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న స్థానిక పౌరుల నమోదు జరిగింది. రాష్ట్రంలో 3.29 కోట్ల దరఖాస్తులు రాగా వాటిలో 1.9 కోట్ల పౌరులను దేశీయులుగా గుర్తిస్తూ జాబితా రూపొందించామని, మిగతా వారి దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా శైలేష్ తెలిపారు. మరొక జాబితా త్వరలో విడుదల చేస్తామని ఆదివారం రాత్రి తెలిపారు. మొదటి జాబితాలో కొన్ని కుటుంబాల పూర్తి సంఖ్యకూడా జాబితాలో లేదని అయితే భయపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఏప్రిల్‌నాటికి డాక్యుమెంట్లు రూపొందిస్తున్నామని ఈ జాబితాను 2018లో పూర్తి చేస్తామన్నారు. 2015 మేలో 68.27 లక్షల కుటుంబాలకు చెందిన 6.5 కోట్ల డాక్యుమెంట్లు అందాయని నేషనల్ రిజిస్ట్రార్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్సీ) రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రతీక్ హజాలా వెల్లడించారు. జనవరి1 నుంచి ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి ఎన్‌ఆర్సీ కేంద్రాల్లోని జాబితాలో తమ పేర్లు ఉన్నాయోలేదో చూసుకోవచ్చన్నారు. ఈ జాబితా రూపకల్పనకోసం 2013 డిసెంబరు నుంచి సుప్రీంకోర్టు 40 సార్లు విచారణ చేపట్టిందని ఆర్‌జీఐ తెలిపింది.

అదే స్ఫూర్తితో పనిచేయండి : జనరల్ రావత్

న్యూఢిల్లీ : భారత ఆర్మీ ప్రాథమిక విలువలను పాటిస్తూ, స్ఫూర్తితో పనిచేయాలని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ సోమవారం సైనికులను కోరారు. రాజకీయాలకు సైన్యంలో చోటు ఉండదన్నారు. 2017లో ఇంటా, బయటా సైన్యం సేవలను ఆయన గుర్తు చేసుకొని నూతన ఏడాది సందర్భంగా సోమ వారం వారిని అభినందించారు. జమ్ము కాశ్మీర్‌లో సైన్యం పనితీరు, భారత్-చైనా సరిహద్దులోని డొక్లాం వద్ద 73 రోజులపాటు చైనా సైన్యాన్ని నిలువరించడంపై ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. దేశసమగ్రతను పరిరక్షించడంలో, విధివిధానాలు, గౌరవం, పరాక్రమం, నిస్వార్థసేవలు నిరంతరం కొనసాగించాలని కోరారు. ఉగ్రవాదం, చొరబాట్ల నుంచి దేశాన్ని రక్షించడంలో చేసిన కృషిని కీర్తించారు. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు గతేడాది మొదటి నుంచి కఠిన చర్యలు అమలు పరిచామని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రాణాలర్పించిన అమరజవాన్లకు ఆయన నివాళులర్పించారు. దేశ శక్తి,సంపదలు పెంచే విధంగా ఈ ఏడాదికూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఐక్యరాజ్యసమితిలోని భారత సైన్యం అసమాన ప్రతిభను చూపుతూ దేశానికి గర్వ కారణంగా నిలుస్తోందని రావత్ శ్లాఘించారు.

రాజ్యాంగాన్ని రక్షించే శక్తి మాకుంది

- గుజరాత్‌లో బీజేపీ బలం తగ్గించాం
- 2019 ఎన్నికల్లో వారిని రెండెంకెలకు పరిమితం చేయాల్సి ఉంది
- బీజేపీపై గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవానీ ధ్వజం



పూనే : దళిత నాయకుడు, గుజరాత్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన జిగ్నేష్ మెవానీ ఆదివారం బీజేపీపై ధ్వజమెత్తారు. 'రాజ్యాంగాన్ని మార్చాలని మీరు భావిస్తే, దానిని రక్షించే శక్తి మాకుంది. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అయితే నేను, నా వంటి వారు దానిని జరగనివ్వబోరు' అని స్పష్టం చేశారు. పూనేలోని 'ఎల్గార్ పరిషత్' వద్ద 'భీం-కోరేగావ్ యుద్ధం' స్మారకార్థ కార్యక్రమంలో మెవానీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్, దివంగత దళిత రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల తల్లి రాధిక, భీం ఆర్మీ అధ్యక్షుడు వినయ్ రతన్ సింగ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనుమడు, మాజీ ఎంపీ ప్రకాష్ అంబేద్కర్‌లు పాల్గొన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యే అయిన మెవానీ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాలు, దళితులు, మైనార్టీలు, రైతులు గుజరాత్ ఎన్నికల్లో 99 సీట్లకు తగ్గించడం ద్వారా బీజేపీ అహాన్ని తుడిచి పెట్టేశారన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటూ కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే చేసిన వివాదాస్పద ప్రకటనను ప్రస్తావిస్తూ, మెవానీ అధికార పార్టీపై తీవ్రంగా ధ్వజ మెత్తారు. 'భారత ప్రజాస్వామ్య ఏర్పాటును, రాజ్యాంగాన్ని మార్చాలని మీరు భావిస్తే, వాటికి రక్షణగా నిలిచే శక్తి మాకుంది' అని పేర్కొన్నారు. 'భావ సారూప్య త కలిగిన ప్రజలు, సంస్థలు 2019 ఎన్నికల్లో బీజేపీపై సమష్టిగా పోరాడాలి' అని అన్నారు. 'గుజరాత్‌లో 150 సీట్లు పొందిన బీజేపీ ఘనతను తగ్గించగలిగాం. మేము కలిసి పోరాడితే 2018 సార్వత్రిక ఎన్నికల్లో వారి సంఖ్యను రెండెంకలకు తీసుకురాగలం' అని మెవానీ తెలిపారు. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో ఎన్నికలు జరగనున్నాయని, భావ సారూప్యం కలిగిన ప్రజలందరీ ఏకతాటిపైకి రావాలన్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచారో తనకు ఆసక్తి లేదన్నారు. ముస్సోలిని, హిట్లర్ భావజాలాలను అనుసరిస్తున్న బీజేపీ ఓడిపోవాలని కోరుకుంటున్నట్లు ఆయన వివరించారు.

రాజస్థాన్ ఎమ్మెల్యే రాజీనామా

న్యూఢిల్లీ : వైద్యుల సమ్మె విషయంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాజస్థాన్‌లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ సోమవారం రాజీనామా పత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ కైలాష్ మేఘవాల్‌కు అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నవంబరు, డిసెంబరులో వైద్యుల సమ్మె వల్ల అనేకమంది రోగులు ఇబ్బందిపడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు.

జైన్‌తీర్థ్ ధర్మకర్త, భార్య హత్య

రాయ్‌పూర్ : చత్తీస్‌ఘడ్‌లోని దుర్గ్ జిల్లాలో ప్రసిద్ధ జైన్‌తీర్థ్ ధర్మకర్త, ఆయన భార్యను సోమవారం ఉదయం దుండగులు కాల్చిచంపారు. పోలీసులు తెలిపిన దాని ప్రకారం, నాగపూరలోని పర్షవానత్ జైన్‌తీర్థ్‌లో ధర్మకర్త, సామాజిక కార్యకర్త, ప్రముఖ వ్యాపారి రావల్మల్ (70), ఆయన భార్య సూరజ్‌దేవి జైన్ (65) గంజ్ ప్రాంతంలోని వారి ఇంటి వద్ద కాల్పుల్లో మరణించారని తెలిపారు. తెలిసిన వారే వారిని హతమార్చి ఉంటారని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

సాంబాల్ : ఉత్తరప్రదేశ్‌లో సాంబాల్-మొరదాబాద్ మార్గంలో వేగంగా వస్తున్న ట్రక్కు ఢీకొని సోమవారం ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. రోడ్డు పక్కన చలిమంట వేసుకుని కూర్చున్న వారి పైకి ట్రక్కు దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించామని చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

వదోదరకు చేరుకున్న భారత జాలర్లు

వదోదర : పాకిస్తాన్ గురువారం విడుదల చేసిన భారత జాలర్ల బృందం సోమవారం ఇక్కడ వేరేవల్ చేరుకుంది. ఈ బృందంలో మొత్తం 144 మంది భారత జాలర్లు ఉన్నారు. ఇక్కడి నుంచి వివిధ జిల్లాల్లోని వారి స్వస్థలానికి వెళ్లేందుకు బయలుదేరుతున్నారు. జాలర్లు ఎక్కువమంది మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లోని తీరప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. మొత్తం 291 మంది భారత జాలర్లను జనవరి 8 నాటికి రెండు విడతలుగా విడుదల చేస్తామని గత వారం రోజుల క్రితమే పాకిస్తాన్ ప్రకటించింది.

పాక్ జైళ్లలో 457 మంది భారతీయులు

- అందులో 399 మంది మత్స్యకారులు
- హైకమిషన్ కార్యాలయంలో జాబితా అందజేసిన పాక్

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌లోని వివిధ జైళ్లలో 399 మంది మత్స్యకారులతో సహా మొత్తం 457 మంది భారతీయులు మగ్గుతున్నారు. ఇక్కడి భారత హైకమిషన్ కార్యాలయానికి పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం అందించిన జాబితా ఈ విషయాన్ని తెలిపింది. 2008 మే 21వ తేదీన భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ ప్రభుత్వం ఈ వివరాలను అందజేసింది. ఈ ఒప్పందం క్రింద రెండు దేశాలు తమ దేశంలోని వివిధ జైళ్లలో ఉన్న ప్రత్యర్థి దేశానికి చెందిన ఖైదీల వివరాలను ఏటా రెండుసార్లు జనవరి 1, జూలై 1వతేదీన మార్చుకోవాల్సి ఉంటుంది. "పాకిస్థాన్ నేడు 457 మంది భారతీయ ఖైదీల జాబి తాను అందజేసింది. ఇందులో 58 మంది సాధారణ ఖైదీలు, 399 మంది మత్స్యకారులు. ఇస్లామాబాద్‌లోని భారత హై కమిషనర్ కార్యాలయంలో ఈ జాబితాను అందజేసింది" అని హై కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. జనవరి 8వ తేదీన 146 మంది మత్స్యకారులను విడుదల చేయనున్నట్లు కూడా పాకిస్థాన్ తెలిపిందని ఆ ప్రకటన పేర్కొంది. అరేబియా సముద్రంలో మెరైన్ సరిహద్దును స్పష్టం చేయకపోవడంతో తమ భూభాగంలో అక్రమంగా చేపల వేట నిర్వహిస్తున్నారనే పేరుతో ఇరు దేశాలు తరచూ మత్స్యకారులను అదుపులోకి తీసుకుంటున్నాయి. చెక్క పడవల్లో సాంకేతిక పరిజ్ఞానం కొరవడడంతో తరచూ సరిహద్దును దాటి వెళుతున్నాయి. భారత్‌లోని వివిధ జైళ్లలో ఉన్న పాకిస్థాన్ ఖైదీలకు సంబంధించిన సమాచారాన్ని భారత్ త్వరలో న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో అందజేస్తుందని భారత విదేశాంగ శాఖ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పొగ మంచుతో ఉక్కిరిబిక్కిరి

300 విమానాలు ఆలస్యం : 8 రద్దు



న్యూఢిల్లీ : ఉత్తరాదిని చలిపులి వణికిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో పొగమంచు దట్టంగా అలుము కుంటోంది. పక్కన ఏమున్నదో కూడా కనిపించడంలేదు. దానితో రాకపో కలకు తీవ్ర అంత రాయం కలుగుతోంది. పొగమంచు కారణంగా ఏమి కనపడక పోవడంతో సోమవారం ఇక్కడి ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 300కు పైగా విమానాల రాకపోకల్లో ఆలస్యం జరిగింది. ఎనిమిది విమానాలను రద్దు చేశారు. ఢిల్లీకి వచ్చే, ఢిల్లీ నుంచి బయలుదేరే దాదాపు అన్ని విమానాల పైనా పొగమంచు ప్రభావం పడింది. దాదాపు 265 దేశీయ విమానాలు, 67 అంతర్జాతీయ విమానాల రాకపోకల్లో ఆలశ్యం జరిగింది. 8విమానాలను రద్దు చేశారని, అవన్నీ కూడా దేశీయ విమానాలేనని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్య ఒక్క విమానం కూడా బయలుదేరలేదని చెప్పారు. రన్ వే దృశ్య శ్రేణి (ఆర్వీఆర్) 100-125 మీటర్ల మధ్య ఉన్న కారణంగా విమానాలు బయలుదేరలేదని, విమానం బయ లు దేరాలంటే కనీసం 125 మీటర్ల ఆర్వీఆర్ వుండాలని చెప్పారు. పార్కింగ్ స్థలాలు అందు బాటులో లేని కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమానాలు దిగలేకపోవడం కూడా జాప్యానికి ఒక కారణమని తెలిపారు. బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న విమానాలు పార్కింగ్ ప్రాంతాన్ని ఆక్రమించా యని, దానితో దిగాల్సిన విమానాలు ఆకాశంలోనే చక్కర్లు కొట్టాల్సి వచ్చిందని అన్నారు. మంచు దట్టంగా కమ్ముకున్న కారణంగా పొరుగు నున్న విమానాశ్రయాలకు కూడా మళ్లించలేక పోయామని తెలిపారు. ఢిల్లీ విమానాశ్రయంలో పరిస్థితిని విస్తరా చీఫ్ వ్యూహకర్త, కమర్షియల్ అధికారి సంజీవ్ కపూర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. "బయలుదేరాల్సిన విమానాలన్నీ మంచు కారణంగా ఆగిపోయాయి. పార్కింగ్ ప్రదే శాన్ని ఈ విమా నాలే ఆక్రమించడంతో రావాల్సిన విమానాలకు ఇబ్బంది కలిగింది.

మధుర జైలు నుంచి ముగ్గురు ఖైదీలు పరారీ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో పటిష్టమైన భద్రత ఉండే మధుర జైలు నుంచి సోమవారం తెల్లవారుజామున ముగ్గురు ఖైదీలు తప్పించుకున్నారు.దీంతో అక్కడ భద్రతను కట్టుదిట్టం చేసినట్టు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున రెండు గంటలకు వీరు తప్పించుకున్నారని చెప్పారు. మరొక ఖైదీ జైలు ప్రహరీ గోడ నుంచి దూకేటప్పుడు గాయపడ్డాడని, అయన్ని పట్టుకుని తప్పించుకున్న ఖైదీల గురించి విచారిస్తున్నామని తెలిపారు.

సిమ్లా, శ్రీనగర్‌ల్లో చలిపులి

సిమ్లా : సిమ్లా, శ్రీనగర్‌లలో చలి విపరీతంగా పెరిగింది. సిమ్లాలో సోమవారం 2.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖాధికారులు తెలిపారు.కీలాంగ్‌లో -9.2 డిగ్రీల సెల్సియస్ నమోదైందని చెప్పారు. కిన్నార్ జిల్లాలోని కల్పాలో -2.3, మనాలిలో 0.6, డల్హౌస్‌లో 4.2, ధర్మశాలలో 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చెప్పారు. శ్రీనగర్‌లో సోమవాంర 4.4 ఉష్ణోగ్రత నమోదైందని చెప్పారు. రాత్రి ఉష్ణోగ్రతలు పహల్గాంలో-5, గుల్మార్గ్‌లో -7.5, జమ్మూలో 6.7 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్టు చెప్పారు.

ప్రపంచంలోని పలు ప్రాంతాలకు మన నగరాల పేర్లు



న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్. అదే పేరుతో పాకిస్థాన్‌లోని సింధ్ రాష్ట్రంలో ఓ నగరం ఉంది. మన హైదరాబాద్‌ను 1591లో నిర్మిస్తే, పాకిస్థాన్‌లోని హైదరాబాద్‌ను 1768లో స్థాపించారు. ఇది పాకిస్థాన్‌లోని ఎనిమిదో పెద్ద నగరం కూడా. హైదరాబాద్ పేరుతో ఉన్న రెండు నగరాలు చారిత్రాత్మక వారసత్వ సంపదకు, పర్యాటక ఆకర్షణకు పెట్టింది పేరు. అదే విధంగా ఢిల్లీ, కోల్‌కతా పేర్లతో అమెరికాలోనూ పట్టణాలున్నాయి. ఇలా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని ప్రాంతాలను మన పట్టణాలు, నగరాల పేర్లతో పిలుస్తున్నారు.

ఢిల్లీ: భారత రాజధాని. అమెరికాలోనూ ఓ ఢిల్లీ ఉన్నది. అది కాలిఫోర్నియా రాష్ట్రంలోని మెర్సీడ్ కౌంటీ పరిధిలో ఉన్న ఓ మేజర్ గ్రామం. ఇక్కడి జనాభా దాదాపు 11వేలు.

కోల్‌కతా: మనదేశంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన కోల్‌కతా పేరుతో అమెరికాలోనూ ఓ పట్టణం ఉన్నది. ఓహియో రాష్ట్రంలో ఉన్న ఈ పట్టణాన్ని 1870లో నిర్మించారు. ఇక్కడ బొగ్గు గనులు, వ్యాపార సంస్థలు ఎక్కువ. స్థానిక జనాభా కేవలం మూడువేలే.

కొచ్చి: కేరళలోని కొచ్చి సుపరిచిత నగరం. జపాన్‌లోనూ ఓ కొచ్చి ఉన్నది. షికోకూ రాష్ట్రంలో ఉన్న ఈ ప్రాంతం పర్యాటక రంగానికి ప్రసిద్ధి. జనాభా 40వేలకు పైనే.

పాట్నా: బీహార్ రాజధాని పాట్నా పేరుతో స్కాట్లాండ్‌లోనూ ఓ గ్రామం ఉన్నది. 1802లో విలియం ఫుల్లర్టోన్ అనే వ్యక్తి ఈ గ్రామాన్ని నిర్మించాడు. అతడి తండ్రి ఈస్టిండియా కంపెనీ తరపున భారత్‌లో పనిచేయడంతో మన పాట్నా స్ఫూర్తిగా ఈ గ్రామానికి పేరు పెట్టుకున్నాడు.

లక్నో: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో పేరుతో అమెరికాలో ఓ చిన్న గ్రామం ఉన్నది. పెన్సిల్వేనియా రాష్ట్రంలో కొండల మధ్య ఉన్న ఈ గ్రామ వైశాల్యం 5,500 ఎకరాలు మాత్రమే.

సేలం: తమిళనాడులోని ప్రాచీన పట్టణమైన సేలం పేరుతో అమెరికాలో రెండు పట్టణాలున్నాయి. మసాచూసెట్స్ రాష్ట్రంలో ఒక పట్టణం ఉడగా, ఒరెగాన్ రాష్ట్ర రాజధాని పేరు కూడా సేలం కావటం విశేషం.

థానే: మహారాష్ట్రలోని తీరప్రాంత పట్టణమైన థానే పేరుతో ఆస్ట్రేలియాలోనూ ఓ పట్టణం ఉంది. అయితే, ఆ పేరు ఎలా వచ్చిందో ఇప్పటికీ తెలియదు.

బరోడా: గుజరాత్‌లో బరోడా పేరుతో ఒక పట్టణం ఉంటే.. అమెరికాలోని మిషిగాన్ రాష్ట్రంలో అదే పేరుతో ఓ గ్రామం ఉంది. మైఖేల్ హానర్ అనే వ్యక్తి పోమోనా పేరుతో ఈ గ్రామాన్ని నిర్మించారు. తర్వాత సీహెచ్ పిడర్ అనే వ్యక్తి కొనుగోలు చేసి బరోడాగా పేరు మార్చారు. ఆయన గుజరాత్‌లోని బరోడాలో పుట్టాడు. పుట్టిన పేరును తాను కొనుగోలు చేసి ఊరుకు పెట్టుకున్నాడు.

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకా కదా. బీహార్‌లోని ఒక నియోజకవర్గం పేరు కూడా ఢాకానే.

బాలి: ఇండొనేషియాలోని ప్రఖ్యాత పర్యాటక స్థలం బాలి పేరుతో మనదేశంలో ఒక గ్రామం ఉంది. రాజస్థాన్‌లోని పాలి జిల్లాలో ఈ గ్రామం ఉంది.

ఫరీద్‌కోట: పంజాబ్‌లోని జిల్లా కేంద్రమైన ఫరీద్‌కోట్ పేరుతో పాకిస్థాన్‌లో ఓ గ్రామం ఉంది. ముంబై దాడుల్లో పట్టుబడి ఉరిశిక్షకు గురైన ఉగ్రవాది అజ్మల్ కసబ్ సొంతగ్రామం పాకిస్థాన్‌లోని ఫరీద్‌కోట్ కావటం గమనార్హం.

చౌక గృహాల దిశగా...



న్యూఢిల్లీ: దేశీయ నిర్మాణ రంగం అడుగులు చౌక గృహాల దిశగా పడుతున్నాయి. ఇన్నాళ్లా సంపన్న వర్గాలే లక్ష్యంగా ముందుకెళ్లిన రియల్ ఎస్టేట్ సంస్థలు.. ఇప్పుడు మధ్యతరగతి వారిపై దృష్టి సారించాయి. 2017లో హైదరాబాద్‌సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కొత్త గృహాల ప్రారంభోత్సవం 35 శాతం తగ్గినప్పటికీ, అందులో చౌక గృహాల వాటా మాత్రం 6 శాతం పెరిగింది. కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ వివరాల ప్రకారం హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల్లో 2016లో 1,13,044 యూనిట్ల కొత్త గృహాలు ప్రారంభమైతే, 2017లో మాత్రం 73,956 యూనిట్లకు పడిపోయింది. అహ్మదాబాద్‌లో అత్యధికంగా 52 శాతం క్షీణించగా, ఆ తర్వాత హైదరాబాద్ (51 శాతం), బెంగళూరు (47 శాతం), కోల్‌కతా (45 శాతం), చెన్నై (44 శాతం), పుణె (43 శాతం), ఢిల్లీ-ఎన్‌సీఆర్ (14 శాతం), ముంబై (8 శాతం) నగరాలున్నాయి. ఇదే సమయంలో ఈఈ నగరాల్లో చౌక గృహాలు గతేడాదితో పోల్చితే 6 శాతం పెరిగి 31,241 యూనిట్లుగా నమోదయ్యాయి. 11,000 యూనిట్లతో ముంబై మొదటి స్థానంలో ఉండగా, 5,700 యూనిట్లతో పుణె రెండో ప్లేస్‌లో నిలిచింది. ఇదిలావుంటే లగ్జరీ విభాగంలో 70 శాతం పతనం కనిపించింది. 331 యూనిట్లకే వీటిని సరిపెట్టారు. కాగా, రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం (రెరా) అమలు కారణంగానే బిల్డర్లు ఎక్కువగా కొత్త యూనిట్ల జోలికి వెళ్లలేదని కుష్‌మన్ వెల్లడించింది.

కారు- గూడ్సు రైలు ఢీ

వదోదర : మానవరహిత రైల్వే లెవల్ క్రాస్ వద్ద వేగంగా వెళుతున్న గూడ్సు రైలును కారు ఢీకొట్టడంతో ఐదుగురు విద్యార్థులు మృతి చెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి.బరూచీ జిల్లాలో ఈ ఘటన జరిగిందని సోమవారం అధికారులు తెలిపారు. మృతి చెందిన వారంతా బరూచీలోని మదరసా విద్యార్థులన్నారు. వారంతా ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందని పశ్చిమ రైల్వే వదోదర డివిజన్ పీఆర్వో మీన కుమార్ తెలిపారు.

జమ్మూలో ఉగ్రవాదులపై ముగిసిన ఆపరేషన్

శ్రీనగర్ : జమ్మూ, కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులపై భద్రతాదళాలు ప్రతిదాడిగా చేపట్టిన ఆపరేషన్ ముగిసింది. సోమవారం మరొక ఉగ్రవాది మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు భద్రతాదళ అధికారులు తెలిపారు. ఆదివారం ఇద్దరు ఉగ్రవాదుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిని జైషే ఏ మొహమ్మద్ కు చెందిన ఉగ్రవాదులుగా గుర్తించినట్టు తెలిపారు.

కేరళలో కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల సమ్మె

తిరువనంతపురం : వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డిసెంబరు 29 నుంచి కేరళలో ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రుల్లోని జూనియర్ డాక్టర్లు చేపడుతున్న ఆందోళన సోమవారం కొనసాగింది. ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజతో ఆందోళన చేస్తున్న వైద్యుల ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. అయితే వారి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వైద్యులు తమ ఆందోళనను కొనసాగించారు.

ఎన్‌ఆర్‌ఐ వివాహాల నమోదుకు వెబ్‌సైట్



వివాదాల పరిష్కారానికి దోహదం

నమోదు చేయడం రిజిస్ట్రార్‌లకు తప్పనిసరి

న్యూఢిల్లీ : ఎన్‌ఆర్‌ఐ వివాహాలకు సంబంధించిన వివరాలను అప్‌లోడ్ చేసేందుకు దేశవ్యాప్తంగా రాష్ట్రాల నుంచి నమోదుకు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక వెబ్‌సైట్ ఏర్పాటు చేసింది. ఎన్‌ఆర్‌ఐ భర్తలు తమ భార్యల పట్ల అమానుషంగా ప్రవర్తించడం లేదా వదిలిపెడుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కార చర్యల్లో భాగంగా కేంద్రం ఈ వెబ్‌సైట్‌కు రూపకల్పన చేసింది. ఎన్‌ఆర్‌ఐ వివాహ వివాదాలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు డిసెంబరు 20న తన కార్యదర్శి ద్వారా నేతృత్వంలో ఒక సమగ్ర నోడల్ ఏజెన్సీని మంత్రిత్వ శాఖ నియమించింది. ఎన్‌ఆర్‌ఐ పురుషుల నుంచి మహిళలు ఎదుర్కొంటున్న చట్టపరమైన, నియంత్ర సవాళ్ల సమీక్షకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఒక ఇంటర్ మినిస్టీరియల్ ప్యానెల్ చేసిన సిఫార్సులను అనుసరిస్తాయి. 'ఈ వెబ్‌సైట్‌లో ఎన్‌ఆర్‌ఐ వరుడు ఎక్కడ పని చేసేదీ, చిరునామాతో సహా భారత జాతీయులతో ఎన్‌ఆర్‌ఐల వివాహాలకు సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయి. ఫిర్యాదులను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఇది దోహదపడుతుంది. ఒక వివాహ నమోదు తర్వాత వెంటనే అన్ని వివరాలను అప్‌లోడ్ చేయడం రిజిస్ట్రార్‌లకు తప్పనిసరి' అని మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఇదిలాఉండగా, ప్రతి ఏటా సగటున వివాహం చేసుకుంటున్న ఎన్‌ఆర్‌ఐల సంఖ్యపై ప్రభుత్వం వద్ద సరైన వివరాలు లేవని విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ డిసెంబరు 21న పార్లమెంటులో తెలిపారు. అయితే 2015 నుంచి తమ ఎన్‌ఆర్‌ఐ భర్తలతో వివాహ వివాదాల గురించి భారత మహిళల నుంచి 3,328 ఫిర్యాదులు భారత రాయబార కార్యాలయాలకు అందాయి. వీటిలో 3,268 ఫిర్యాదులకు సంబంధించి మహిళకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడం ద్వారా పరిష్కరించారు. అయితే ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్, మహిళా, శిశు అభివృద్ధి మంత్రి మేనకాగాంధీలు చట్టపరమైన కార్యాచరణ రూపొందించడంతో ఇటీవల కాలంలో ఫిర్యాదులు పెరిగిన దాఖలాలు లేవు. ఎన్‌ఆర్‌ఐ వివాహాలన్నింటినీ వారం లోపల నమోదు చేయాలని కూడా ప్యానెల్ సిఫార్సు చేసింది. ప్రస్తుతం, పంజాబ్‌తో సహా కొన్ని రాష్ట్రాలు మాత్రమే తప్పనిసరిగా ఎన్‌ఆర్‌ఐల వివాహాలను నమోదు చేస్తున్నాయి.

కారు గోతిలోపడి ఇద్దరి మృతి

ఉత్తరాఖండ్ : ఉత్తరాఖండ్‌లో కారు గోతిలోపడి ఇద్దరు మృతి చెందారు. పిథోరాఘర్ - తనక్‌పూర్ హైవేలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 10.25కు ఈ ఘటన జరిగిందని జిల్లా విపత్తుల మేనేజ్‌మెంట్ అధికారి ఆర్ఎస్ రాణా తెలిపారు. ఎన్‌హెచ్ 125లో కారు ప్రయాణిస్తుండగా రోడ్డువిస్తరణ పనులు చేపట్టిన నేపథ్యంలో లోతుగా ఉన్న గోతిలో పడటంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు.

పంజాబ్, హర్యానాల్లో గజగజ

చండీఘర్ : హర్యానా, పంజాబ్‌ల్లోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. అనేక చోట్ల 0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపారు. దీంతో మంచు కారణంగా కొన్ని రైళ్లు ఆలస్యంగా నడిచాయని, విమానాల రాకపోకలను రద్దు చేసినట్టు చెప్పారు. హర్యానాలోని హస్సార్‌లో 1.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణగ్రతలు నమోదైనట్టు చెప్పారు. నౌర్నైల్‌లో 3.6, సిర్సాలో 5.8, కర్నాల్‌లో 8.4, రోహతక్‌లో 7.1, భీవనిలో 7.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు చండీఘర్‌లో 8.2 డిగ్రీల సెల్సియస్ కనీస ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చెప్పారు.



ఇచ్ఛాపురంలో ఘోరం

- నూర్పుయంత్రం బోల్తా
- ముగ్గురు మహిళల దుర్మరణం
- మృతులంతా కూలీలు
- లొద్దపుట్టిగలో విషాధచాయలు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలోని లొద్దపుట్టిగ గ్రామంలో సోమవారం విషాధం చోటుచేసుకుంది. వరి నూర్పు యంత్రం బోల్తా పడటంతో దాని కింద నలిగి ముగ్గురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన దినసరి కూలీలు. మృతుల్లో దక్కత జానకమ్మ(27), కొచ్చెర్ల తులసమ్మ(40), తిప్పన కూర్మమ్మ(48) వున్నారు. సోమవారం మధ్యాహ్నం ఒక పొలం నుంచి మరో ప్రాంతానికి నూర్పిడి యంత్రంపై కూర్చొని ప్రయాణిస్తున్నారు. నూర్పిడి యంత్రాన్ని తరలిస్తున్న ట్రాక్టర్ నుంచి ప్రమాదవశాత్తు పొలంగట్టు వద్ద యంత్రం బోల్తా పడింది. భారీ యంత్రం ముగ్గురు మహిళలపై పడటంతో అక్కడికక్కడే మహిళలు మృతిచెందారు. మృతుల్లో జానకమ్మ అవివాహిత. తులసమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కూర్మమ్మకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తులసమ్మ, కూర్మమ్మలిద్దరికీ భర్తలు చనిపోవడంతో కుటుంబ భారాన్ని మోస్తున్నారు. రోజువారీ వ్యవసాయ కూలీలుగా బతుకు వెళ్లదీస్తున్నారు. వీరి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీసిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ డీఎస్పీ ఎస్.రాఘవ, సీఐ ఎం.అవతారం, టౌన్ ఎస్సై బి.మంగరాజులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. రూరల్ ఏఎస్ఐ జీవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆసుపత్రిలో మృతదేహాలను ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పరిశీలించారు. ప్రభుత్వపరంగా కుటుంబాలని ఆదుకుంటామని హామీనిచ్చారు. ప్రమాదం నుంచి తప్పించుకున్న డ్రైవర్ పరారయ్యాడని ట్రాక్టర్ యజమాని పరపతి పరుశరామరెడ్డి చెబుతున్నాడు. డ్రైవర్ వివరాలేవీ తన వద్ద లేవని చెబుతున్నప్పటికీ గ్రామస్థులు మాత్రం అతడే ట్రాక్టర్ డ్రైవర్‌గా, యజమానిగా వ్యవహరిస్తున్న పేర్కొనడంతో పోలీసులు అతన్ని కూడా కేసులో నిందితునిగా చేర్చారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు మృత్యువాత పడటంతో లొద్దపుట్టుగలో విషాధం అలముకుంది. జానకమ్మకు ఐదుగురు అన్నలు, నలుగురు అక్కలు ఉన్నారు. కుటుంబంలో అందరి కంటే ఈమె చిన్నది. కూరమ్మ కుమార్తె దేవమ్మను మృతురాలు జానకమ్మ అన్నయ్యకే ఇచ్చి ఇటీవలే వివాహం చేశారు. తులసమ్మ భర్త నారాయణ మూడేళ్ల క్రితమే మృతిచెందడంతో కుటుంబ భారం మోస్తుంది.

కరాటేలో రణస్థలం విద్యార్థులకు స్వర్ణం

విశాలాంధ్ర - రణస్థలం : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శ్రీకాకుళం జిల్లా రణస్థలం విద్యార్థులు స్వర్ణ పతకం సాధించారు. కోచ్ ఎల్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో రణస్థలానికి చెందిన రోహిత్‌చౌదరి, భువన్, జశ్వంత్, మురళీ, శశివర్ధన్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో సత్తా చాటిన కోచ్ ఈశ్వరరావును సోమవారం స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సాగర తీరంలో అంబరాన్నంటిన సంబరాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆకాశమే హద్దుగా యువత నూతన సంవత్సర వేడుకల్లో మునిగితేలారు. విశాఖ సాగరతీరంలో ఈ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి 12 గంటల వరకూ పోలీసులు అడుగడుగునా తనిఖీలతో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టడంతో యువతలో నిరాశ ఎదురైంది. అయినప్పటికీ వేలాది మంది సాగరతీరంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఆర్కే బీచ్‌కు వెళ్లే దారులన్నింటిలో పోలీసులు నిఘా వేసినా ఛేదించుకొని యువత సాగరతీరం బాటపట్టారు. కాలనీలు, జంక్షన్లు, హోటళ్లు, పబ్బులు ఇలా ఎక్కడ చూసినా ఆటపాటలు, ఉర్రూతలూగించే మ్యూజిక్ మస్తీతో వేడుకలు జరుపుకున్నారు. బీచ్ రోడ్డులోని హోటళ్లు, రిసార్ట్స్‌లో ప్రత్యేక ఈవెంట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోలీసులు తనిఖీలకు విసుగుచెందిన యువత రిసార్ట్స్, హోటళ్లలో టిక్కెట్లు కొనుగోలు చేయడంతో వాటికి గిరాకీ పెరిగింది. విశాఖలో ఇప్పటికే విదేశీ సంస్కృతి ప్రవేశించగా న్యూయర్ వేడుకల్లో ఇది మరింత చిందులేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మద్యం, మాంసం విక్రయాలు ఆదివారం తెల్లవార్లూ సాగాయి.



విశాఖలో ఒక్కరోజులోనే రూ.5 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు సాగినట్లు తెలుస్తోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అమ్మకాలు పెరిగాయి. నగరమంతా పోలీసుల వలయం ఉన్నప్పటికీ న్యూ ఇయర్ కేరింతలు ఆగలేదు.

అధికార పార్టీలో లుకలుకలు

- ఆళ్లగడ్డలో ఏవీ విందుపై అఖిలప్రియ ఆగ్రహం
- బైరెడ్డి చేరికతో మాండ్రవర్గీయుల ఆందోళన
- రసవత్తరంగా కర్నూలు జిల్లా రాజకీయం



ఏవీ సుబ్బారెడ్డి




మంత్రి అఖిలప్రియ



బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అధికార తెలుగుదేశం పార్టీలో లుకలుకలు ఆ పార్టీ కర్నూలు జిల్లా నాయకుల్లో కలకలం రేపుతున్నాయి. భూమా నాగిరెడ్డికి ఆత్మగా చెప్పుకునే ఏవీ సుబ్బారెడ్డి ఆదివారం ఆళ్లగడ్డలోని ఏవీ ఫంక్షన్ హాలులో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చిన న్యూ ఇయర్ విందు వివాదాస్పదమైంది. ఈ విందుకు ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లోని ఆయన అనుచరులతోపాటు భూమా వర్గీయులు భారీగా తరలివెళ్లారు. సుబ్బారెడ్డి విందుకు వెళ్లవద్దని రాష్ట్ర మంత్రి అఖిలప్రియ అనుచరులతో ఆదేశాలు జారీ చేయించినా 5 వేల మందికి పైగా హాజరు కావడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. హాజరైన నాయకుల పేర్లను ఆరా తీస్తున్నట్లు సమాచారం. భూమా నాగిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి మధ్య మంచి స్నేహం ఉండేది. భూమా ఏ పని చేయాలన్నా అనుచరుడు ఏవీకే అప్పగించే అంత నమ్మకం. నాగిరెడ్డి మరణానంతరం ఆయన రాజకీయ వారసత్వం పుచ్చుకున్న అఖిలప్రియ, సుబ్బారెడ్డి మధ్య విభిప్రాయాలు బయటపడ్డాయి. నంద్యాల ఉప ఎన్నికలో సుబ్బారెడ్డి పోటీ చేస్తారని పుకార్లు వచ్చాయి. అఖిలప్రియ తన సోదరుడు భూమా బ్రహ్మానందరెడ్డికి సీటు ఇవ్వాలని అధిష్టానాన్ని కోరడంతో సుబ్బారెడ్డి వైసీపీ నుంచి బరిలో దిగుతారనే ప్రచారం సాగింది. ఈ క్రమంలో శిల్పా మోహన్‌రెడ్డి వైసీపీలో చేరడంతో ఏవీ విరమించుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా సుబ్బారెడ్డితో చర్చించి బ్రహ్మానంద రెడ్డిని గెలిపించాలని కోరడంతో ఆయన కృషి చేశారు. అప్పటి నుంచి అఖిలప్రియ, సుబ్బారెడ్డి మధ్య వివాదం కొనసాగుతున్న తరుణంలో తాజాగా నూతన సంవత్సర విందు అగ్గిని రాజేసింది. భూమాకు అత్యంత సన్నిహితులు, బంధువులు కూడా హాజరుకావడంతో అంతర్గత పోరు చర్చనీయాంశమైంది. రాబోయే ఎన్నికల్లో ఆళ్లగడ్డ సీటు సుబ్బారెడ్డికి ఇస్తారనే ప్రచారం కూడా లేకపోలేదు.

ఇదే సమయంలో నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి టీడీపీ పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించడంతో ఆ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. ఇక్కడ గతం నుంచి బైరెడ్డికి ప్రత్యేక వర్గం ఉంది. టీడీపీ వీడి రాయలసీమ పరిరక్షణ సమితి తరఫున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి పగిడ్యాల మండలంలో విజయం సాధించారు. మిడుతూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లోనూ బైరెడ్డి వర్గీయుల ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. ఈ క్రమంలో టీడీపీ నందికొట్కూరు నియోకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి వర్గం మాత్రం ఆయన చేరికను వ్యతిరేకిస్తుంది. బైరెడ్డి చేరితే మాండ్ర టీడీపీని వీడుతారనే పుకార్లు వినవస్తున్నాయి. నందికొట్కూరు నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ కావడంతో 2009 ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం నుంచి బైరెడ్డి పోటీ చేశారు. 2014 ఎన్నికలలో టీడీపీని వీడి రాయలసీమ పరిరక్షణ సమితి స్థాపించడంతోపాటు ఎన్నికల సమయంలో కేసు నమోదు కావడంతో బైరెడ్డి తన కుమార్తెను పోటీకి దింపారు. బైరెడ్డి టీడీపీలో చేరితే 2019 సాధారణ ఎన్నికలలో పాణ్యం నియోజకవర్గ ప్రస్తుత ఇన్‌చార్జి ఏరాసు ప్రతాపరెడ్డి, బైరెడ్డి మధ్య సీటు కేటాయింపులో పోటీ నెలకొనే అవకాశం ఉంది. కర్నూలు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఉండగా, టీజీ వెంకటేష్ కుమారుడు టీజీ భరత్ పోటీకి సిద్ధం కావడంతో పార్టీలో అంతర్గత పోరు కొనసాగుతుంది. 2014 ఎన్నికల్లో జిల్లాలోని రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ 11 అసెంబ్లీ, రెండు పార్లమెంటు సీట్లలో విజయం సాధించింది. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నంద్యాల, కర్నూలు ఎంపీలు ఎస్పీవైరెడ్డి, బుట్టా రేణుక, శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, మణిగాంధీ, భూమా అఖిలప్రియ, భూమా నాగిరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరారు. నంద్యాల ఉప ఎన్నికలో బ్రహ్మానందరెడ్డి గెలుపు, ఎమ్మెల్సీ ఎన్నికలలో కేఈ ప్రభాకర్ ఏకగ్రీవం కావడంతో రాబోయే ఎన్నికల్లో అన్నీ స్థానాల్లో విజయం సాధించి తీరుతామని ఉప ముఖ్య మంత్రి కేఈ కృష్ణమూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీని వీడిన వారంతా తిరిగి సొంత గూటికి వస్తుండటంతో ఆ పార్టీ కార్యకర్తలు ఆనందంతో ఉన్నారు. స్వార్థంతో నాయకులు పార్టీలు మారినా కార్యకర్తలు మాత్రం వైసీపీ వెంటే ఉన్నందున, రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆ పార్టీ నేతలు నమ్మకంతో ముందుకుసాగుతున్నారు.



తీర్థయాత్రలో విషాదం

ఇద్దరు మృతి- మరో ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : ఆలయాల సందర్శన యాత్ర నూతన సంవత్సర తొలి రోజు విషాదంగా ముగిసింది. కొత్తకారులో తీర్థయాత్రకు వెళ్తున్న బృందం జేసీబీని ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక క్కడే తుదిశ్వాస విడిచారు. మరో ఇద్దరి కాళ్లు తెగిపోయిన ఘటన కర్నూలు జిల్లా శిరివెళ్ల మెట్ట సమీపంలోని 40వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసు కొంది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మధురాపూర్‌కు చెందిన నందు(24), వి.ప్రవీణ్ కుమార్(26), చంద్రమోహన్‌గౌడ్, నాగార్జున రెడ్డి, బి.ప్రవీణ్‌కుమార్ తిరుపతిలో వెంకన్న దర్శనం తర్వాత మహానంది బయల్దేరారు. మార్గమధ్యంలో శిరివెళ్లమెట్ట వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉంచిన జేసీబీ యంత్రాన్ని వీరు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. డ్రైవర్ నందు, వి ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలిలో మృతి చెందారు. చంద్రమోహన్‌గౌడ్, బి ప్రవీణ్‌కుమార్‌గౌడ్ కాళ్లు విరిగాయి. నాగార్జున రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతదేహాలను, క్షతగాత్రులను సీఐ యుగంధర్ బాబు, ఎస్సై సుధాకర్‌రెడ్డి, ఎఎస్సై మౌనీబాష సమన్వయంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిమిషంలో 300లకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవేపై గంటలతరబడి వాహనాలు ఉంచడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

ఇళ్లకు నిప్పుపెట్టిన అల్లరిమూకలు

- న్యూ ఇయర్ వేడుకల్లో వికృతచేష్టలు
- రూ.7 లక్షల విలువైన ఆస్తి నష్టం
- తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో ఘటన

విశాలాంధ్ర - రాజానగరం: నూతన సంవత్సర వేడుకల్లో అల్లరిమూకల వికృతచేష్టలతో తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మూడు నివాస గృహాలు, నాలుగు దుకాణాలు, గడ్డివామి మంటల్లో కాలిపోయాయి. దాదాపు రూ.7 లక్షల ఆస్థి నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. బాధితులు బొడ్డు బురమ్మ, నెల్లూరి వెంకటలక్ష్మి, జామ వరలక్ష్మి,గెడ్డ పార్వతి కథనం ప్రకారం సోమవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రాజానగరం సమీపంలోని గుడిసెలకు నిప్పుపెట్టి పరారయ్యారు. ప్రమాద సమయంలో గుడిసెల్లో పదిహేను రోజులు పసికందు, బాలింత, మరో ఇద్దరు చిన్నారులు, మహిళలు మాత్రమే ఉన్నారు. ప్రమాదం నుంచి వీరంతా బయటపడినా ఇళ్లలోని సామగ్రితోపాటు నగదు, బంగారు ఆభరణాలు బూడిదయ్యాయి. స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలోని నైదాని రాంబాబు కిళ్లీ దుకాణం, పిల్లి వెంకట రమణ సైకిల్ షాపు, సుందరపల్లి సత్తిబాబు కిరాణా షాపులకు అగంతకులు నిప్పుపెట్టారు. ఈ దుకాణాల్లో 3 లక్షల ముప్పై వేల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు వాపోయారు. అలాగే జాతీయ రహదారిలోని జీఎస్ఎల్ ఆసుపత్రి వద్ద చక్రధారాబాదం గ్రామానికి చెందిన వీతాని వెంకటరమణ దుకాణానికి నిప్పు పెట్టడంతో రూ.2 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగింది. నూతన సంవత్సరం తొలిరోజు కట్టుబట్టలతో రోడ్డున పడిన బాధితులను తక్షణం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే తీరుపై అధికారుల తిరుగుబాటు

- జెడ్పీ సమావేశంలో అధికారులపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే నాయుడు
- మదనపడ్డ అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు
- జన్మభూమిని బహిష్కరిస్తామని హెచ్చరిక





కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జిల్లా అధికారులు, మాట్లాడుతున్న కెఏ నాయుడు

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : ఏ సమావేశంలోనైనా, ఎవరిపైనైనా నోరు పారేసుకొనే గజపతినగరం ఎమ్మెల్యే డాక్టర్ కేఏ నాయుడు మరో మారు వివాదంలో కెక్కారు. విజయనగరం జిల్లా అధికారులు మూకుమ్మడిగా ఈ ఎమ్మెల్యే తీరుపై మండిపడుతున్నారు. ఆయన తీరు ఇలాగే కొనసాగితే తాము జన్మభూమి విధులు నిర్వహించలేమని స్పష్టం చేశారు. ఆయనతోపాటు మరికొందరు జెడ్పీటీసీ సభ్యులు వైఖరి తమను తీవ్రంగా కలిచి వేసిందని, ఎమ్మెల్యేపై తక్షణం చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం అధికారులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నాయుడు దురుసు ప్రవర్తనతో అనేకసార్లు మనస్థాపానికి గురైనట్టు అధికారులు విన్నవించారు. దానికి తగ్గట్టు ఆదివారం విజయనగరం జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మరోసారి ఎమ్మెల్యే రెచ్చిపోయారు. సిమ్మెంటు రోడ్లకు బిల్లుల చెల్లింపులో జాప్యంపై పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులను నిలదీశారు. పార్వతీపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణను దుర్భాషలాడారు. ఆయన చెప్పేది వినకుండా ఇష్టానుసారం మాట్లాడారు. బయటకు రా చూసుకుందాం అంటూ హెచ్చరిస్తూ తంతామంటూ బెదిరించడంతో మిగిలిన అధికారులు కంగుతిన్నారు. కొందరు జెడ్పీటీసీ సభ్యులు కూడా ఎమ్మెల్యేకు వంతపాడుతూ అధికారులపై ధ్వజమెత్తారు. సాక్షాత్తు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ సమక్షంలో ఈ వివాదం జరిగింది. బిల్లుల చెల్లింపులో ఆలస్యం వాస్తవమే అయినప్పటికీ దానికి కారణాలను, తమ సమస్యలను చెప్పుకొనే అవకాశం ఎమ్మెల్యే ఇవ్వలేదని అధికారులు వాపోయారు. తీవ్ర మనస్థాపంతో వీరంతా జిల్లా అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రమే సమావేశమయ్యారు. తమకు ఏదోఒక పనిచెప్పి చేయకపోతే జెడ్పీ సమావేశంలో నిలబెట్టి నిలదీయడం, బెదిరించడం కొందరు ప్రతినిధులకు అలవాటుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కలెక్టర్ వివేక్ యాదవ్‌కు ఫిర్యాదు చేసిన అధికారులు ఇలాంటి పరిస్థితిలో తాము విధులు నిర్వహించలేమని, ముఖ్యంగా వచ్చే జన్మభూమిలో పాల్గొనే పరిస్థితులు లేవని కలెక్టర్‌కు స్పష్టం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రతి ఒక్కరికీ చట్టప్రకారం కొన్ని నిబంధనలు ఉంటాయని, వాటిని పాటించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. సమావేశాల్లో ఎలా ప్రవర్తించాలో అన్న అంశంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివేక్‌యాదవ్ ప్రకటించారు.

అధికారులకు సీపీఐ సంఘీభావం

జిల్లా అధికారులకు సీపీఐ సంఘీభావాన్ని ప్రకటించింది. జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే నాయుడి తీరును సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు తప్పుబట్టారు. ఎమ్మెల్యే, కొందరు జెడ్పీటీసీ సభ్యులు అధికారులపట్ల అనుసరించిన తీరు సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయని, దీనికి తాజా ఘటన మరో ఉదాహరణ అని అన్నారు.

అవిడిలో అర్ధరాత్రి కొట్లాట

విశాలాంధ్ర - కొత్తపేట : తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట మండలం అవిడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆదివారం రాత్రి నూతన సంవత్సర సంబరాల నేపథ్యంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. దీంతో గ్రామంలోని అంబేద్కర్, వంగవీటి మోహనరంగా విగ్రహాలు ధ్వంసమయ్యాయి. రెండు ద్విచక్ర వాహనాలలకు నిప్పులు పెట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై డి.విజయ కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అమలాపురం డీఎస్పీ ప్రసన్నకుమార్, రావులపాలెం సీఐ బి.పెద్దిరాజు పర్యవేక్షణలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు ప్రాథమిక ఆధారాలు సేకరించాయి. ముందస్తుగా అవిడి గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరువర్గాలు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

5 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్



విశాలాంధ్ర- దొరవారిసత్రం : ఫ్లెమింగో ఫెస్టివల్‌కు నెల్లూరు జిల్లా అధికారయంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పక్షుల పండుగ జరుగుతుంది.

- పక్షుల పండగకి రూ. 5.5 కోట్లతో ఏర్పాటు
- పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి

రెండేళ్ల క్రితం ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ఈ పండగ నిర్వహణకు ఈ ఏడాది రూ.5.5 కోట్లు మంజూరు చేసింది. సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.3 కోట్లతో పాటు సూళ్లూరుపేట, దొరవారిసత్రంలో అభివృద్ధి పనులకు రూ.2.5 కోట్లు కేటాయించారు. సూళ్లూరుపేట హైస్కూల్లో వివిధ రకాల స్టాల్స్, బొమ్మలతో స్టాల్స్ ఉంచేలా ప్రణాళికలు రూపొందించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. తడ వద్ద బోటు షికారుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పక్షులను వీక్షించ దంతోపాటు చిన్నపిల్లలు ఆడుకునే జారుడుబండ, రంకల్‌రాట్నం వంటివి వాటితో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. దొరవారిసత్రం మండలం నేలపట్టు లోని పులికాట్ సరస్సు ఒడ్డున పక్షుల రక్షిత కేంద్రంలో ఇప్పటికే రకరకాల పక్షులు సందడి చేస్తున్నాయి. నూతన సంవత్సరం తొలి రోజు సోమవారం పక్షుల కేంద్రంలో పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు విదేశి విహంగాలను వీక్షిస్తూ నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. కడపచెట్లు పై విడిది చేసిన గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, తెల్లకంకణాయి



మొదలగు జాతి కొంగలు పిల్లలతో ఆడుతూ గడుపుతున్న దృశ్యాలను చూసిన పర్యాట కులు సంతోషం వ్యక్తం చేశారు. పక్షుల కేంద్రం వద్ద గైడ్స్ బైనాక్యులర్‌లతో చెరువుకట్టపై యూవ్ పాయింట్ల నుంచి పక్షుల చరిత్రలను పర్యాటకులకు వివరించారు. విదేశాల నుంచి ఏటా ఇదే మాసాల్లో తరలివచ్చి పక్షుల కేంద్రంలో తజకట్టి పిల్లల్ని పొదిగిన తర్వాత అవి పెద్దవై తిరిగి పిల్లలతో సహా వాటి దేశాలకు వెళ్లిపోతుంటాయి. పక్షులపై చిత్రీక రించిన ఫిల్మ్‌షోను పర్యాటకులకు చూపించారు.

S & D

డ్రైవింగ్ పాఠశాలల దందా

సక్రమంగా పనిచేయని శిక్షణ కేంద్రాలు

విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్రంలో కార్లు, ద్విచక్రవాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఏటా రోడ్డు ప్రమాదాలు అధికంగానే నమోదవుతున్నాయి. ఇందులో 80 శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయి. ప్రమాదాల్లో చిక్కుకొనే వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. వీరికి సరైన శిక్షణ లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్లే ప్రమాదాలకు దారితీస్తోందని పోలీ సులు చెబుతున్నారు. డ్రైవింగ్ స్కూల్ అనుమతికి ఐదేళ్లకుగాను రూ.10వేలు ఫీజు చెల్లించాలి. ఆర్టీఏ నిబంధనల ప్రకారం ప్రతి డ్రైవింగ్ స్కూల్‌లో లైసెన్స్‌తో కలిపి ఒక వ్యక్తి నుంచి రూ.3000 నుంచి రూ.3,500 వరకు మాత్రమే వసూలు చేయాలి. కానీ రూ.6 నుంచి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొందరు మొండికేసి లైసెన్సు కోసం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్తే అక్కడా చుక్కలు చూపిస్తు న్నారు. ఒక్కో డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో ఐదు నుంచి ఆరు వరకు బ్యాచ్‌లుంటు న్నాయి. ఒక్కో బ్యాచ్‌లో 10 నుంచి 20 మంది వరకు ఉంటున్నారు. శిక్షణ కేంద్రంలో చేరిన తర్వాత రెండు, మూడు రోజులు కారులో తిప్పి 20 రోజులు కాగానే లైసెన్సు ఇప్పిస్తున్నారు. శిక్షణ ముఖ్యం కాదు, లైసెన్స్ ఇప్పించడమే లక్ష్యం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి డ్రైవింగ్ స్కూల్‌కు ఆర్టీఏ నుంచి తప్పకుండా అనుమతి పొందాలి. కనీసం ఇరవై రోజులు శిక్షణ ఇవ్వాలి. ఇందులో 12 గంటల పాటు ప్రాక్టికల్ శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాలి. ఆడియో, వీడియోల రూపంలో ట్రాఫిక్ నిబంధనలు వివరించాలి. ఇవేవీ అమలు కావడం లేదు. నిర్వాహకులు ఒక కుర్చీ వేసుకొని కూర్చొంటున్నారు. శిక్షణ కోసం వచ్చే వారిని కారులో ఎక్కించుకొని వెళ్లిపోతున్నారు. కేంద్రంలో కనీసం 16 మంది కూర్చొనేలా స్థలం ఉండాలి. కంప్యూటర్ సాయంతో ఏర్పాటు చేసిన నమూనా డ్రైవింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. శిక్షణకు కావాల్సిన చార్టులు, సైన్‌బోర్డులు, ఇతర సామగ్రి తప్పకుండా అందుబాటులో ఉండాలి. ఇవేమి అందుబాటులో లేవు. శిక్షణ ఇచ్చే సమయంలో మంచి రన్నింగ్ కండిషన్‌లో ఉన్న వాహనాల్నే వినియోగించాలి. చాలా వరకు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల్లో పాత వాహనాలను వాడుతున్నారు. దీనివల్ల శిక్షణ పొందిన వారికి కొత్త వాహనాలపై అవగాహన ఉండటంలేదు. నిత్యం కొత్తగా వందల వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. లైసెన్సు లేని డ్రైవింగ్ స్కూళ్లపై చర్యలు చేపట్టి, నిబంధనల ప్రకారం తరగతి గదులు, శిక్షణకు అవసరమైన సౌకర్యాలు కలిపిస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది.



గవర్నర్‌తో కేసీఆర్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వారిరువురు అరగంట సేపు భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ఇటీవల జయప్రదంగా ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు, అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సుకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించినట్లు సమాచారం.

అలాగే నూతన సంవత్సర కానుగా రాష్ట్ర రైతాంగానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయాన్ని కూడా గవర్నర్‌కు సీఎం తెలిపారు. సీఎంను గవర్నర్ అభినందిం చారు. విద్యుత్ రంగంలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలుస్తోందని గవర్నర్ అన్నారు. 24 గంటల పాటు విద్యుత్ అందించడం అంటే అది సాధారణ విషయం కాదని గవర్నర్ వ్యాఖ్యానించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో హోరాహోరే

- గుజరాత్ ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు
- మోడీ విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత
- ప్రతిపక్షాలు ఫ్రంట్ కట్టే అవకాశం
- ప్రత్యామ్నాయ విధానాలు కావాలి : వామపక్షాలు



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : ఈ ఏడాది దేశంలోని వివిధ ప్రాంతాలలోని 8 రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అన్ని రాష్ట్రాలలోనూ బీజేపీ, కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాల మధ్య హోరాహోరీ పోరు జరగనున్నది. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘర్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, మిజోరం రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరగవలసి ఉంది. వీటిల్లో నాలుగు పెద్ద రాష్ట్రాలున్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘర్‌లలో బీజేపీ అధికారంలో ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాలలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధానంగా ఎన్నికల పోరాటం జరుగుతుంది. త్రిపురలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్నది. బీజేపీ ఈ రాష్ట్రంలో ప్రవేశించేందుకు ప్రయత్ని స్తోంది. ఇటీవల గుజరాత్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలు బీజేపీకి విజయం తెచ్చిపెట్టినప్పటికీ ఆ పార్టీ ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తీవ్రంగానే వ్యతిరేకించారు. పాకిస్థాన్ బూచిని చూపి బీజేపీ నాయకుడు నరేంద్ర మోడీ గెలుపు సాధించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బలమైన నేతగా ఎదిగేందుకు గుజరాత్ మంచి వేదిక అయింది. మోడీ దుష్ప్రచారం చేయకపోతే కాంగ్రెస్ గెలుపొంది ఉండేదని కొంతమంది విశ్లేషించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలకు, బీజేపీకి మధ్య 2019 లోక్‌సభ ఎన్నికలలో కూడా హోరాహోరీ పోరాటం జరిగే అవకాశాలున్నాయి. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత గత మూడేళ్ల కాలంలో అనేక రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమి పాలైంది. దీనితో 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికలలో సమష్టి నాయకత్వం ఏర్పడి బీజేపీకి వ్యతిరేకంగా అధ్యక్ష తరహా ఎన్నికల మాదిరిగా ఈ ఎన్నికలను జరిపే అవకాశం ఉందని భావిస్తున్నారు. 18 ప్రతిపక్షాలు ఒక ఫ్రంట్‌గా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థులను పోటీపెట్టే అవకాశాల కోసం ప్రయత్నాలు జరుగవచ్చు. కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీలు గుజరాత్ ఎన్నికల సందర్భంగా ఒక ఫ్రంట్‌గా ఏర్పడవచ్చునని భావించినప్పటికీ అది జరగలేదు. ఉత్తరప్రదేశ్‌లోనూ జరిగిన ఎన్నికలలో ప్రతిపక్షాలకు ఓటమే ఎదురైంది. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘర్‌లలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నది. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ వినియోగించుకుని ప్రతిపక్షాలతో ఫ్రంట్ ఏర్పాటు చేసినట్లైతే మంచి ఫలితాలు ఉండవ చ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. గుజరాత్‌లో వచ్చిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఫ్రంట్ ఏర్పాటు చేయడమే మంచిదని వారు సూచి స్తున్నారు. ఈ రాష్ట్రాలలో కాంగ్రెస్ ఫ్రంట్ మంచి ఫలితాలను సాధిస్తే 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికలు ప్రతిపక్షాలకు పెద్ద ఊపునిస్తాయి. అందు వల్ల 2018లో 8 రాష్ట్రాలలో జరిగే ఎన్నికలకు కూడా మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రతిపక్షాల మధ్య ఎక్కువ అవగాహన సఖ్యత ఏర్పడితేనే ఉమ్మడి అభ్యర్థులను పోటీపెట్టే అవకాశాలు కలుగుతాయి. అయితే, అన్ని ప్రతిపక్షాలు ఒక ఫ్రంట్‌గా ఏర్పడతాయా? అనేది పెద్ద ప్రశ్న. లోక్‌సభ ఎన్నికల నాటికి ప్రతిపక్ష పార్టీలన్ని ఒక్కటవుతాయని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు నరేష్ అగర్వాల్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సెక్యులర్ పార్టీలన్నీ ప్రత్యామ్నాయ విధానాలను, వ్యూహాలను రూపొందించినట్లయితే కొంత ప్రయోజనం ఉంటుందని సీపీఐ నాయకులు డి.రాజా, సీపీఎం నాయకులు మహ్మద్ సలీం అభిప్రాయపడ్డారు. రాజకీయ పార్టీలతో పాటు సామాజిక శక్తులను సమీకరించి బీజేపీ, సంఘపరివార్‌పైన పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని డి.రాజా పేర్కొన్నారు.

జలసిద్ధిగా రాష్ట్రం

ప్రాజెక్టుల సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : నవ్యాంధ్రప్రదేశ్‌ను ఈ ఏడాది జలనిధి రాష్ట్రంగా చూడాలని వుందని, తన ఆశయాన్ని, ప్రజాకాంక్షను 2018లో నెర వేర్చేలా ప్రయత్నించాల్సిన బాధ్యత జలవనరుల శాఖ ఇంజినీర్లదేనని సీఎం చంద్ర బాబు పిలుపునిచ్చారు. పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. పలు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆటంకంగా మారిన న్యాయపరమైన చిక్కులను కాలయాపన జరగకుండా పరి ష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో ఇంకెన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి, భూగర్భజలాలు ఏమేరకు వున్నాయి, పంటకుంటల ఏర్పాటు ఎంతవరకు వచ్చింది తదితర అంశాలపై అధ్యయనం చేసి కొత్త ఏడాదిలో సరికొత్త పథంలో నడవాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వడమే కాకుండా, భవిష్యత్ నీటి అవసరాలు దృష్టిలో పెట్టుకుని ఏ పంటలు సాగు చేయాలో రైతన్నలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని జిల్లాల్లో వాటర్ ఆడిటింగ్ చేపట్టాలని ఆదేశించారు. అత్యుత్తమ జల సంరక్షణ, జల నిర్వహణ చర్యలతో ఈ ఏడాది అత్యధిక దిగుబడి సాధించేలా చూడాలని చెప్పారు. గతేడాది చిత్తూరు, కడప జిల్లాల్లో అత్యధికంగా భూగర్భ జలాలు పెరిగాయని అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లోనూ భూగర్భ జలాల పెంపునకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టులపై సోమవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈనెల 2 నుంచి మొదలయ్యే 'జన్మభూమి-మాఊరు' కార్య క్రమంలో పలు ప్రాధాన్య ప్రాజెక్టులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈనెల 3న కడప జిల్లాలోని గండికోట-సీబీఆర్ లిఫ్టును, ఈనెల 7న కర్నూలు జిల్లాలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడంతో పాటు, ఈనెల 11న అనంతపురము జిల్లాలోని ధర్మవరం, బుక్కపట్నం చెరువులకు జల హారతి ఇస్తామని వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలోని వంశధార ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస ప్రక్రియ పూర్తిచేసినందుకు అక్కడ అధికారులను అభినందించిన ముఖ్యమంత్రి రెండు దశాబ్దాల సమస్య ముగిసిపోవడం సంతోషం కలిగించిందని అన్నారు.పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి 48వ సారి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. డిసెంబర్ 11 నుంచి డిసెంబర్ 31 మధ్య 21 రోజుల పాటు జరిగిన పనులను ముఖ్యమంత్రికి జలవనరుల శాఖ అధికారులు వివరించారు. రెండు నెలల విరామం తర్వాత పోలవరం ప్రాజెక్టు కోసం తవ్వకం పనులను త్రివేణి సంస్థ తిరిగి మొదలుపెట్టిందని, ఈ 21 రోజులు 6.96 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి, రాతి తవ్వకం పనులు పూర్తయ్యాయని తెలిపారు. సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, ఈఎన్‌సీ వెంకటేశ్వరావు, ట్రాన్స్‌ట్రాయ్, త్రివేణి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఏపీలో ప్రైవేటు ఆస్పత్రుల బంద్..!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎంసీఐ స్థానంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులు మూసివేయాలని ఎంసీఐ నిర్ణయించింది.ఈ మేరకు రాష్ట్రం లోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులలో అత్యవసర సేవలు మినహాయించి, మిగిలిన వైద్య సేవలను అందిస్తారు.13జిల్లాల్లో ఐఎంఏ నేతల సారథ్యంలో బంద్‌ను నిర్వహిస్తారు.

అజ్ఞానానికి శత్రువు అక్షరం

ప్రపంచ గతిని మార్చిన కమ్యూనిస్టు మేనిఫెస్టో

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : చదవు అనేది సమా జానికి ఉపయోగపడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. అజ్ఞానానికి అక్షరం శత్రువని పేర్కొ న్నారు. స్థానిక స్వరాజ్య మైదానంలో ఎన్టీఆర్ ట్రస్ట్, విజయ వాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన 29వ పుస్తక మహో త్సవం సోమవారం ప్రారంభమైంది. పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని సీవీ సాహిత్య వేదికపై 'నన్ను ప్రభావితం చేసిన పుస్తకం' అనే అంశంపై సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి అధ్యక్షతన ప్రసంగ కార్యక్రమం జరి గింది. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ 43పేజీల కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రపంచగతిని మార్చి వేసిందని చెప్పారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో 83శాతం మంది ఎంపీలు ధనవంతులే ఉన్నారని తెలిపారు. వైసీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తక పఠనంతో కూడిన విజ్ఞానం భవిష్యత్ తరానికి మార్గ దర్శకంగా నిలుస్తుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ అక్షరంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఆ తర్వాత తరం నాయకులపై డబ్బు ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం తరం వారికి చరిత్రలు, పుస్తకాలు చదవాలనే ఆసక్తి కూడా లేదని వారి ప్రసం గాలను పరిశీలిస్తే అర్థమవుతోందన్నారు. పుస్తకం విలువ అనన్యసామాన్యమన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య



వరప్రసాద్ మాట్లాడుతూ చదువురాని, పుస్తకజ్ఞానం లేని వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునేముందు ప్రజలు ఆలో చించుకోవాలని కోరారు. అంబేద్కర్, కారల్‌మార్క్స్ రచించిన పుస్తకాలు తనను ప్రభావితం చేశాయని చెప్పారు. పుస్తకపఠనంతోనే రాజకీయ నాయకులు ఆదర్శవంతుల వుతారని పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు కొచ్చర్లకోట లక్ష్మీ కాంతం మాట్లాడుతూ 'నా భారతం అమర భారతం' పుస్తకం తనను ప్రభావితం చేసిందని తెలిపారు. సీపీఎం నాయకుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం షైనింగ్ ఇండియాలో సఫరింగ్ ఇండియన్స్ ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు.



పాఠశాలలో అపశ్రుతి

- ఎల్ఈడీ బల్బు పేలి 200 మంది విద్యార్థులకు కంటి సమస్యలు
- పార్వతీపురం వెంకంపేటలో సంఘటన

విశాలాంధ్ర-పార్వతీపురం : నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం వెంకంపేట పంచాయతీ పరిధిలోగల సురేష్ పాఠశాలలో అపశ్రుతి చోటుచేసుకుంది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఏర్పాటుచేసిన డీజే లైటింగ్ కాంతుల వల్ల సుమారు 200 మంది విద్యార్థులకు కంటి సంబంధిత సమస్యలు తలెత్తాయి. బుధవారం రాత్రి సురేష్ పాఠశాల యాజమాన్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో సౌండ్ సిస్టంతోపాటు ఎల్ఈడీ బల్బులు పెట్టడం వల్ల అందులో ఒక ఎల్ఈడీ బల్బుపేలి పొగ దట్టంగా వ్యాపించింది. దాని ధాటికి సుమారు 200 మంది విద్యార్థులు కంటి సమస్యతో బాధపడ్డారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చే సమయానికి విద్యార్థుల కళ్లల్లో నుంచి నీరు కారడంతో గమనించిన తల్లిదండ్రులు యాజమాన్యంపై ఆగ్రహించారు. అనంతరం వారి పిల్లలకు సమీప ఆసుపత్రుల్లో వైద్యులకు చూపించగా ఎల్ఈడీ లైటింగ్ ప్రభావం వల్లే జరిగిందని చెప్పారు. మరికొందరు విద్యార్థులకు కంటి సమస్య మరీ ఎక్కువగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఆర్డీవో బి.సుదర్శనదొర పాఠశాలను సందర్శించి జరిగిన సంఘటనపై ఆరాతీశారు. అనంతరం విద్యార్థులకు దగ్గరుండి కంటి పరీక్షలు చేయించారు. ఈ మేరకు నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తానని ఆర్డీవో తెలిపారు. అలాగే పార్వతీపురం సీఐ జి.రాంబాబు సంఘటనపై ఆరాతీశారు. విద్యార్థుల తల్లిదండ్రులనుంచి వివ రాలు సేకరించి కేసు నమోదుచేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిం చాలని వైద్యులను సూచించారు. అయితే యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రైవేటు పాఠశాలల్లో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని సీపీఐ పార్వతీపురం నియోజకవర్గ కార్యదర్శి ఆర్.వి.ఎస్. కుమార్ ఆరోపించారు. దీన్ని వల్లే విద్యార్థు లకు కంటి సమస్యలు ఏర్పడటం బాధాకరమన్నారు. యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని డిమాండు చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

- గుంటూరు జిల్లా గొట్టిపాడులో తీవ్ర ఉద్రిక్తత
- పలువురికి గాయాలు
- భారీగా పోలీసుల మోహరింపు





విశాలాంధ్ర-గుంటూరుబ్యూరో/ప్రత్తిపాడు : నూతన సంవత్సర వేడుకల్లో జరిగిన స్వల్ప వివాదం గొట్టి పాడు గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో గ్రామం రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురికి గాయాల య్యాయి. ఈ ఘర్షణలో అగ్ర వర్గానికి చెందిన ఒకరు, వెనుకబడిన వర్గానికి చెందిన నలుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వెనుకబడిన వర్గానికి చెందిన యువకులు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముగ్గు వేస్తున్న మహిళపై పడటంతో మహిళ ఆగ్రహించి వారిని తిట్టడంతో వివాదం ఆరంభమైంది. దీంతో ఒక వర్గానికి చెందిన వారి ఇళ్లపై మరొక వర్గం వారు అదేరాత్రి రాళ్లు రువ్వారు. తర్వాత సోమవారం తెల్లవారు జామున అగ్ర వర్గం, వెనుకబడిన వర్గం పెద్ద ఎత్తున రాళ్లు రువ్వుకున్నారు. మారణాయుధాలు పట్టుకుని వీధులలో విహరించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పోలీ సులు రంగప్రవేశం చేశారు. వీధులలో ఉన్న ఇరు వర్గాలను చెదరగొట్టారు. సుమారు 400 మంది కర్రలతో, ఇటుకలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులకు కూడా స్వల్ప గాయాల య్యాయి. గాయపడ్డవారిలో కొందరినీ ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరి కొందరినీ గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరు వర్గాలతో శాంతి కమిటీ వేసి ఘర్షణ లేకుండా చర్చలు జరుపుతున్నారు. సంఘటనా స్థలాన్ని జిల్లా అదనపు ఎస్పీ వైటీ నాయుడు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ సీతారామయ్య ఇతర డీఎస్పీలు, సీఐలు, ప్రత్తిపాడు ఎస్ఐ భార్గవ్ తదితరులు పరిశీలించారు. ఒక వర్గంపై మరో వర్గం దాడి చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇక్కడ ప్రత్యేకంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గొట్టిపాడు వివాదం తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రామంలో ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవు తాయోననే భయం నెలకొంది. గ్రామంలో ఇద్దరు ముగ్గురు గుంపులుగా ఉండకుండా పోలీసులు చెదరగొడుతున్నారు. భయం గుప్పిట్లో జనం బిక్కుబిక్కు మంటూ ఉన్నారు.

సేవారత్న జయరాం మృతి

విశాలాంధ్ర - ఒంగోలు : సేవారత్న, కమలపత్ర గ్రహీత, నటుడు చలువాది జయరాం అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఒంగోలు జీసెస్, లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు ఆయన చేపట్టి, వేల మందికి నేత్ర, రక్తదానాలు చేయించిన ఘనత ఆయన సొంతం. జయరాం పలు సినిమాలలో కూడా నటించి మెప్పించారు. ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు జయరాం మృతికి సంతాపం తెలిపారు.

ప్రజా నాట్యమండలి సంతాపం

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముక్తని అంజయ్య, నల్లూరి మురళిలు జయరాం మృతికి సంతాపం తెలిపారు, వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

అన్న నల్లూరి సంతాపం

ప్రముఖ ప్రజా సేవకుడు జయరాం మృతికి ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జయరాంతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ముఖ్యంగా టీ. కృష్ణ 1975లో చిత్రీకరించిన యువతరం కదిలింది సినిమాలో కూడా జయరాం ఓ ప్రత్యేక పాత్ర పోషించారన్నారు. జిల్లాలో నేత్ర దానం చేయించడంలో జయరాం అవిశ్రాంతంగా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. నాలుగేళ్ల కిందట తన సోదరుడు చనిపోయిన సందర్భంలో కూడా తమ గ్రామానికి వచ్చిన విషయాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. అందరితో ఎప్పుడూ నవ్వుతూ మంచి నడవడికతో అందరినీ ఆకట్టుకునే మృదుస్వభావి జయరాం మృతి తీరని లోటని అన్న నల్లూరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జయరాం మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని నల్లూరి పేర్కొన్నారు.

దళితుల బహిష్కరణ దారుణం

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలుజిల్లా రుద్ర వరం మండలం నకులదిన్నెలో ఎట్టిపనులు చేసేందుకు నిరాకరించిన దళితులను గ్రామం నుంచి అగ్రవర్ణాలు బహిష్కరించడం దారుణమని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. దళితులపై కొనసాగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 6వ తేదీన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.దీనికి దళితులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. సమాజంలో ఎవరైనా వారికి నచ్చిన పనిని ఎంచుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందని వివరించారు. బలవంతంగా దళితులచేత పనిచేయించడం నేరమని తెలిపారు. దళిత కాలనీకి అగ్రవర్ణాలు నీరు, విద్యుత్తు, నిత్యవసర సరుకులను నిలిపివేయడం అమానుషమని పేర్కొన్నారు. ఈ సంఘటన గరగపర్రును గుర్తుచేస్తోందని పేర్కొన్నారు. చంద్రబాబు పరిపాలనలో దళితులపై దాడులు నిత్యం కొనసాగుతున్నాయని తెలిపారు.నక్కదిన్నె, గంగపర్రు, దేవరపల్లి, జైత్రపోతులపాలెంలోని ప్రతి సంఘటన అధికార పార్టీ పెద్దల అండదండలతోనే కొనసాగుతున్నాయని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం దళితుల పట్ల వివక్షత చూపుతోందని మండిపడ్డారు.చంద్రబాబు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టేందుకుగాను విజయ వాడలో నిర్వహించనున్న సదస్సులో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

దళితుల గ్రామ బహిష్కరణ

- కర్నూలు జిల్లా నక్కలదిన్నెలో అగ్రవర్ణాల దాష్టీకం
- 11 మందిపై కేసు నమోదు



విశాలాంధ్ర-రుద్రవరం(కర్నూలు) : యుగాలు, తరాలు మారుతున్నా, మానవుడు అంతరిక్షంలో అడుగు పెడుతున్నా నాగరిక ప్రపంచంలో అనాగరికంగా నేటికీ దళితుల పట్ల అంటరానితనం, వివక్షత కొనసా గుతోంది. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో దళితులు వెట్టి పనులు చేయలేదని గ్రామ బహిష్కరణ చేశారు. వారికి నిత్యావసర సరకులు, తాగునీరు, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వివరాల్లోకి వెళితే... నక్కదిన్నె గ్రామంలో 20 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరందరు పూర్వకాలం నుంచి వంతుల వారీగా అగ్రవర్ణాలకు వెట్టి పనులు చేస్తున్నారు. వీరిలో సూది జయన్న, ఎలీషా, పుల్లన్న, దేవరాజు కుటుంబాలు వెట్టి పనులు చేయాల్సి వస్తోంది. కాలక్రమంలో అక్షరాస్యులుగా మారి వారి పిల్లలు చైతన్యవంతులు కావడం వల్ల వెట్టి పనులు పూర్తి గా మానివేశారు. దీంతో అగ్రవర్ణాలు నాలుగేళ్ల క్రితం జయన్న, సుబ్బరాయుడు కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరించారు. వారు ఇతర గ్రామాల్లోనే నేటికీ తలదా చుకుంటున్నారు. మిగిలిన రెండు కుటుంబాలు వెట్టి పనులు చేయాలని అగ్రవర్ణాల వారు కోరారు. ఆదివారం అగ్ర కులానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో దళితులు వెట్టి పనులకు రావడానికి తిరస్కరించారు. అగ్రవర్ణాల వారు చేసేదిలేక జేసీబీ సాయంతో గుంతను తీసి వారే స్వయంగా చనిపోయిన వ్యక్తిని పూడ్చుకున్నారు. చాలా రోజుల నుంచి వెట్టి పనులు చేయనందుకు దళితులపై ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు నీటి సరఫరా, నిత్యావసర సరకులు, విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. గ్రామం వదిలి వెళ్లకుంటే దాడులు తప్పవని హెచ్చరించడంతో దళితులు సత్యం, యేసు, తిరుపాలు, ఓబులేసు, పుల్లన్న, శేఖర్, దానం మరికొంతమంది రుద్రవరం పోలీసు స్టేషన్‌కు చేరుకొని జరిగిన సంఘటనపై ఎస్ఐ హనుమంతయ్యకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బహిష్కరించిన వారిని కఠినంగా శిక్షించాలి

నక్కలదిన్నెలో దళితులను బహిష్కరించిన అగ్రవర్ణాల వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, నాయకులు నరసింహులు, బంగారయ్య, మాబు హుసేన్‌లు డిమాండు చేశారు. సోమవారం గ్రామాన్ని సందర్శించారు. 24 గంటలైనా గ్రామంలో దళితులకు నీటి సరఫరా లేక గ్రామ సమీపంలోని వాగులో నీరు తెచ్చుకొని తాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. దౌర్జన్యంగా వెట్టి చేయించుకోవడం అనాగరిక చర్యని అన్నారు. దళితులకు గ్రామంలోని వందలాది ఎకరాల దేవాలయ భూములను పంచాలన్నారు. దళితులను గ్రామ బహిష్కరణ చేసిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు దళితులకు రక్షణ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

నక్కలదిన్నె గ్రామానికి చెందిన అగ్రవర్ణాలైన 11 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దళితులను గ్రామం నుంచి బహిష్కరించిన కేసులో మేగల ఎలీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ శంకర్‌రెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, పల్లె రామిరెడ్డి, ఎల్ల తిరుపాలు, గోపాల్‌రెడ్డి, వెంకట రామిరెడ్డి, బోయ పకీరయ్య, మల్లికార్జున, చిన్న సుబ్బరాయుడు, మౌలాలి, హుసేనిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



సీపీఐ రాష్ట్ర కార్యదర్శులకు అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణలను అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి డా.డి.సుధాకర్, తెలంగాణ ఐప్సో రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి కెవిఎల్‌తో కూడిన ప్రతినిధి బృందం సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. 2018లో చాడ వెంకటరెడ్డి, రామకృష్ణ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఐ మరింత బలోపేతం అవుతుందని, రెట్టింపు ఉత్సాహంతో ఉద్యమాలు సాగుతాయని డా.సుధాకర్ ఆకాంక్షించారు. ప్రజాసమస్యలను ఎజెండగా, జెండగా మల్చుకొని ఇరు రాష్ట్రాల కార్యదర్శులు పోరు సాగించడం ద్వారా పార్టీని ప్రజల హృదయాల్లో నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి: కడియం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాం క్షలు తెలియజేశారు. ఈ కొత్త సంవత్సరంలో అందరి ఆశలు నెరవేరాలని, సంతో షంగా ఉండాలని ఆకాంక్షించారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఇష్టపడి అభివృద్ధి చేస్తున్నారని, బంగారు తెలంగాణగా మార్చు తున్నారని, దేశంలో మనరాష్ట్రాన్ని నెంబర్ వన్‌స్టేట్‌గా కేసీఆర్ తీర్చిదిద్దుతున్నారన్నారు.

విశాలాంధ్ర

క్రీడలు

S & D

పూర్తి ఫిట్‌నెస్‌కు మరింత టైం



- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌జ్‌లో అవధి వారియర్స్‌కు సైనా ప్రాతినిధ్యం
- చీలమండల గాయం నుంచి కోలుకుంటున్న సైనా

ఈ నెలలో జరగబోయే ఇండియన్ ఓపెన్ తరువాత పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాననీ, పూర్తి ఫిట్‌నెస్ సాధించాలంటే మరింత టైం కావాలని అంటోంది స్టార్ షెట్లర్ సైనా నెహ్వాల్

హైదరాబాద్:
ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగేజ్‌లో అవధె వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సైనా నెహ్వాల్ కెనడాకు చెందిన మిచ్చెలి లిపై 4-3 తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా సైనా నెహ్వాల్ మాట్లాడుతూ 'ఈ టోర్నమెంటుకు ముందే నాకు చీలమండల గాయమైంది. మూడు వారాల తరువాతే మ్యాచ్ ఆడే అవకాశం ఉంది. ఇంకా మడమ నెప్పి వస్తోంది. ప్రాక్టీస్ చేస్తున్న సందర్భంలో కూడా నొప్పిగా అనిపించింది' అని సైనా తెలిపింది. 'ఇండియన్ ఓపెన్ తరువాత 2 నుంచి 3 వారాలు విశ్రాంతి కావాలి. వరల్డ్ చాంపియన్‌షిప్ అనంతరం గోపీసార్ వద్ద చేరేందుకు సమయం చాల్లేదు. చాలా టోర్నమెంట్లు జరిగాయి. ఆ తరువాతే నాకు గాయమైంది. ఇంకా తగ్గలేదు. నా ఆటలో ఇంకా వేగం ఉండాలి. బాగా తర్ఫీదు పొందితేనే ఆడే సామర్థ్యం వస్తుంది' అని పేర్కొంది. శిక్షణ తీసుకుంటున్నా మరింత బలంగా రూపొందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. 'ఇలాంటి సమయంలో ఆడాలని నిర్ణయం తీసుకుంటే గాయం మానకుండా శ్రమించాల్సి ఉంటుంది. అందుకే మరింత బలంగా మారేందుకు శిక్షణ తీసుకోవాలనుకుంటున్నా' అని తెలిపింది. గాయం ఎప్పుడైందని అడగ్గా 'సెప్టెంబరు ఆఖరులో, అక్టోబరు మొద లయ్యే సమయంలో ఈ గాయమైంది. చాలా తీవ్రమైన గాయం. దుబాయ్ సూపర్ సిరీస్‌కు కూడా దూరమవ్వాల్సి వచ్చింది. అందుకే ఆడలేదు. కానీ కండ రాలు ఒక్కసారిగా వదులవడంతో ఆడేం దుకు ప్రయత్నించగా, నొప్పనిపించింది. నవంబర్ ఆఖరులో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొన్నా. దాంతో ఇక విశ్రాంతి అవసరమనిపించింది. 'ఇకపై పూర్తి ఫిట్‌గా ఉంటేనే లక్ష్యాన్ని నిర్దే శించుకుంటా. ఫిట్‌నెస్, స్టామినా అనేవి ముఖ్యం. అవి ఉన్న తరువాతే ఆట. ప్రస్తుతం ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించు కోలేదు. ముందు ఫిట్‌నెస్ సాధించిన తరువాతే ఏదైనా' అని వివరించింది. 'ఒక ఆటగాడు మాత్రమే ఆధిపత్యం కొనసాగించేలా బీడబ్ల్యూఎఫ్ క్యాలెండర్ రూపొందించరు. ప్రతి టోర్నమెంటులోనూ ఒక కొత్త ఆటగాడు గెలుపొందే అవకాశం ఉంటుంది' అని తెలిపింది. 'ఎక్కువ టోర్నమెంట్లు ఆడుతున్నామంటే దాని అర్థం... గాయానికి అంత చేరువ తున్నట్టు. వరల్డ్ చాంపియన్ షిప్ తరువాత ఏషియన్స్ గేమ్స్‌కు కేవలం రెండు వారాలే సమయం. అంటే మానసికంగా, శారీరకంగా కూడా అలసిపోతాం. ఒకేసారి ఇన్ని టోర్నమెంట్లనేవి దారుణం' అని తెలిపింది. కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనల గురించి అడగ్గా.. 'దాని గురించి నాకు పూర్తిగా తెలియదు. నా ఆటలో ఎలాంటి తేడా రాలేదు. నేను ఇంకా వాటిని పరిశీలించాల్సి ఉంది. నా శరీరం సహకరిస్తే మ్యాచ్ ఆడగలను. ఒకవేళ రెండో గేమ్‌లో ఏమైనా తేడా ఉంటే వెనుకడుగు వేస్తా. ఒక మంచి మ్యాచ్ ఆడలేను' అని తెలిపింది.



'సఫారీల బౌలింగ్ కష్టమే'

కేప్‌టౌన్:
సొంతగడ్డపై దక్షిణాఫ్రికా అత్యంత ప్రమాదకరమైన జట్టు అనడంలో ఎటువంటి సందేహం లేదని టీమిండియా ఆటగాడు రోహిత్ శర్మ పేర్కొన్నాడు. ప్రపంచంలో అత్యుత్తమ బౌలింగ్ కలిగిన సఫారీలను ఓడించడం అంత తేలిక కాదన్నాడు. ప్రధానంగా బౌన్సీ వికెట్‌పై దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కోవడం కష్టమని అభిప్రాయపడ్డాడు. 'మెరుగైన జట్లలో సఫారీ ఒకటి. ప్రపంచ అత్యుత్తమ బౌలింగ్ దక్షిణాఫ్రికా సొంతం. సఫారీ గడ్డ మీద స్టెయిన్ అండ్ కో పేస్ బృందాన్ని ఎదుర్కోవడం కచ్చితంగా సవాల్‌తో కూడుకున్నది. సఫారీలపై పైచేయి సాధించాలంటే శ్రమించాల్సి ఉంది. అందుకు టీమిండియా సిద్ధంగా ఉంది' అని రోహిత్ పేర్కొన్నాడు.

మెరుగైన ఆటకోసమే పీబీఎల్ : మారిన్

న్యూఢిల్లీ:
ఆటలో పురోగతి సాధించేందుకే ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్(పీబీఎల్) ఆడుతున్నట్లు తెలిపింది రియో ఒలింపిక్ స్వర్ణపతక విజేత కరోలినా మారిన్. ప్రస్తుతం మారిన్ పీబీఎల్ కోసం భారత్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో మారిన్ హైదరాబాద్ హంటర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. తాజాగా మారిన్ మాట్లాడుతూ..'నా వరకు ఈ టోర్నీ ఎంతో ముఖ్యమైనది. పీబీఎల్‌లో ఆడటం, అందులోనూ హైదరాబాద్ హంటర్స్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు ప్రత్యేకం. నా ఆటతీరు మెరుగు పరుచుకునేందుకే పీబీఎల్ ఆడుతున్నాను. ఈ టోర్నీ ద్వారా అగ్రశ్రేణి క్రీడాకారులతో తలపడే అవకాశం దొరుకుతుంది. దీని ద్వారా మనం శిక్షణలో కొన్ని మార్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నా లక్ష్యం ఆల్‌ఇంగ్లాండ్ ఓపెన్, ప్రపంచ చాంపియన్‌షిప్ గెలవడం. వాటితో పాటు సూపర్ సిరీస్ టోర్నీలు' అని మారిన్ తెలిపింది. సోమవారం నుంచి పీబీఎల్‌లో మ్యాచ్‌లన్నీ లక్నో వేదికగా జరగనున్నాయి. నిన్నటి వరకు ఈ పోటీలు దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన సంగతి తెలిసిందే. టోర్నీలో భాగంగా ఈ రోజు బెంగళూరు-ముంబై మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.



దక్షిణాఫ్రికా బోర్డుపై కోహ్లి ఫైర్

కేప్‌టౌన్:
దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డుపై టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రాక్టీస్ కోసం పచ్చిక ఉన్న పిచ్‌ను అడిగితే జీవం లేని పిచ్‌ను తయారు చేసి ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. శిక్షణ కోసం వార్మప్ మ్యాచ్‌ను కూడా రద్దు చేసుకున్న టీమిండియా పిచ్‌ను చూసి నివ్వెరపోయింది. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా పూర్తి పచ్చికతో ఉన్న పిచ్ కావాలని టీమిండియా మేనేజ్‌మెంట్ దక్షిణాఫ్రికాను కోరింది. అయితే సౌతాఫ్రికా బోర్డు అందుకు విరుద్ధంగా జీవం లేని పిచ్‌ను ఇచ్చింది. ఇలాంటి పిచ్‌పై ప్రాక్టీస్ చేయడం వల్ల ఏమాత్రం ఉపయోగం ఉండదని కోహ్లి మండిపడ్డాడు. ఇలాంటి పిచ్‌ను ఎందుకు కేటాయించారంటూ నిలదీశాడు. అయితే భారత్ అడిగినట్టే పచ్చిక ఉన్న పిచ్‌ను తయారు చేసేందుకు ప్రయత్నించామని, అయితే సిబ్బంది అనుభవ లేమి వల్ల పిచ్ జీవం కోల్పోయినట్టు దక్షిణాఫ్రికా బోర్డు వివరణ ఇచ్చింది. దక్షిణాఫ్రికాతో టెస్ట్, వన్డే, టీ20 సిరీస్‌లను భారత్ ఆడనుంది. ఈనెల 5న కేప్‌టౌన్‌లో తొలి టెస్ట్ ప్రారంభం కానుంది.



డీజేగా రవిశాస్త్రి

కేప్‌టౌన్:
కొత్త ఏడాదికి కొద్ది గంటల ముందు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ రవిశాస్త్రి ట్విటర్ ద్వారా ఓ ఫొటో పోస్టు చేసి అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. డీజే అవతారంలో శాస్త్రి అభిమానుల్ని ఫిదా చేశాడు. ఇక అభిమానులు ఊరుకుంటారా.. 'డీజే రవి వావ్' అంటూ తెగ కామెంట్లు పెట్టారు. ప్రస్తుతం శాస్త్రి కోహ్లిసేనతో కలిసి దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. భారత్-దక్షిణాఫ్రికా మధ్య 3 టెస్టులు, 6 వన్డేలు, 3 టీ20ల షెడ్యూల్ ఈనెల 5 నుంచి ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో కోహ్లిసేన ఇప్పటికే సఫారీ గడ్డపై అడుగుపెట్టి క్రమం తప్పకుండా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటోంది. తాజాగా భారత జట్టు కోచ్ రవిశాస్త్రి తన ట్విటర్ ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. అంతేకాదు ఓ ఫొటోను పంచుకున్నాడు. ఈ ఫొటోలో రవిశాస్త్రి డీజే అవతారంలో అలరించాడు. కేప్‌టౌన్‌లోని ఓ పబ్‌లో దిగిన ఫొటోగా తెలుస్తోంది. ఈ ఫొటోకు అభిమానులు ఫిదా అయిపోయారు. గతంలో కామెంటేటర్‌గా అలరించిన శాస్త్రి ఇప్పుడు డీజేగా మారాడంటూ అభిమానులు పెద్ద సంఖ్యలో ట్వీట్లు పెడుతున్నారు. దీంతో ఇప్పుడు రవిశాస్త్రి ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'డీజే రవి వావ్', 'డీజే వాలే బాబూ' అంటూ కామెంట్లు చేస్తున్నారు.



బౌన్సీ పిచ్ డౌటే ..!

కేప్‌టౌన్:
భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్ట్‌కు బౌన్సీ పిచ్ సందేహమే! అదనపు పేస్, బౌన్స్‌కు ఇబ్బంది పడతారా అని భావిస్తున్న కోహ్లిసేనను కేప్‌టౌన్ వికెట్ అంత ఇబ్బంది పెట్టకపోవచ్చని తెలుస్తోంది. జనవరి 5న తొలి మ్యాచ్ ప్రారంభం కాబోతోంది. ఆతిథ్య జట్టుకు అనుకూలంగా పిచ్‌ను రూపొందించే పరిస్థితి కనిపించడం లేదు. చాన్నాళ్లుగా ఆ ప్రాంతంలో తీవ్ర కరవు ఉంది. నీటి వినియోగం తక్కువగా ఉంది. అక్కడి ప్రజలు రోజుకు 87 లీటర్ల కన్నా ఎక్కువ నీటిని వినియోగించడానికి వీల్లేదని ఆదేశాలు ఉన్నాయి. మైదానాన్ని తడిపేందుకు బోరు నీటినే వినియోగిస్తున్నా పరిస్థితి భిన్నంగా ఉందని పిచ్ క్యురేటర్ తెలిపారు. 'బోరు నీటితో ఎప్పటిలాగే రోజూ పిచ్‌ను తడుపుతున్నాం. ఔట్‌ఫీల్డ్‌ను మాత్రం వారానికి రెండుసార్లే తడుపుతున్నాం. అందుకే మైదానం అంత పచ్చికతో అందంగా కనిపించకపోవచ్చు. పొడిగా ఉండచ్చు. పిచ్‌పై పచ్చికను పెంచడం కష్టమే! పేస్‌కు అనుకూలించే పట్టు దొరకని టర్న్ అవ్వని పిచ్‌ను రూపొందించాలని అనుకుంటున్నాం. ఐతే రోజూ ఉదయం వానపడి తర్వాత ఎండకాస్తేనే అది సాధ్యం! అలా ఎన్నిరోజులు జరుగుతుందో చెప్పలేం' అని కేప్‌టౌన్ పిచ్ క్యూరేటర్ ఇవాన్ ఫ్లింట్ అన్నాడు. వాండరర్స్, సెంచూరియన్ తరహాలో కేప్‌టౌన్ పిచ్ ముందు బౌలర్లకు అనుకూలించినా తర్వాత ఇబ్బందులు ఎదురుకావచ్చు అని ఫ్లింట్ అంటున్నాడు. పిచ్‌పై చక్కగా పచ్చిక ఉంటేనే బంతి స్వింగ్ అవుతుంది. అదనపు బౌన్స్ లభిస్తుంది. నెర్రలు వాసి పొడిగా ఉంటే మాత్రం స్పిన్‌కు అనుకూలిస్తుంది.



కూకాబుర్రతో బౌలింగ్ సవాలే : భువి

కేప్‌టౌన్:
అదనపు బౌన్స్ ఆహ్వానించ తగిందే అయినా ఎరుపు రంగు కూకాబుర్ర బంతితో బౌలింగ్ చేయడం సవాలేనని టీమిండియా స్వింగ్ స్పెషలిస్టు భువనేశ్వర్ కుమార్ అన్నాడు. మూడు టెస్టుల సిరీస్ కోసం కోహ్లిసేన దక్షిణాఫ్రికా వెళ్లిన సంగతి తెలిసిందే. శుక్రవారం మైదానంలో రెండు సెషన్ల తర్వాత టీమిండియా ఇండోర్‌లోనూ సాధన చేసింది. వాతావరణం అను కూలంగా లేకపోవడమే ఇందుకు కారణం. జనవరి 5న కేప్‌టౌన్‌లో తొలి టెస్ట్ ఆరంభం కానుంది. 'దక్షిణాఫ్రికా పర్యటన అనగానే గుర్తొచ్చేది బౌన్సీ పిచ్‌లు. ఐతే ఇప్పుడు ఎలాంటి వికెట్లు రూపొం దిస్తారో చెప్పలేం. బ్యాట్స్‌మన్ లాగే బౌలర్‌కూ బౌన్స్ ఓ కీలక కారకం. కూకాబుర్రతో బౌలింగ్ చేయడం చాలా కష్టం. 25-30 ఓవర్ల తర్వాత వైవిధ్యానికి ఆస్కారం ఉండదు. వీటికి అలవాటు పడాలని అనుకుంటున్నాం. ఇంకా వ్యూహాల గురించి చర్చించలేదు. సుదీర్ఘంగా బౌలింగ్ చేయడంపై దృష్టిపెట్టాం. తొలి టెస్ట్‌కు కొన్ని రోజులు ముందు వ్యూహాలపై చర్చిస్తాం' అని భువి అన్నాడు. 'జట్టులో అందరూ ఆత్మ విశ్వాసంతో ఉన్నారు. అత్యుత్తమంగా ఆడితే సిరీస్ గెలిచేందుకు అవకాశం ఉందని మాకు తెలుసు. రెండేళ్లుగా మేం అన్ని పరిస్థితుల్లో బాగా ఆడాం. బౌలింగ్ టెక్నిక్స్‌ను మేం ఒకరితో మరొకరం పంచుకుంటాం. షమి, ఉమేశ్, ఇషాంత్ బంతిని స్వింగ్ చేయడం నా నుంచి నేర్చుకుంటున్నారు. దక్షిణాఫ్రికా అనగానే వచ్చే పెద్ద మార్పు బౌన్స్. ఫాస్ట్ బౌలర్లు దీన్ని ఆస్వాదిస్తారు. సఫారీ జట్టులో ఏబీ డివిలియర్స్ ఒక్కడే కాదు అందరూ ప్రమాదకారులే. అందర్నీ పెవిలియన్ పంపించాల్సిందే' అని భువనేశ్వర్ పేర్కొన్నారు.



నా కష్టానికి కూలి ఇవ్వాలిగా..!

- ఓట్ల కోసం అభివృద్ధి చేయడం లేదు
- జన్మభూమి మా ఊరు విజయవంతం చేయండి
- త్వరలో సూర్యారాధన ...
- సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - అమరావతి:
నా కష్టానికి ఓటు రూపంలో కూలి ఇవ్వండి...అలాగని ఓట్ల కోసం అభివృద్ధి చేయడం లేదు...అభివృద్ధి చేసిన వారికి కాకుండా ఎవరికి ఓటు వేస్తారు...ఓటు వేయకపోతే ఎందుకు వేయలేదని సిగ్గుపడాలి...వేయనివారు తర్వాత ఎందుకు వేయలేక పోయమాంటూ బాధ పడతారు. దేశంలో ఏ రాష్ట్రము చేయని విధంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం .. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 5వ విడత 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంతో మంగళవారం ప్రజల వద్దకు వెళుతోంది. పదిరోజుల పాటు కొనసాగే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం సందర్భంగా పాలనా యంత్రాంగమంతా ప్రజల ముంగిటకు తరలి వెళ్లనుంది. జనచేతనకు, సమస్యల తక్షణ పరిష్కారం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 2017లోని మంచి చెడులను విశ్లేషించుకుని నూతన సంవత్సరం-2018లోకి అడుగుపెట్టాం. కొత్త ఏడాదిలో మన మనసును, మన పరిసరాలను, సమాజాన్ని మరింత స్వచ్ఛంగా ఉంచుకుందాం. వినూత్నంగా ఆలోచించి సరికొత్త ఉత్సాహంతో ముందడుగు వేద్దాం. నవ్యాంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో ముందు నిలవాలనేదే మన ఆశయం. ఇందుకు మనందరం చేయిచేయి కలిపి సాగుదాం, కష్టపడదాం. మనందరి పవిత్ర కర్తవ్యంగా భావించి 'జన్మభూమి-మాఊరు'లో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని ఫలవంతం చేద్దాం. మీ అందరికీ నూతన సంవత్సర - సంక్రాంతి శుభాకాంక్షలు' అని చంద్రబాబు తెలిపారు. 'ప్రజలే ముందు' అనేది ప్రభుత్వ విధానం. అవినీతి రూపుమాపడానికి, సత్వరం సమస్యలు పరిష్కారం చేసేందుకు '1100' కాల్ సెంటర్ ఏర్పాటు చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా 'రియల్ టైమ్ గవర్నెన్స్'తో పాలనలో పారదర్శకతను, వేగాన్ని పెంచాం. 'జన్మభూమి-మాఊరు'లో అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు అందిస్తాం. 'చంద్రన్న బీమా' కింద రక్షణ కల్పిస్తాం. రైతన్న రుణం తీర్చుకునేందుకు మూడోవిడత 'రుణ ఉపశమనం' కూడా చేస్తున్నాం. డ్వాక్రా సంఘ సభ్యులకు వడ్డీయే కాకుండా, పెట్టుబడి సహాయం కూడా అందిస్తున్నాం. పది రోజులూ, పాలన మొత్తాన్ని మీ ముంగిటకు తీసుకువస్తున్నాం. ఈ అతిపెద్ద కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యుల దగ్గర నుంచి ప్రభుత్వాధికారుల వరకు పాలనా వ్యవస్థలోని అందరూ మీ ఊరిలో మీకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు ఈ నెలలో సూర్య ఆరాధన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. జలసికి హారతి, ఏరువాక, వనమహోత్సవమ్ వల్ల మంచి ఫలితాలు వచ్చాయి. అందుకే సూర్య ఆరాధన కార్యక్రమాన్ని జరపనున్నాం. జన్మభూమిలో లక్షా 50 వేలు రేషన్ కార్డులు, నాలుగు లక్షలు పెన్షన్‌లు, ఆరులక్షల గ్రూపులకు 750 కోట్లు వడ్డీ లేని రుణాలు, కార్పొరేషన్‌ల ద్వారా 3వేల కోట్ల రుణ సదుపాయం కల్పిస్తున్నాం. స్వార్థాన్ని వీడి, సొంత గ్రామాల అభివృద్ధికి గ్రామాల పెద్దలు, ఎన్‌ఆర్‌ఐ లు తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని బాబు కోరారు.



స్టార్ స్పోర్ట్స్‌కు ఖేలో ఇండియా ప్రసార హక్కులు

న్యూఢిల్లీ:
ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన ప్రసారహక్కులను స్టార్ స్పోర్ట్స్‌కు ఇవ్వాలని ప్రభుత్వం సోమవారం నిర్ణయించింది. ఈనెల 31 నుంచి ఈ ఆటలు మొదలుకానున్నాయి. ఈ పోటీల్లో జిమ్నాస్టిక్స్, బ్యాడ్మింటన్, హాకీ తదితర ఆటలు ఉంటాయి. 2022 వరకూ ఈ ప్రసార హక్కులు స్టార్ స్పోర్ట్స్ వద్దే ఉంటాయి. క్రీడా మంత్రిత్వశాఖతో కలిసి ఖేలో ఇండియా సంయుక్తంగా ఈవెంట్స్‌ను ప్రసారం చేసేందుకు స్టార్‌స్పోర్ట్స్‌ను ఎంచుకుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. R.No.32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.